www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 23-6-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 85 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: విదియ తె. 3.26 తదుపరి తదియ; నక్షత్రం: పూర్వాషాఢ సా. 5.04 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: రా.12.40-2.12; దుర్ముహూర్తం: సా.5.04-5.56; అమృతఘడియలు: మ.12.26-1.58; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.46; సూర్యాస్తమయం: 6.48 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



హైదరాబాద్ ఆపిల్

- నగర శివారు కందుకూరులో సాగు
- వేడిని తట్టుకునే అన్నా, హరిమాన్-99 రకాలు
- ఒక్కో మొక్క ఖరీదు రూ.200.. 3 ఏళ్లలో ఫలసాయం
- చెట్టుకు 200 కాయలు.. జూన్, డిసెంబరులో పండ్లు
- పూర్తి సేంద్రియ పద్ధతిలో.. ఎరువుగా ఆవుపేడ మాత్రమే
- కీటకాల నివారణ కోసం నీమ్ ఆయిల్ పిచికారీ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/ కందుకూరు)

హైదరాబాద్ శివార్లో మీకు కనీసం అర ఎకరం ఫామ్ హౌస్ ఉందా? ఆ తక్కువ స్థలంలోనే ఎక్కువ రాబడి వచ్చే పంట ఏదైనా సాగు చేయాలని అనుకుంటున్నారా? అయితే మీరు భేషుగ్గా ఆపిల్ తోట సాగు చేయొచ్చు! రాష్ట్రంలోని రైతన్నలూ ఈ దిశగా ఆలోచన చేయొచ్చు. మరి.. కశ్మీరు, హిమాచల్ ప్రదేశ్‌లో మాదిరిగా మనది శీతల వాతావరణం కాదు కదా? సాగుకు మన వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తాయా? సాగు పద్ధతులూ సంక్లిష్టమేమో? అనే సందేహాలు

మిగతా 11వ పేజీలో...



గంగుల కమలాకర్

కాంగ్రెస్‌లోకి?

- పార్టీ మార్పుపై ప్రచారం
- బీఆర్ఎస్‌ను వీడేది లేదంటున్న మాజీమంత్రి

13

ఈ-గేట్‌తో ఇమిగ్రేషన్!

- సులువు కానున్న అంతర్జాతీయ ప్రయాణాలు
- తనిఖీలు, క్యూలు లేకుండా.. స్వీయ ధ్రువీకరణ
- కొత్తగా అమలులోకి ఎఫ్‌టీఐ-టీటీపీ పథకం
- ప్రారంభించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- హైదరాబాద్‌తోపాటు 7 విమానాశ్రయాల్లో..
- పత్రాలు, బయోమెట్రిక్ సమాచారంతో ప్రయాణికుల వివరాలు ముందుగానే నమోదు

2

సీబీఐకి నీట్

పరీక్ష నిర్వహణ సంస్థ ఎన్‌టీఏ డీజీపై వేటు.. సంస్కరణలకు కమిటీ



ఎన్‌టీఏ డీజీ సుబోధ్ కుమార్‌సింగ్

నేడు జరగాల్సిన నీట్-పీజీ వాయిదా

- ఎల్లుండి నుంచి పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో కేంద్రం నష్ట నివారణ చర్యలు
- ఫలించిన విద్యార్థులు, విపక్షాల ఒత్తిడి
- పరీక్షల పవిత్రత కాపాడతాం: కేంద్రం
- లీక్ రాకెట్ ముందు మోదీ నిస్సహాయం
- అసమర్థ నాయకత్వంతో పిల్లల భవిష్యత్తుకు ప్రమాదం: రాహుల్

న్యూఢిల్లీ, జూన్ 22: రెండు వారాలకు పైగా దేశవ్యాప్తంగా విద్యార్థులు జరుపుతున్న పోరాటం, జాతీయ స్థాయిలో బలపడిన విపక్షం ఒత్తిడి ఫలించాయి. జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన నీట్-యూజీ, యూజీసీ-నెట్ ప్రవేశ పరీక్షల లీక్ వ్యవహారాలపై విమర్శలు వెల్లువెత్తి, ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతినడం, సోమవారం నుంచి జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో అదే ప్రధాన అంశం అయ్యే పరిస్థితి కనిపించడంతో కేంద్ర ప్రభుత్వం నష్ట నివారణ చర్యలను ప్రారంభించింది. శనివారం మధ్యాహ్నం నుంచి చకచకా పలు నిర్ణయాలు తీసుకుంది. మొదట నీట్ పరీక్షను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ప్రక్షాళనకు ఉన్నత స్థాయి కమిటీని వేసింది. తర్వాత ఎన్‌టీఏ అధిపతిని పదవి నుంచి తప్పించింది. అసలు ఎన్‌టీఏకు లోపాల్లేకుండా పరీక్షలు నిర్వహించే సామర్థ్యం ఉందో లేదో తేల్చుకొనే వరకు పరీక్షల నిర్వహణకు విరామం ప్రకటించే కార్యక్రమంలో భాగంగా ఆదివారం జరగాల్సిన నీట్-పీజీ పరీక్షను వాయిదా వేసింది. చివరగా శనివారం రాత్రి నీట్ లీక్ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. లీక్ మూలాలను తేల్చేందుకు సమగ్ర దర్యాప్తు కోసమే సీబీఐకి అప్పగిస్తున్నట్లు కేంద్ర విద్యాశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. సీబీఐ దర్యాప్తు

మిగతా 2వ పేజీలో...

నీట్ లీకేజీ సూత్రధారి

రవి అత్రి అరెస్టు

- ఝార్ఖండ్‌లో మరో ఆరుగురికి బేడీలు
- నిందితుల ఫ్లాట్ నుంచి పేపర్ సీజ్
- 14కు చేరిన అరెస్టుల సంఖ్య
- కుట్రదారు ముఖియా కోసం వేట
- బిహార్‌లోని ప్రైవేటు కాలేజీలపై నిఘా

లీకేజీ నిరోధక చట్టం

కంటి తుడుపు చర్య!

- ఫిబ్రవరిలోనే ఎందుకు తేలేదు?
- నోటిఫై చేశామని అబద్ధాలెందుకు?
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

2

అడ్డుకట్టే పెద్ద 'ప్రశ్న'!!

- ఏడేళ్లలో 70 పైగా పేపర్ల లీక్.. 1.70 కోట్ల మందిపై ప్రభావం
- దేశంలోని పదిహేను రాష్ట్రాల్లో ఘటనలు.. అధికారులు, టీచర్ల పాత్ర
- ప్రింటింగ్ ప్రెస్‌ల నుంచి కూడా.. సోషల్ మీడియా కూడా ఓ వాహకమే
- లీకు తర్వాత చర్యలకే చట్టాలు పరిమితం.. తాజా చట్టమూ ఇలానే..!



శంషాబాద్‌లో

బసవతారకం ఆస్పత్రి వ్యవస్థాపక దినోత్సవంలో సీఎం రేవంత్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఆస్పత్రి చైర్మన్ బాలకృష్ణ

తెలంగాణలో రుణమాఫీ

చరిత్రాత్మకం

- అణగారిన వర్గాల అభివృద్ధికి ఇదే గ్యారెంటీ
- చెప్పింది చేయడం.. మా అలవాటు: రాహుల్
- 40 లక్షల కుటుంబాలకు లబ్ధి హర్షణీయం: ఖర్గే

హెల్త్ హబ్!

విమానాశ్రయం వద్ద 500-1000 ఎకరాల్లో ఏర్పాటు

- ప్రపంచ నలుమూలల నుంచి వచ్చేవారికి అన్ని రకాల వ్యాధుల చికిత్సకు భరోసా
- ప్రపంచ స్థాయి ఆస్పత్రులకు హబ్‌లో చోటు
- బసవతారకం ఆస్పత్రికీ అందులో అవకాశం
- అభివృద్ధిలో బాబుతో పోటీపడే చాన్స్ వచ్చింది
- ఇక 12 కాదు 18 గంటలు పని చేయాల్సిందే
- తెలుగు రాష్ట్రాలు అందరికీ ఆదర్శం కావాలి
- బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వ్యవస్థాపక దినోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నలు మూలల నుంచి ఎవరైనా హైదరాబాద్‌కు వస్తే అన్ని రకాల వైద్య సేవలు అందుతాయనే భరోసా కల్పించే విధంగా హైదరాబాద్‌లో హెల్త్ టూరిజం హబ్‌ను ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం ఆలోచిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. శంషాబాద్ విమానాశ్రయం పరిసరాల్లో 500 నుంచి వెయ్యి ఎకరాల్లో అన్ని సదుపాయలతో ఈ హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. శనివారం బసవతారకం

మిగతా 13వ పేజీలో...

రాష్ట్ర సచివాలయంతో పాటు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోనూ ఇకపై సీఎం సమీక్షలు

13

కుళ్లిన యంత్రాంగం!

రాజకీయాలలో ఆత్మవిమర్శ చేసుకుని ముందుకుసాగిన వాడే కింద పడినా పైకి లేవగలడు. జగన్మోహన్ రెడ్డిది విపరీత మనస్తత్వం అని గతంలో అనేక పర్యాయాలు చెప్పుకొన్నాం. ఆయనలో సాధారణ లక్షణాలు ఉండివుంటే తన నివాసం కోసం రుషికొండపై 550 కోట్లు ప్రజాధనం ఖర్చు చేసి మాయామహల్ నిర్మించుకొని ఉండేవారు కాదు. ఆ భవనాన్ని సొంత డబ్బుతో నిర్మించుకొని ఉంటే ఎవరికీ అభ్యంతరం ఉండేది కాదు. జనం సొమ్ముతో విలాసంగా బతకడానికి మనం రాచరిక వ్యవస్థలో లేం కదా? తాడేపల్లి ప్యాలెస్ వద్ద నాలుగు వైపులా కాంపౌండ్ వాల్‌పై 30 అడుగుల ఎత్తులో గ్రిల్ నిర్మించుకోవడాన్ని ఎవరైనా ఎలా జీర్ణించుకోగలరు? ఒక ముఖ్యమంత్రి రక్షణకు 30 అడుగుల ఎత్తులో గ్రిల్ నిర్మించుకోవడం విపరీత మనస్తత్వానికి నిదర్శనం కాదా? ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వ్యక్తికి ఇలాంటి ఆలోచనలు ఎందుకొస్తాయో తెలియదు! జగన్ మానసిక పరిస్థితిపై మానసిక వైద్యులు పరిశోధనలు చేయవలసిన అవసరం ఉంది.



కొత్త పలుకు

ఏపీలో అధికార మార్పిడి జరిగిన తర్వాత అప్పట్లో పరిస్థితులు ఎలా ఉండేవో అధికారులు నోరు విప్పి చెప్పడం మొదలుపెట్టారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అయివుండి కూడా ఇంతగా ఎందుకు దిగజారిపోయారని ప్రశ్నించగా, "జగన్ పాలనలో ఒక రకమైన భయానక వాతావరణం ఉండింది. మనసులో మాట చెప్పుకోవడానికి కూడా సాహసించలేకపోయాం. భయం గుప్పిట్లో బతికాం. అందుకే మనను చంపుకొని పని చేశాం" అని కొంత మంది అధికారులు చెబుతున్నారు. మొత్తమ్మీద జగన్‌తో పాటు ఆయన కోటరీలో ఉన్న వారి విపరీత మనస్తత్వాల వల్ల అధికార యంత్రాంగం కుళ్లిపోయింది. తెలంగాణలోనూ అధికార వ్యవస్థ భ్రష్టుపట్టింది. ప్రగతిభవన్ పేరిట ప్యాలెస్‌ను పోలిన భవనాన్ని నిర్మించి అందులో నుంచి కాలు బయటపెట్టకుండా కనుసైగలతో రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు.

ఏపీ సీఎంగా చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు, చేసిన ఎంపికలపై తెలుగు తమ్ముళ్లు నిరసన వ్యక్తంచేస్తున్నారు. జగన్ సృష్టించిన సంప్రదాయం ఆమోదయోగ్యం కాకపోయినా చంద్రబాబు కూడా అలాగే వ్యవహరించాలని తెలుగు తమ్ముళ్లు సోషల్ మీడియాలో రెచ్చిపోతున్నారు. జగన్ తరహాలోనే పాలించే పక్షంలో ప్రభుత్వం మారడం ఎందుకు? జగన్‌ను జనం కసిగా ఎందుకు ఓడించారో తెలుసుకోవడానికి కూడా తెలుగు తమ్ముళ్లు అంగీకరించడం లేదు. దీంతో తెలుగు తమ్ముళ్లు చంద్రబాబును టార్గెట్‌గా చేసుకొని సోషల్ మీడియాలో విమర్శలు చేస్తున్నారు. జగన్‌లాగా కక్షపూరిత పాలన చేయాలనుకోవడం సమర్థనీయం కాదు. అదే జరిగితే రాష్ట్రం మొత్తం ఫ్యాక్షన్ జోన్‌గా మారిపోతుంది. అదే సమయంలో విచ్చలవిడి అతిమీరిన ఉదారత్వం కూడా ప్రదర్శించకూడదు.

4

గత శాసనసభలో స్పీకర్ తమ్మినేని సీతారాం కూడా ప్రతిపక్షంపై తరచుగా నోరు పారేసుకున్నారు. ఇప్పుడు స్పీకర్‌గా ఎన్నికైన చింతకాయల అయ్యన్నపాత్రుడికి కూడా నోటి దురుసు ఎక్కువే. సభాపతిగా ఆయన ఎలా వ్యవహరిస్తారో చూడాలి. సభను ఆయన అదుపు చేస్తారో? ఆయనను సభ అదుపు చేస్తుందో? చూడాలి.

ప్రభుత్వాన్ని నడిపించడంలో సారథికి స్వేచ్ఛ ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరినందున కూటమిలోని భాగస్వామ్య పక్షాలు కూడా తమ మాటకు విలువ ఉండాలని, పదవుల పంపకంతో పాటు అధికారంలో వాటా ఉండాలని కోరుకుంటారు. చంద్రబాబుకు ఇదొక విషమ పరీక్ష. అయితే అనేక డక్కామొక్కీలు తిన్న అనుభవం ఉన్నందున, జనసేనాని పవన్ మనసు నొప్పించకుండా చాకచక్యంగా వ్యవహరిస్తారని భావించవచ్చు.

సోషల్ ఇంజనీరింగ్ పేరిట ఎన్నికల్లో కులాలవారీగా సీట్లు కేటాయించినా ఫలితం ఉండదు. గుడ్ గవర్నెన్స్‌కు మాత్రమే ప్రజల మద్దతు ఉంటుంది. ఈ ప్రభుత్వం మాది- ఈ ప్రభుత్వంలో మేమంతా హాయిగా జీవిస్తున్నాం. ఏ ఒక్క వర్గానికీ అన్యాయం జరగలేదు.. ప్రతి వర్గానికీ మేలు చేస్తున్నారన్న భావన ప్రజల్లో ఏర్పడాలి. అప్పుడే ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఫీల్ గుడ్ భావన ఏర్పడుతుంది. సంక్షేమం పేరిట ప్రజలకు ఎంతోకొంత పడేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తామంటే కుదరదని జగన్ విషయంలో రుజువైంది.



వైసీపీ అక్రమాలపై బుల్డోజర్!

ఏపీలోని తాడేపల్లి ఇరిగేషన్ భూమిలో అనుమతుల్లేకుండా చేపట్టిన నిర్మాణం కూల్చివేత

- 17 ఎకరాల బోటుయార్డు భూమి స్వాహాకు కుట్ర
- పార్టీ ఆఫీసు కోసం రెండెకరాలు కేటాయిస్తూ జీవో
- ఆ భూమిని స్వాధీనం చేయని జలవనరుల శాఖ
- అయినా ఎన్నికల ముంగిట అడ్డగోలు నిర్మాణాలు
- కార్పొరేషన్ అనుమతి, సీఆర్‌డీఏ పర్మిషన్లూ లేవు
- దీంతో నిబంధనల మేరకు పలు నోటీసులు జారీ
- హైకోర్టులో వైసీపీ పిటిషన్.. లభించని ఊరట
- చట్టబద్ధంగా వ్యవహరించాలని కోర్టు ఆదేశం
- చివరికి శనివారం తెల్లవారుజామున కూల్చివేత

మంగళగిరి, జూన్ 22: ఏపీ జలవనరుల శాఖ భూముల స్వాహాకు వైసీపీ నాయకత్వం చేసిన ప్రయత్నాలను అధికారులు అడ్డుకున్నారు. అనుమతుల్లేకుండా భూమిని స్వాధీనం చేసుకుని.. అందులో అడ్డగోలుగా ఆ పార్టీ నిర్మిస్తున్న భవనాన్ని కూల్చివేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం పరిధిలోని తాడేపల్లిలో శనివారం తెల్లవారుజామున ఈ సంఘటన చోటుచేసుకుంది. తాడేపల్లి పాత, కొత్త హైవేల నడుమ జలవనరుల శాఖకు సర్వే నంబరు 202-ఏలో అత్యంత ఖరీదైన 17.03 ఎకరాల భూమి (తాడేపల్లి బోటు యార్డు స్థలం) ఉంది. ఇక్కడ ఎకరా విలువ రూ.25 కోట్ల వరకు ఉంది. దీనిని హస్తగతం చేసుకునేందుకు వైసీపీ నాయకత్వం పెద్ద పథకమే వేసింది. 17.03 ఎకరాల్లో రెండెకరాల స్థలాన్ని వైసీపీ కార్యాలయ భవనం కోసమంటూ నిరుడు ఫిబ్రవరి 16న జీవో 52 విడుదల చేయించుకుంది. ఇరిగేషన్ భూముల్లో ఎలాంటి కాంక్రీటు

మిగతా 3వ పేజీలో...

3

సొంతూరిలో జగన్‌కు షాక్

- బిల్లులు అందలేదని క్యాడర్ గగ్గోలు
- తోపులాటలో కిటికీ అద్దాలు ధ్వంసం
- మాజీ సీఎంగా తొలిసారి కడప జిల్లాకు
- కనిపించని వైసీపీ శ్రేణుల హడావుడి

ఏపీ అసెంబ్లీలో చానళ్లపై

నిషేధం ఎత్తివేత

తొలి సంతకం చేసిన స్పీకర్ అయ్యన్న

రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే.. 'సింగరేణి'పై

విచారణ జరిపించాలి

- సింగరేణి దివాలాకు కేసీఆర్, ఆయన కుటుంబం కారణం
- మితిమీరిన జోక్యంతో అప్పుల పాలు చేశారు
- గనుల వేలాన్ని పారదర్శకంగా నిర్వహిస్తున్నాం
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

14

సింగరేణి దివాలాకే బొగ్గు బ్లాకుల వేలం: సీపీఎం

- 28, 29 తేదీల్లో ధర్నాకు పిలుపు
- కొత్తగూడెం, భూపాలపల్లిలో సీఐటీయూ నిరసనలు

ప్రైవేట్ హాస్టళ్లకు జీఎస్టీ మినహాయింపు

- రైల్వేలో పలు సేవలపైనా జీఎస్టీ రద్దు
- పలు ఉత్పత్తులపై 12 శాతానికి తగ్గింపు
- పెట్రోల్, డీజిల్‌పై రాష్ట్రాలదే నిర్ణయం
- జూన్ 30 దాకా రిటర్న్ దాఖలుకు చాన్స్
- 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో నిర్మల

రాష్ట్రానికి కేంద్ర పథకాల వాటా పెంచాలి

'పాలమూరు-రంగారెడ్డి'కి జాతీయ హోదా ఇవ్వాలి: భట్టి



న్యూఢిల్లీ, జూన్ 22: ప్రైవేటు హాస్టళ్లలో ఉండే విద్యార్థులు.. రైల్వే ప్రయాణికులకు శుభవార్త..! కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ అధ్యక్షతన శనివారం జరిగిన 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో.. పలు సేవలకు పన్ను మినహాయింపునిస్తూ నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థులు విద్యాసంస్థల హాస్టళ్లలో కాకుండా.. ప్రైవేటు వసతి గృహాల్లో ఉంటే.. నెలవారీ అద్దెపై జీఎస్టీని మినహాయించాలని కౌన్సిల్ నిర్ణయించింది. అయితే.. విద్యార్థుల నుంచి

మిగతా 2వ పేజీలో...

నీట్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయానికి కొద్ది గంటల ముందు కేంద్రం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ సుబోధ్ కుమార్‌సింగ్‌పై వేటేసింది. ఆయన స్థానంలో ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్ ఛైర్మన్ అయిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రదీప్‌సింగ్ కరోలాకు ఎన్‌టీఏను అదనపు బాధ్యతగా అప్పగించారు. సుబోధ్ కుమార్ సింగ్‌ను కంపల్సరీ వెయిట్‌లో ఉంచారు. సుబోధ్ కుమార్ సింగ్ ఎన్‌టీఏ డీజీ హోదాలో దాదాపు 1500 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇచ్చి నీట్-యూజీ పరీక్షపై వివాదానికి తెర తీశారు. సుబోధ్‌పై వేటు సమయంలోనే ఆదివారం (జూన్ 23న) జరగాల్సిన నీట్-పీజీ ప్రవేశ పరీక్షను వాయిదా వేశారు. వరుసగా రెండు పరీక్షల ప్రశ్నపత్రాలు లీకయిన నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ముందు ఎన్‌టీఏ పరీక్షల నిర్వహణ సామర్థ్యాన్ని అంచనా వేయాలని నిర్ణయించారు. ఈ పరీక్ష మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారనేది తర్వాత ప్రకటించనున్నారు. నీట్ తదితర పోటీ పరీక్షలను నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ను సంస్కరిస్తున్నట్లు శనివారం మధ్యాహ్నం కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా ఇస్రో మాజీ ఛైర్మన్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలో ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ రెండు నెలల్లో నివేదిక సమర్పిస్తుందని తెలిపింది. ఎన్‌టీఏ పరీక్షలను సజావుగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం కోసం, ఎన్‌టీఏ డేటాను భద్రపరిచే పద్ధతులను, ఎన్‌టీఏ నిర్మాణం, పనితీరును, పరీక్షలు నిర్వహించే తీరును మెరుగుపరచడానికి సలహాలు ఇస్తుందని చెప్పింది. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వీసీ బి.జె.రావు, ఢిల్లీ ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ రణ్‌దీప్ గులేరియా, ఐఐటీ మద్రాస్‌కు చెందిన ప్రొఫెసర్ రమణమూర్తి, పంకజ్ బన్సల్, ఢిల్లీ ఐఐటీకి చెందిన ప్రొఫెసర్ ఆదిత్య మిట్టల్, విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి గోవింద్ జైశ్వాల్ ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారని ప్రకటించింది. పరీక్షల వ్యవస్థ సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు తొలి అడుగని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. అన్ని రకాల అక్రమాలకు అవకాశాలను మూసేస్తామని చెప్పారు. మొత్తం ఎన్‌టీఏ వ్యవస్థనే ప్రక్షాళిస్తామని ప్రకటించారు. పేపర్ కూర్పు మొదలు ఫలితాల విడుదల వరకు అన్ని దశల్లో ఇప్పటికే ఉన్న విధానాలను ఈ కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు. ఇప్పటికే ఎన్‌టీఏ ఆధ్వర్యంలో జరిగిన నీట్, యూజీసీ-నెట్ పరీక్షలు లీక్ అయినట్లు తేలింది. నీట్‌పై నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా, యూజీసీ-నెట్‌ను రద్దు చేశారు.




నీట్‌కు వ్యతిరేకంగా వారాణసీలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన, పట్నాలో నిరసన ప్రదర్శన

విపక్షం ఒత్తిడి పని చేసింది

ఎన్‌టీఏ పరీక్షలకు సంబంధించి పదేపదే లీకుల ఆరోపణలు రావడం, విద్యార్థులకు కలిగిన ఇబ్బందులు, వారిలో వ్యక్తమైన ఆగ్రహావేశాలు, బలం పుంజుకున్న విపక్షం ఒత్తిడి... వెరసి అన్నీ కలిసి సుబోధ్ కుమార్ సింగ్‌పై వేటు వేయక తప్పని పరిస్థితిని కల్పించాయి. సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు కూడా ప్రభుత్వంపై పని చేశాయి. ఎన్‌టీఏను ప్రక్షాళిస్తామని విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్వయంగా చెప్పిన నేపథ్యంలో ప్రక్షాళనలో సుబోధ్ కుమార్ సింగ్‌ను వెళ్లగొట్టడాన్ని భాగంగా చూడవచ్చని అంటున్నారు. శనివారమే ఆయన లీకుల ఆరోపణల నేపథ్యంలో ఎన్‌టీఏ అగ్ర నాయకత్వం మొత్తం మీద దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల కేంద్ర కేబినెట్ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ధర్మేంద్ర ప్రధాన్‌ను చర్యలు కనిపించాలని ఆదేశించారు. ఫలితంగానే వేటు పడిందని భావిస్తున్నారు. పేపర్ లీక్ ఆరోపణను మూలాల వరకు దర్యాప్తు చేసి, అసలు దోషులను పట్టుకోవడం తమ ముందు ఉన్న ప్రధాన కర్తవ్యమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సుప్రీంకోర్టులో నీట్ లీకేజీ కేసు జూలై 8న విచారణకు రానుంది. కోర్టు కూడా నీట్ రద్దు చేయలేమని, ఆరోపణల నిజానిజాలు తేల్చమని చెప్పింది. ఈ నేపథ్యంలో దర్యాప్తులో పురోగతి సాధించడం మీద ప్రభుత్వం దృష్టి సారించింది. పరీక్షల పవిత్రతను, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటానికి తాము కట్టుబడి ఉన్నామని శనివారం రాత్రి కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

నీట్-పీజీ తేదీలు మళ్లీ ప్రకటిస్తారు

వరుసగా రెండు పరీక్షల ప్రశ్నపత్రాలు లీకయిన నేపథ్యంలో ఆదివారం జరగాల్సిన నీట్ పీజీ పరీక్షలను వాయిదా వేశారు. ముందు ఎన్‌టీఏ పరీక్షల నిర్వహణ సామర్థ్యాన్ని అంచనా వేయాలని నిర్ణయించారు. ఈ పరీక్ష మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారనేది తర్వాత ప్రకటించనున్నారు. ఈ పరీక్షలు కూడా ఎన్‌టీఏ ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి. జూన్ 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు జరగాల్సిన సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ పరీక్షలను శుక్రవారం రాత్రి వాయిదా వేశారు. లాజిస్టికల్ సమస్యల కారణంగా వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. నీట్-పీజీ వాయిదా వార్త వెలువడగానే కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ స్పందించారు. ఏదో ఒక పరీక్ష రద్దు/వాయిదా లేకుండా రాత్రి తెల్లారడం లేదని ఎద్దేవా చేశారు. మోదీ నాయకత్వంలో విద్యా వ్యవస్థ కుళ్లిపోయిందని చెప్పడానికి నీట్-పీజీ వాయిదా మరో దురదృష్టకర ఉదాహరణ అని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. పేపర్ లీక్ రాకెట్ ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఏమీ చేయలేని నిస్సహాయుడిగా మారారని అన్నారు. ఆయన అసమర్థ ప్రభుత్వం పిల్లల భవిష్యత్తుకు పెద్ద ప్రతిబంధకం కానుందని చెప్పారు.

నీట్ లీకేజీ సూత్రధారి రవి అత్రి అరెస్టు



పట్నా, జూన్ 22: నీట్-యూజీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో కీలకంగా వ్యవహరించిన రవి అత్రిని ఉత్తరప్రదేశ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్‌టీఎఫ్) పోలీసులు శనివారం అరెస్టు చేశారు. లీకేజీ కుట్రదారు సంజీవ్ ముఖియాకు అత్రి సన్నిహితుడు. నోయిడాకు చెందిన అత్రి తాజా కేసులో మధ్యవర్తిగా వ్యవహరించాడని, గతంలోనూ పేపర్ లీకేజీలో అరెస్టయ్యాడని పోలీసులు వివరించారు. 2007లో వైద్య విద్యలో ప్రవేశాలకు కోచింగ్ తీసుకునేందుకు అత్రి రాజస్థాన్‌లోని కోటాకు వెళ్లాడని, 2012లో పరీక్ష పాసై.. ఎంబీబీఎస్ సీటు సంపాదించాడని చెప్పారు. అయితే.. ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం పరీక్షలు రాయకుండా.. నోయిడా చేరుకుని, పేపర్ లీకేజీ మాఫియాతో చేతులు కలిపాడని వెల్లడించారు. "సాల్వర్ గ్యాంగ్‌ను ఏర్పాటు చేసి.. విద్యార్థుల స్థానంలో నకిలీ వ్యక్తులను పంపించేవాడు" అని వివరించారు. అత్రి పట్టివేతతో ఈ కేసులో బిహార్ పోలీసుల అరెస్టుల సంఖ్య 14కు పెరిగింది. నిందితులను విచారించగా.. సంజీవ్ ముఖియా పేరు ప్రముఖంగా వెలుగులోకి వచ్చిందని, ఈ లీకేజీ రాకెట్ వెనక ప్రధాన కుట్రదారు అతడేనని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు ఈ కేసును దర్యాప్తు చేస్తోన్న బిహార్ ఆర్థిక నేరాల విభాగం(ఈవోయూ) అధికారులు శనివారం ఝార్ఖండ్‌లో ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. నిందితులు నీట్ పరీక్షకు ముందు పట్నాలో అద్దెకు దిగిన ఫ్లాట్ నుంచి ప్రశ్నపత్రాన్ని సీజ్ చేశామని, ఎన్‌టీఏ అధికారులు పంపిన రిఫరెన్స్ ప్రశ్నపత్రంతో దాన్ని పరిశీలిస్తున్నామని ఈవోయూ అధికారులు తెలిపారు. "ఈ కేసులో బిహార్‌లోని మరికొన్ని కాలేజీలపై నిఘా పెట్టాం. నీట్ పరీక్ష జరిగిన రోజు ఏయే కాలేజీల్లో పరీక్ష కేంద్రాలున్నాయి? వాటిల్లోకి విద్యార్థుల బదులు సాల్వర్ గ్యాంగ్ వ్యక్తులు లోనికి ఎలా వెళ్లగలిగారు? ఆయా విద్యాసంస్థల్లో వారికి సహకరించిన వారెవరు? ఈ గ్యాంగ్ పంపిన విద్యార్థుల సీటింగ్ అరేంజ్‌మెంట్ ఒకేచోట వచ్చేలా చేయడానికి సహకరించిందెవరు? అనే కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నాం. కాలేజీల సిబ్బంది, సాల్వర్లకు భారీగా నగదు అందినట్లు గుర్తించాం. మనీలాండరింగ్ కోణంలో ఈడీ కూడా రంగంలోకి దిగనుంది" అని వివరించారు. నిందితుల నుంచి నిజాలను రాబట్టేందుకు నార్కో అనాలిసిస్, బ్రెయిన్ మ్యాపింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

ఎవరీ ముఖియా?

సంజీవ్ ముఖియా బిహార్‌లోని నలంద జిల్లా నాగర్‌సోనా ప్రాంతానికి చెందినవాడు. తొలుత సాబూర్ వ్యవసాయ కళాశాలలో పనిచేశాడు. అక్కడ ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణలతో 2016లో అరెస్టయ్యి, జైలుకు వెళ్లాడు. ఆ తర్వాత నలంద కాలేజీలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేశాడు. గతంలో ప్రభుత్వ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ కేసుల్లో ఇతని పేరు బయటకు వచ్చింది. ఇతని కుమారుడు, వైద్యుడు శివకుమార్ బిహార్ టీచర్ల నియామక పరీక్ష పేపర్ లీకేజీలో ప్రస్తుతం జైల్లో ఉన్నాడు. సంజీవ్ ముఖియా, శివకుమార్ కలిసి 'ముఖియా సాల్వర్ గ్యాంగ్'ను ఏర్పాటు చేశారు. ఈ కేసులో లీకైన ప్రశ్నపత్రం తొలుత ముఖియాకే అందిందని బిహార్ ఈవోయూ పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం పరారీలో ఉన్న ముఖియా అరెస్టుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

నీట్‌ను ఎందుకు రద్దుచేయలేదంటే

ప్రశ్నపత్రం లీక్ అయినట్లు ఆధారాలున్నా.. అరెస్టులు జరుగుతున్నా.. నీట్-యూజీ పరీక్షను రద్దు చేయకపోవడంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం వివరణ ఇచ్చారు. లీకేజీ ఓ ప్రాంతానికి మాత్రమే.. అదికూడా కొందరు వ్యక్తులకు మాత్రమే పరిమితమైందన్నారు. "కౌన్సెలింగ్ ప్రక్రియకు ఆటంకం కలగకుండా ఉండాలనే ఈ నిర్ణయం తీసుకున్నాం. 24 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షను రాశారు. నీట్‌ను రద్దు చేస్తే.. నిజాయితీగా పరీక్ష రాసినవారికి ఇబ్బందులు కలుగుతాయి. ఈ వ్యవహారం ఇప్పటికే సుప్రీంకోర్టు పరిధిలో ఉంది. కోర్టు నిర్ణయమే ఫైనల్" అని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రైవేట్ హాస్టళ్లకు జీఎస్టీ మినహాయింపు



(మొదటి పేజీ తరువాయి)

వసూలు చేసే నెలవారీ అద్దె రూ.20 వేల లోపు ఉండాలి. హాస్టళ్ల నిర్వాహకులు మోసాలకు పాల్పడకుండా ఉండేందుకు.. సంబంధిత విద్యార్థి కనీసం 90 రోజులుగా ఆ వసతి గృహంలో ఉండాలనే నిబంధనను పెట్టారు. అంతేకాదు.. రైల్వే స్టేషన్లలో ప్లాట్‌ఫారం టికెట్లు, వెయిటింగ్ రూమ్, క్లోక్‌రూమ్ చార్జీలు, ప్లాట్‌ఫారాలపై బ్యాటరీ కారు సేవలను కూడా జీఎస్టీ నుంచి మినహాయించారు. ఇక ఇప్పటి వరకు రెండు స్లాబులుగా ఉన్న సోలార్ కుక్కర్ల జీఎస్టీని 12శాతంగా సవరించారు. ఫైర్ సహా.. అన్నిరకాల స్ప్రింక్లర్లు, పౌల్ట్రీ యంత్రాలు, అన్ని రకాల కార్టన్లు(అట్టపెట్టెలు), ఇనుము, ఉక్కు, అల్యూమినియంతో తయారు చేసిన పాలక్యాన్లపై జీఎస్టీలను ఏకీకృతం చేస్తూ.. 12శాతానికి తగ్గించారు.

చిరు వ్యాపారులకు లబ్ధి

జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో చిరు వ్యాపారులకు మేలు కలిగేలా నిర్ణయాలు తీసుకున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ వెల్లడించారు. జీఎస్టీ కౌన్సిల్ భేటీ అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "జీఎస్టీ ట్రైబ్యునళ్లు, కోర్టులకు వెళ్లే వారికి విధించే డిపాజిట్ మొత్తాన్ని తగ్గించాం. సీజీఎస్టీ చట్టంలో పలు సవరణలకు కౌన్సిల్ ప్రతిపాదనలు చేసింది. ఈ క్రమంలో జీఎస్టీ చెల్లింపులకు చివరి తేదీని పొడిగించాం. ఈ నిర్ణయాలతో చిరువ్యాపారులు, ఎంఎస్ఎంఈలకు లబ్ధి చేకూరుతుంది" అని ఆమె వివరించారు. జీఎస్టీ రిఫండ్ మోసాలను అరికట్టేందుకు ఆధార్ అథెంటికేషన్‌ను తప్పనిసరి చేయాలని నిర్ణయించాం. 52వ కౌన్సిల్ సమావేశం గత ఏడాది అక్టోబరులో జరిగిందని, ఆ తర్వాత ఎన్నికల కోడ్ కారణంగా భేటీ జరగలేదని గుర్తు చేశారు. ఆగస్టు చివరి వారంలో తదుపరి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.


పెట్రోల్, డీజిల్‌పై నిర్ణయం రాష్ట్రాలదే

పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలన్నదే ఎన్డీయే సర్కారు లక్ష్యమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ స్పష్టం చేశారు. 2017లో అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ కూడా ఈ విషయంపై విస్పష్టమైన వివరణ ఇచ్చినట్లు గుర్తుచేశారు. అయితే.. దీనిపై రాష్ట్రాలు తేల్చుకోవాల్సి ఉందని నిర్మల అన్నారు. "పెట్రోల్, డీజిల్‌పై జీఎస్టీ రేటు ఎంత ఉండాలి? అన్నదాన్ని రాష్ట్రాలు నిర్ణయించుకోవాల్సి ఉంది. ఒక్కసారి రాష్ట్రాలు ఒక రేటును చెబితే.. కేంద్రం అందుకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకువస్తుంది" అని ఆమె వ్యాఖ్యానించారు.

వాణిజ్యానికి బాసట

- 2017-18 నుంచి 2019-20 వరకు జీఎస్టీ చట్టంలోని సెక్షన్ 73 కింద వర్తకులు, వ్యాపారులకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి.. వడ్డీ లేదా జరిమానా లేదా రెండింటినీ షరతులతో మినహాయించేలా సవరణలు చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది.
- జీఎస్టీ అప్పీళ్లకు రూ.20లక్షల దాకా ఉండే మొత్తానికి సంబంధించి జీఎస్టీ ట్రైబ్యునళ్లు, రూ.20లక్షల నుంచి రూ.కోటి మధ్య ఉండే మొత్తానికి హైకోర్టు, ఆపైన మొత్తానికి సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని కౌన్సిల్ సిఫారసు చేసింది. అప్పీల్ దాఖలు సమయాన్ని మూడు నెలల వ్యవధిని ఇవ్వాలని సూచించింది.
- జీఎస్టీ అప్పీల్‌కు చెల్లించాల్సిన ప్రీ-డిపాజిట్ మొత్తాన్ని రూ.25 కోట్ల నుంచి రూ.20 కోట్లకు తగ్గించేలా జీఎస్టీ చట్టంలోని సెక్షన్లు 107, 112కు సవరణలు చేయాలని కౌన్సిల్ ప్రతిపాదించింది.
- ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్(ఈఎన్ఏ)ను పన్ను మినహాయింపు జాబితా నుంచి తొలగించాలని కౌన్సిల్ సిఫారసు చేసింది.
- చిన్న వ్యాపారులకు పన్ను చెల్లింపునకు జీఎస్టీఆర్-4 రిటర్న్ దాఖలు గడువును ఏప్రిల్ 30 నుంచి జూన్ 30కి మార్చారు.

లోకం తీరు



పరీక్షల అక్రమాల చట్టం కంటి తుడుపు చర్య: ఖర్గే



న్యూఢిల్లీ, జూన్ 22: కేంద్ర ప్రభుత్వం పేపర్ లీక్ చట్టాన్ని అమల్లోకి తేవడం కంటితుడుపు చర్య అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఈ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం గత ఫిబ్రవరిలోనే లభిస్తే ఇప్పటిదాకా ఎందుకు అమల్లోకి తేలేదని ప్రశ్నించారు. విద్యారంగంలో మాఫియాను, అవినీతిని ప్రోత్సహిస్తున్నందుకు బీజేపీ బాధ్యత నుంచి తప్పించుకోలేదని వ్యాఖ్యానించారు. పరీక్షల అక్రమాలకు పాల్పడిన వారికి పదేళ్ల జైలు శిక్ష, కోటి రూపాయల జరిమానా నిబంధనలతో శుక్రవారం రాత్రి కేంద్ర ప్రభుత్వం పరీక్షల అక్రమాల నిరోధక చట్టం-2024ను అమల్లోకి తెచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు స్పందించారు. గత ఏడేళ్ల బీజేపీ పాలనలో మొత్తం 70 పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని ఆరోపించారు. వీటిపై ఇప్పటిదాకా బీజేపీ సర్కారు ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. కాగా, నీట్ లీకేజీ అంశంపై శనివారం తాజాగా పది మంది విద్యార్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసు దర్యాప్తు బాధ్యతను సీబీఐ, ఈడీకి అప్పగించేలా ఆదేశాలివ్వాలని వారు కోర్టును కోరారు.

అడ్డుకట్టే పెద్ద 'ప్రశ్న'!

గత ఏడేళ్లలో 70 పైగా పరీక్ష పేపర్ల లీక్.. మొత్తం 1.70 కోట్ల మందిపైన ప్రభావం



అటు నియామక పరీక్ష కానీ.. ఇటు బోర్డు పరీక్ష కానీ..! నెట్ వంటి ప్రామాణిక పరీక్ష కానీ..! నీట్ వంటి కీలకమైన పరీక్ష కానీ..! రాజస్థాన్ నుంచి తమిళనాడు వరకు.. గుజరాత్ నుంచి బెంగాల్ దాక.. దేశంలో ప్రశ్నపత్రాల లీకేజీ అనేది ఇటీవల సర్వసాధారణమైపోయింది. ఔత్సాహిక అభ్యర్థులు, ప్రతిభావంతులైన విద్యార్థుల పాలిట పెనుశాపంగా మారింది. ఇలాంటివారిలో కొందరు.. తాము పడిన కష్టం వృథా అయిందనే వేదనతో బలవన్మరణాలకూ పాల్పడ్డారు. పరీక్షల వ్యవస్థను భూతంలా పట్టి పీడిస్తున్న లీకేజీ విష సంస్కృతి తాజాగా నీట్, నెట్ ఉదంతాల నేపథ్యంలో మళ్లీ పెను దుమారం రేపుతోంది.

లీక్ మాఫియా.. ఏటా పదిపైనే..

నీట్, నెట్‌లో అవకతవలు ఒకేసారి బయటపడడంతో ఇప్పుడు దేశవ్యాప్తంగా రగడ జరుగుతోంది. కానీ, ఏడేళ్లుగా కనీసం ఏదో ఒక రాష్ట్రంలో పేపర్ లీకేజీ అనేది సర్వసాధారణమైంది. 2017 నుంచి చూస్తే 15 రాష్ట్రాల్లో 70 పైగా లీకేజీ ఘటనలు జరిగాయి. 1.70 కోట్లమంది అభ్యర్థులు ప్రభావితం అయ్యారు. ఇవన్నీ దేశంలో పరీక్షల నిర్వహణ సామర్థ్యాన్ని ప్రశ్నార్థకం చేశాయి. పోలీసులు, దర్యాప్తు సంస్థల విచారణలో తేలిన విస్మయకర విషయం ఏమంటే.. పేపర్ లీకేజీలో ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయుల పాత్ర ఉండడం. 24 లక్షల మంది పైగా హాజరైన ఇటీవలి నీట్ ప్రశ్నపత్రం బయటకు రావడాన్ని బట్టి చూస్తే దేశంలో 'పేపర్ లీక్ మాఫియా' ఎలా వేళ్లూనుకుందో స్పష్టమతోందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. లీకేజీలను ఎన్నికల సందర్భంగా గట్టిగా లేవనెత్తే రాజకీయ పార్టీలు తర్వాత నోరు మెదపడం లేదు. ఇది నాయకులు, లీకేజీ మాఫియా కలిసిపోయాయా? అనే అనుమానాలను రేకెత్తిస్తోందని అంటున్నారు. ప్రశ్నపత్రం సత్వరమే వేలాది చేతులు మారడంలో సోషల్ మీడియా ప్రధాన వాహకంగా మారుతోంది. పేపర్ లీక్ అయిన సందర్భాల్లో మళ్లీ పరీక్ష రాయాల్సి రావడం, సమయమంతా వృథా కావడంతో విద్యార్థుల నైతిక స్థైర్యం దెబ్బతింటోంది. కాగా, చాలా సందర్భాల్లో పేపర్ లీకేజీ చాన్నాళ్ల తర్వాత బయట పడుతోంది. ఈలోగా అనుచిత లబ్ధి పొందిన అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరిపోతున్నారు. బిహార్, యూపీల్లో 'ఉద్యోగానికి భూమి' కుంభకోణం ఇదే తరహాలోనిదే. కాగా, బిహార్ తాజాగా కేంద్రం తీసుకొచ్చిన చట్టం నుంచి తప్పుకోవడం గమనార్హం. - సెంట్రల్ డెస్క్

ఈ రాష్ట్రాల్లోనే అధికం

తెలంగాణ, రాజస్థాన్, యూపీ, మధ్యప్రదేశ్, గుజరాత్, బిహార్.. దేశంలో పేపర్ లీకులు అత్యధికంగా జరిగిన రాష్ట్రాలు. వీటిలో ముఖ్యమైన ఉద్యోగ నియామక పరీక్షలే కాదు.. ఉన్నత విద్య, పాఠశాల పరీక్షల ప్రశ్నపత్రాలు ముందే బయటకు రావడం గమనార్హం. బిహార్‌లో పదో తరగతి పేపర్ ఆరుసార్లు, బెంగాల్ రాష్ట్ర బోర్డు ఎగ్జామ్ పేపర్ పదిసార్లు లీకయ్యాయి. రెండేళ్ల కిందట తమిళనాడులో 10, 12 తరగతుల పేపర్లు రెండూ పరీక్షకు ముందే విద్యార్థుల చేతుల్లో ఉన్నాయి. ఇక రాజస్థాన్‌ది మరో రికార్డు. యూజీసీ నెట్ సహా 2015-23 మధ్య 14 పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయి. గుజరాత్‌లోనూ ఏడేళ్లలో 14 లీకేజీ ఉదంతాలు జరిగాయి. యూపీలో టెట్, నీట్ యూజీ (2021), ఇంటర్ సహా 9 ఘటనలు చోటుచేసుకున్నాయి. వీటిలో పరాకాష్ఠ.. ఈ ఏడాది 48 లక్షల మంది అభ్యర్థులు హాజరైన కానిస్టేబుల్ నియామక పరీక్ష పేపర్ లీకేజీ. కాగా, కర్ణాటక, మహారాష్ట్ర, హరియాణాల్లోనూ పేపర్ లీకేజీ ఆరోపణలు వచ్చాయి.

పదేళ్ల జైలు.. కోటి జరిమానా

పేపర్ లీకేజీ కారకులపై చర్యలు తీసుకునేందుకు కఠినమైన "ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం-2024"ను కేంద్రం అమల్లోకి తెచ్చింది. గత ఫిబ్రవరిలోనే ఈ చట్టాన్ని రూపొందించినా.. ఎన్నికల నేపథ్యంలో ప్రకటించలేదు. తాజా పరిణామాల నేపథ్యంలో 'ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్'ను శుక్రవారం (జూన్ 21) నుంచే అమల్లోకి తెస్తూ కేంద్రం గెజిట్ ఇచ్చింది. దీనిప్రకారం.. వ్యక్తులు కానీ, పరీక్షల నిర్వహణ సంస్థ కానీ వ్యవస్థీకృత నేరానికి పాల్పడితే ఐదేళ్ల జైలు (పదేళ్ల వరకు పొడిగించొచ్చు), కనీసం రూ.కోటి జరిమానా విధిస్తారు. అక్రమాలకు పాల్పడుతూ దొరికినవారికి కనీసం మూడేళ్లు, గరిష్ఠంగా ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తారు. ఏదైనా పరీక్ష నిర్వహణ సంస్థ గనుక అవకతవకలు చేస్తే రూ.కోటి దాకా జరిమానా వేసి, పరీక్షల ఖర్చులనూ వారి నుంచే వసూలు చేస్తారు.

కేంద్ర పరిధిలోని పరీక్షలకేనా?

కొత్త చట్టం లీకేజీకి అడ్డుకట్ట వేసేలా లేదనే అభిప్రాయం వినిపిస్తోంది. పారదర్శకంగా పరీక్షల నిర్వహణ ఎలాగనేది ఇందులో లేదని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. రాష్ట్రాల భాగస్వామ్యం పెంచుతూ, కృత్రిమ మేధ వంటి సాంకేతికతను వాడుకుంటూ లీకేజీలను నిరోధించాలని సూచిస్తున్నారు. కాగా, ఈ చట్టాన్ని కేంద్ర సంస్థలు నిర్వహించే పరీక్షలకే పరిమితం చేయడంపైనా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇక ఈ-గేట్‌తో ఇమిగ్రేషన్!

ఎయిర్ పోర్టులో తనిఖీలు, క్యూలు లేకుండా స్వీయ ధ్రువీకరణ



న్యూఢిల్లీ, జూన్ 22: దేశంలోని ప్రధాన ఎయిర్‌పోర్టుల్లో ఇమిగ్రేషన్ సేవలను మరింత వేగంగా అందించటానికి వీలుగా కేంద్రప్రభుత్వం 'ఫాస్ట్ ట్రాక్ ఇమిగ్రేషన్-ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగామ్' (ఎఫ్‌టీఐ-టీటీపీ) అనే కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా అంతర్జాతీయ ప్రయాణాలు ఇకపై మరింత సులువు కానున్నాయి. ఎఫ్‌టీఐ-టీటీపీని దేశంలోని 21 ప్రధాన విమానాశ్రయాల్లో అమలు చేయనున్నారు. తొలిదశలో భాగంగా హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, కొచి, అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టుల్లో తీసుకొస్తారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం ఎఫ్‌టీఐ-టీటీపీని ప్రారంభించారు. భారతీయ పౌరులకు, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డుహోల్డర్లకు ఈ సదుపాయం ఉచితంగా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కాగా, ఎఫ్‌టీఐ-టీటీపీ సదుపాయాన్ని వినియోగించుకోవాలంటే ప్రయాణికులు ముందుగానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దీనికోసం ప్రత్యేకంగా కేంద్రప్రభుత్వం www.ftittp.mha.gov.in అనే వెబ్‌సైట్‌ను కూడా ఏర్పాటు చేసింది. దరఖాస్తు ఆమోదం పొందిన తర్వాత నిర్ణీత తేదీ, సమయంలో సమీపంలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో లేదా ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో ఇతరత్రా పత్రాలతోపాటు తమ బయోమెట్రిక్ (ఫేస్, ఫింగర్‌ప్రింట్స్) వివరాలను సమర్పించాలి. వీరిని ట్రస్టెడ్ ట్రావెలర్స్‌గా వ్యవహరిస్తారు. ఎఫ్‌టీఐ-టీటీపీ అమలయ్యే విమానాశ్రయాల్లో ఈ-గేట్‌లను ఏర్పాటు చేసి, వాటిల్లో ట్రస్టెడ్ ట్రావెలర్స్ వివరాలను నిక్షిప్తం చేస్తారు. సదరు ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు వచ్చినప్పుడు తనిఖీలు, క్యూ ఏమీ లేకుండానే తమ బోర్డింగ్‌పాస్‌ను, పాస్‌పోర్టును ఈ-గేట్ వద్ద స్కాన్ చేసి, బయోమెట్రిక్ వివరాలను నమోదు చేస్తే సరిపోతుంది. అప్పటికే నిక్షిప్తమైన వివరాలతో సరిపోల్చుకొని ఈ-గేట్ దానంతట అదే తెరుచుకుంటుంది. దీంతో ఇమిగ్రేషన్ ప్రక్రియ పూర్తయినట్లే.

ధరల స్థిరీకరణకు 5 లక్షల టన్నుల ఉల్లి నిల్వ

న్యూఢిల్లీ, జూన్ 22: ఉల్లి ధరలను స్థిరీకరించే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ ఏడాది 5 లక్షల టన్నుల ఉల్లిని సేకరించి బఫర్ స్టాక్‌గా నిల్వ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇంత వరకు సుమారు 71వేల టన్నులను సేకరించింది. వినియోగదారుల విభాగం గణాంకాల ప్రకారం శుక్రవారం ఉల్లి రిటెయిల్ ధర కిలోకు రూ.38.67గా నమోదయింది. మోడల్ ధర కిలోకు రూ.40గా ఉంది. కాగా, సేకరించిన ఉల్లిని మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఉల్లిని సేకరించేప్పుడు రైతులకు కూడా మార్కెట్ ధరనే చెల్లిస్తామన్నారు. వర్షాభావం వల్ల ఉల్లి ఉత్పత్తి తగ్గిందని, అందువల్లనే ప్రస్తుతం ధరలు పెరిగాయని వివరించారు.

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ చేసిన ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ కన్నుమూత



అయోధ్య, జూన్ 22: అయోధ్య రామాలయంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠలో ప్రధాన పూజారిగా వ్యవహరించిన ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ శనివారం తుదిశ్వాస విడిచారు. 86 ఏళ్ల లక్ష్మీకాంత్ దీక్షిత్ కొన్ని రోజులుగా అనారోగ్య కారణాలతో బాధపడుతున్నారని ఈ క్రమంలోనే శనివారం ఉదయం కన్నుమూశారని కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన అంత్యక్రియలను వారాణసిలోని మణికర్ణిక ఘాట్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జనవరి 22న అయోధ్యలో జరిగిన బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు లక్ష్మీకాంత్ దీక్షిత్ ప్రధాన అర్చకుడిగా వ్యవహరించారు. లక్ష్మీకాంత్ దీక్షితులు మృతిపై ప్రధాని మోదీ, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "కాశీలోని పండితుల్లో లక్ష్మీకాంత్ దీక్షిత్ గొప్పవారు. ఆయన మృతి ఆధ్యాత్మిక, సాహితీ ప్రపంచానికి తీరని లోటు" అని యోగి ఆదిత్యనాథ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు

తీస్తా నదీ జలాల నిర్వహణ, సంరక్షణలో భారత్ సహకారం

» భారత్, బంగ్లాదేశ్ మధ్య పది కీలక ఒప్పందాలు



న్యూఢిల్లీ, జూన్ 22: ఉగ్రవాదంపై ఉమ్మడిపోరుకు, ఇరుదేశాల సరిహద్దుల్లో శాంతిస్థాపనకు భారత్, బంగ్లాదేశ్ పరస్పరం అంగీకరించాయి. ఆయుధాల ఉత్పత్తి, రక్షణ సహకారం, బంగ్లాదేశ్ సాయుధ బలగాల ఆధునీకరణకు బంగ్లాకు సహకరించేందుకు, తీస్తా నదీ జలాల సంరక్షణ, నిర్వహణకు భారత్ ముందుకొచ్చింది. ఇది కాక, సముద్రయానం, అంతరిక్షం, రైల్వే, గ్రీన్ టెక్నాలజీ, బ్లూ ఎకానమీ తదితర రంగాల్లో ఇరు దేశాల మధ్య పది కీలక ఒప్పందాలు జరిగాయి. రెండ్రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు విచ్చేసిన బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో శనివారం సుదీర్ఘ చర్చలు జరిపిన ప్రధాని మోదీ ఈ ఒప్పందాలు చేసుకున్నారు. కొత్త లోక్‌సభ కొలువుదీరిన తర్వాత భారత్‌కు వచ్చిన తొలి విదేశీ నేత షేక్ హసీనానే. ఈ చర్చల అనంతరం ఇరువురు నేతలు కలిసి విలేకరులతో మాట్లాడారు. పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌తో సత్సంబంధాలకు న్యూఢిల్లీ అధిక ప్రాధాన్యం ఇస్తోందని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. వైద్యం కోసం భారత్‌కు వచ్చే బంగ్లాదేశీయుల కోసం త్వరలో ఈ-వీసాలు జారీ చేస్తామని ప్రకటించారు. బంగ్లాదేశ్‌లోని రంగ్‌పూర్‌లో త్వరలో భారత అసిస్టెంట్ హైకమిషన్ కార్యాలయం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. 'ఇండియన్ ఓషన్ రీజియన్'లో చేరేందుకు బంగ్లాదేశ్ ముందుకు రావడాన్ని మోదీ స్వాగతించారు. ఇక, షేక్ హసీనా మాట్లాడుతూ భారతదేశం తమకు అత్యంత నమ్మకమైన మిత్రదేశమని పేర్కొన్నారు.

చైనా కన్నేసిన 'తీస్తా' భారత్ చేతికి

తీస్తా నది ప్రాజెక్టుపై చైనా చాలా ఆసక్తి చూపెట్టిన నేపథ్యంలో భారత్-బంగ్లా మధ్య తీస్తా జలాల నిర్వహణపై ఒప్పందం జరగడం గమనార్హం. ఈ ప్రాజెక్టులో భాగంగా తీస్తా నది జలాల సంరక్షణ, నిర్వహణకు భారీ రిజర్వాయర్ల నిర్మాణం, సంబంధిత నిర్మాణాలు చేపట్టనున్నారు. కాగా, మోదీతో సమావేశానికి ముందు షేక్ హసీనా శనివారం ఉదయం రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును స్వయంగా కలిశారు.

సొంతూరిలో జగన్‌కు షాక్

- బిల్లులు అందలేదని క్యాడర్ గగ్గోలు
- నాయకులు, కార్యకర్తల అసంతృప్తి
- తోపులాటలో కిటికీ అద్దాలు ధ్వంసం
- మాజీ సీఎంగా తొలిసారి కడప జిల్లాకు
- కనిపించని వైసీపీ శ్రేణుల హడావుడి

కడప, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రిగా, పులివెందుల ఎమ్మెల్యే హోదాలో తొలిసారి సొంత గడ్డకు వచ్చిన జగన్‌కు సొంత పార్టీ శ్రేణులు ఝలక్ ఇచ్చారు. బిల్లుల కోసం జగన్‌ను నిలదీసినంత పనిచేశారు. 'బిల్లులు కాకపోతే మా ఆస్తులు అమ్మినా కూడా చేసిన అప్పులు తీరవు. బిల్లులు రాకపోతే మేము ఎలా బతకాలి? ఎన్నికలకు ముందు నుంచి కూడా బిల్లుల కోసం అధికారులపై ఎంత ఒత్తిడి తెచ్చినా పట్టించుకోలేదు'.. అంటూ వాపోయారు. అందరూ సహనంతో ఉండాలని, మళ్లీ మంచి రోజులు వస్తాయని జగన్ సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. ఎప్పుడో మంచి రోజులు వస్తాయని ఎదురుచూస్తే ఇపుడు మునిగిపోయే పరిస్థితిలో ఉన్నామని జగన్ వద్దే కొందరు గగ్గోలు పెట్టినట్లు సమాచారం. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో జగన్ ఇంటి కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. మూడు రోజుల పర్యటనలో భాగంగా శనివారం ఆయన సొంత జిల్లాకు వచ్చారు. పులివెందులకు వెళ్లేసరికి అక్కడ జనం పెద్దగా లేరు. తర్వాత వైసీపీ నాయకులు భారీ స్థాయిలో జనసమీకరణ చేసినట్లు తెలుస్తోంది. జగన్ ప్రభుత్వంలో కాంట్రాక్టు పనులు చేసి, బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఆవేదనలో ఉన్న వారంతా అక్కడకు వచ్చారు. నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసేందుకు ఒక్కసారిగా పరుగులు పెట్టారు. దీంతో పోలీసు సిబ్బంది వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. జగన్ కార్యాలయంలోకి వెళ్లిపోవడంతో ఆయనను కలిసేందుకు అందరూ అక్కడికి చేరుకున్నారు. వారు లోపలకు వెళ్లకుండా సిబ్బంది తలుపులు వేశారు. అందరూ ఒక్కసారిగా కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో తోపులాట జరిగింది. కొందరు కిటీ అద్దాలను గట్టిగా కొట్టడంతో అద్దాలు పగిలినట్లు తెలిసింది. తేరుకున్న సిబ్బంది అందరినీ నిలువరింపజేశారు. జగన్‌ను కలిసేందుకు ఒకస్థాయి నాయకులను మాత్రమే సిబ్బంది పంపిస్తున్నారని కింది స్థాయి నాయకులు మండిపడ్డారు. జగన్‌ను కలిసేందుకు వెళ్లిన ప్రతి నాయకుడు బిల్లులు కాలేదని, ఇపుడు మా పరిస్థితి ఏమిటని సమస్యలు ఏకరువు పెట్టారు. మీడియాను లోపలకు వెళ్లేందుకు వీలులేదని సిబ్బంది ఆఫీసు బయటే ఆపేశారు. సీఎం హోదాలో సొంత జిల్లాకు వచ్చిన ప్రతిసారి జగన్ ఇడుపులపాయ వెళ్లేవారు. ఎక్కువగా ఇడుపులపాయలోనే బస చేసేవారు. అయితే ఈసారి మాత్రం పులివెందులలోని సొంతింటికి వెళ్లారు.

దూరంగా క్యాడర్

ఒకప్పుడు సీఎం హోదాలో జగన్ సొంత జిల్లాకు వస్తున్నారంటే కడప ఎయిర్‌పోర్టులో జిల్లా వైసీపీ నేతలే కాదు రాయలసీమకు చెందిన ప్రజాప్రతినిధుల హడావిడి అంతా ఇంతా కాదు. ఎయిర్‌పోర్టు నుంచి ఇడుపులపాయ, పులివెందుల వరకు హంగామా మామూలుగా ఉండేది కాదు. ఇప్పుడు మాజీ సీఎం హోదాలో తొలిసారిగా సొంత గడ్డ కడప జిల్లాలో అడుగుపెట్టిన జగన్‌కు వైసీపీ శ్రేణులు షాక్ ఇచ్చారు. కడప ఎయిర్‌పోర్టులో ఎంపీ అవినాశ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, అంజాద్‌బాషలు మాత్రమే స్వాగతం పలికారు. జగన్ వస్తున్నారని చెప్పి ఎయిర్‌పోర్టుకు రావాలంటూ మాజీ ఎమ్మెల్యే అంజాద్‌బాష, మేయర్ సురేష్‌బాబు క్యాడర్‌కు విజ్ఞప్తి చేసినా పెద్దగా హాజరు కాలేదు. వచ్చిన క్యాడర్‌తోనే సీఎం జగన్ అంటూ నినాదాలు చేయించుకుని మురిసిపోయారు.

అసోం వరదల్లో 37 మంది మృతి

గువాహటీ, జూన్ 22: అసోం వరదల్లో మృతుల సంఖ్య 37కు చేరింది. మరొకరు గల్లంతయ్యారు. సుమారు 4 లక్షల మంది వరద ప్రభావానికి గురై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ 19 జిల్లాల్లో పరిస్థితి ఇంకా దయనీయంగానే ఉందని అధికారులు శనివారం వెల్లడించారు. వరద ప్రభావానికి గురైన ప్రజల సంఖ్య గురువారం 4.09 లక్షలు ఉండగా, శుక్రవారం సాయంత్రానికి అది 3,90,491 కు తగ్గింది. ఒక్క కరీంగంజ్ జిల్లాలోనే 2.40 లక్షల మంది వరద ప్రభావానికి గురయ్యారు. అన్ని నదులూ ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. 100కుపైగా పునరావాస క్యాంపుల్లో 15 వేలమందికిపైగా ఆశ్రయం పొందుతుండగా, మరో 125 ఆహార పంపిణీ కేంద్రాల ద్వారా బాధితులకు ఆహారం, తాగునీరు అందజేస్తున్నారు. ఇళ్లు, పశువుల పాకలు, రోడ్లు, వంతెనలు, ఆనకట్టలు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. కాగా, అసోంను వరద రహిత రాష్ట్రంగా చేస్తామని హామీ ఇచ్చిన 'డబుల్ ఇంజిన్ మోదీ-అమిత్‌షా' ఆ రాష్ట్ర ప్రజలను దగా చేశారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. మృతుల కుటుంబాలకు 'ఎక్స్'లో ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా సైతం సహాయ, పునరావాస కార్యక్రమాలను వేగవంతం చేయాలని అసోం ప్రభుత్వాన్ని కోరారు. ప్రభావిత ప్రజలను కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కూడా సాధ్యమైనంత వరకు ఆదుకోవాలని 'ఎక్స్'లో ఆమె పిలుపునిచ్చారు.

అసెంబ్లీలో చానళ్లపై నిషేధం ఎత్తివేత

- తొలి సంతకం చేసిన స్పీకర్ అయ్యన్న

అమరావతి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, ఈటీవీ, టీవీ 5 చానళ్లపై విధించిన నిషేధాన్ని శాసనసభ నూతన స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఎత్తివేశారు. స్పీకర్‌గా ఆయన తన తొలి సంతకాన్ని దీనికి సంబంధించిన ఫైలుపై చేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో మూడు చానళ్లపై నిషేధం విధించారు. అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే ఈ నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ చానళ్ల ప్రతినిధులు అసెంబ్లీ ప్రాంగణంలో అడుగు పెట్టకుండా ఈ నిషేధం ద్వారా అడ్డుకొన్నారు. ఐదేళ్లపాటు ఈ నిషేధం అమలైంది. ఆ నిషేధం ఆదేశాన్ని ఉపసంహరించాలని కోరుతూ టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర శనివారం ఇక్కడ అసెంబ్లీ ప్రాంగణంలో అయ్యన్నపాత్రుడుకు లేఖ అందచేశారు. ఈ నిషేధం ఎత్తివేతపైనే తొలి సంతకం చేయాలని నిర్ణయించుకొన్న ఆయన ఈ మేరకు ఫైలు తయారు చేయాలని అసెంబ్లీ అధికారులను ఆదేశించారు. స్పీకర్ ఎన్నిక పూర్తయి తన చాంబర్లోకి వచ్చిన తర్వాత పూజాదికాలు పూర్తి చేసుకొని ఆ తర్వాత ఈ ఫైలుపై తొలి సంతకం చేశారు. 'గత ప్రభుత్వ కక్ష సాధింపు ధోరణికి ఈ నిషేధం ఒక నిదర్శనం. అందుకే దానిని తొలగించాం. పత్రికా స్వేచ్ఛను కూడా హరించే విధంగా గత పాలకులు వ్యవహరించారు. ఈ నిషేధాన్ని తొలగించడం సంతోషంగా ఉంది' అని అయ్యన్న వ్యాఖ్యానించారు.

టీడీపీపీ నేతగా లావు శ్రీకృష్ణదేవరాయలు

- ఉప నేతలుగా ప్రసాదరావు, శబరి

అమరావతి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నేతగా నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నియమితులయ్యారు. శనివారం రాత్రి ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ ఎంపీల సమావేశంలో సీఎం చంద్రబాబు ఈ విషయం ప్రకటించారు. సోమవారం నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఎంపీల సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీలు అందరి అభిప్రాయాలు తెలుసుకొన్న మీదట పార్లమెంటరీ కార్యవర్గాన్ని ఖరారు చేసి ప్రకటించారు. పార్లమెంటరీ పార్టీ ఉప నేతలుగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, కోశాధికారిగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, విప్‌గా అమలాపురం ఎంపీ గంటి హరీశ్‌ను నియమించారు.

వైసీపీ అక్రమాలపై బుల్డోజర్!

(మొదటి పేజీ తరువాయి)


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న బుల్డోజర్లు

నిర్మాణాలు చేపట్టరాదని నిబంధనలు చెబుతుండగా.. వాటన్నిటినీ తోసిరాజని గుంటూరు జిల్లా కలెక్టర్, తాడేపల్లి మండల తహసీల్దారు సదరు బోటు యార్డు భూమిలో రెండెకరాలను వైసీపీకి కట్టబెడుతూ ఉత్తర్వులిచ్చారు. వీటికి అనుగుణంగా వైసీపీకి భూమిని బదలాయిస్తూ జలవనరుల శాఖ స్వాధీనపు ఉత్తర్వులను ఇవ్వాల్సి ఉండగా ఆ శాఖ అధికారులు అందుకు అంగీకరించలేదు. అయినప్పటికీ సార్వత్రిక ఎన్నికల ముందు వైసీపీ నాయకత్వం సదరు స్థలంలో హడావుడిగా కాంక్రీటు నిర్మాణాలను మొదలుపెట్టింది. వాస్తవంగా కేటాయించింది రెండెకరాలే అయినా.. మిగిలిన 15 ఎకరాలనూ స్వాహా చేయాలన్నది అసలు ఎత్తుగడ. ఎకరం రూ.25 కోట్లకు పైగా విలువ చేసే 17 ఎకరాల స్థలాన్ని 33 సంవత్సరాల లీజు (ఎకరాకు ఏడాదికి రూ.వేయి వంతున.. అది కూడా రెండెకరాలకు మాత్రమే) పేరిట స్వాధీనం చేసుకోవాలనుకుంది. నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) కూడా లేకుండా.. బోటు యార్డు స్థలంలో ఎటువంటి అనుమతులూ తీసుకోకుండా పెద్దఎత్తున నిర్మాణాలు చేపట్టింది. ఈ అక్రమ నిర్మాణాన్ని ఆ ప్రాంత సచివాలయ సిబ్బంది గత నెల 20న గుర్తించారు. మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అదేరోజున తక్షణమే నిర్మాణాలను నిలిపివేసి అనుమతులకు సంబంధించి తగు వివరణ ఇవ్వాలని కోరుతూ వైసీపీ అధిష్ఠానానికి ప్రొవిజినల్ ఆర్డర్స్ ఇచ్చామని కార్పొరేషన్ కమిషనర్ నిర్మల్‌కుమార్ శనివారం విలేకరులకు తెలిపారు. 'నోటీసులకు ఆ పార్టీ స్పందించకపోవడంతో తిరిగి ఈ నెల 1న సదరు అక్రమ నిర్మాణాలను ఎందుకు తొలగించరాదో చెప్పాలంటూ కన్ఫర్మేషన్ నోటీసులు కూడా ఇచ్చాం. వాటికీ ఎటువంటి స్పందన రాకపోవడంతో తిరిగి ఈ నెల 14న సదరు అక్రమ నిర్మాణాలను 24 గంటల్లోగా స్వచ్ఛందంగా తొలగించాలని.. లేకుంటే మేమే రంగంలోకి దిగి వాటిని సమూలంగా కూల్చివేసి..అందుకైన ఖర్చులను వారిపైనే వేస్తామంటూ మౌఖిక ఆదేశాలు జారీ చేశాం. అయినా వైసీపీ అధిష్ఠానం ఉలుకూపలుకూ లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది' అని వెల్లడించారు. ఈలోగా రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (ఏపీసీఆర్‌డీఏ) కూడా ఈ నెల 10న సదరు అక్రమ నిర్మాణాలకు సంబంధించిన ప్రొవిజనల్ ఆర్డర్స్‌ను, ఈ నెల 21న కన్ఫర్మేషన్ ఆర్డర్స్‌ను జారీ చేసినట్లు సమాచారం. సీఆర్‌డీఏ ఇచ్చిన కన్ఫర్మేషన్ ఉత్తర్వులపై వైసీపీ నాయకత్వం హైకోర్టుకు వెళ్లింది. విచారణ జరిపిన కోర్టు.. చట్టబద్ధంగా వ్యవహరించాలని సీఆర్‌డీఏను ఆదేశించినట్లు తమకు సమాచారం అందిందని కమిషనర్ తెలిపారు. తాము మాత్రం నెల రోజుల నుంచి నిబంధనల ప్రకారం నడుచుకున్న తర్వాత చట్టబద్ధంగా శనివారం తెల్లవారుజామున అక్రమ నిర్మాణాలను తొలగించామన్నారు. ప్రభుత్వ ఒత్తిడితో, కోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా వైసీపీ నిర్మాణాలను కూల్చేశారన్న వైసీపీ నేతల ఆరోపణలు పూర్తిగా సత్యదూరమని స్పష్టం చేశారు.

సీడ్ యాక్సిస్ రోడ్డును అడ్డుకునేందుకే!

అమరావతిని సర్వనాశనం చేసి ఇక్కడ రాజధాని అనేది లేకుండా చేయాలన్నది వైసీపీ అధిష్ఠానం ఉద్దేశం. ఈ ఆలోచనకు అనుగుణంగానే వ్యూహాత్మకంగా తాడేపల్లి బోటు యార్డు స్థలంలో పార్టీ కేంద్ర కార్యాలయాన్ని నిర్మించాలని ఎత్తుగడ వేసింది. ఇక్కడ పార్టీ కార్యాలయాన్ని నిర్మిస్తే సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకోవచ్చు. కనకదుర్గ వారధి-మణిపాల్ హాస్పిటల్ వద్ద నుంచి 16వ నంబరు జాతీయ రహదారిని రాజధాని అమరావతికి అనుసంధానించేందుకు ఈ సీడ్ యాక్సిస్ రోడ్డే ప్రధానంగా ఉపయోగపడుతుంది. ఈ రోడ్డు తాలూకు ఫ్లైఓవర్ తాడేపల్లి బోటుయార్డు మీదుగా వెళ్లాలి. సరిగ్గా ఇక్కడ వైసీపీ కార్యాలయాన్ని నిర్మిస్తే సీడ్ యాక్సిస్ రోడ్డును అడ్డుకోవచ్చు. అందుకే ఆ పార్టీ ఈ స్థలాన్ని ఎంచుకుంది. ఫ్లైఓవర్‌కు అవరోధంగా నిర్మిస్తున్నందునే వైసీపీ అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించి.. కూల్చివేసింది.

బాబు కక్ష సాధింపులకు దిగారు: జగన్

తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న తమ పార్టీ కార్యాలయ భవనాన్ని కూల్చివేయడంపై వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా స్పందించారరు. రాష్ట్రంలో చంద్రబాబు రాజకీయ కక్షసాధింపులకు దిగారని ఆరోపించారు. 'దాదాపు పూర్తికావచ్చిన మా పార్టీ కేంద్ర కార్యాలయ భవనాన్ని బుల్డోజర్లతో కూల్చివేయించారు. హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేశారు. రాష్ట్రంలో చట్టం, న్యాయం పూర్తిగా కనుమరుగైపోయాయి. ఎన్నికల తర్వాత హింసాత్మక ఘటనలతో రక్తాన్ని పారిస్తున్న చంద్రబాబు.. ఈ ఘటన ద్వారా వచ్చే ఐదేళ్ల పాలన ఏవిధంగా ఉండబోతోందో హింసాత్మక సందేశాన్ని ఇవ్వకనే ఇచ్చారు. ఈ బెదిరింపులు, కక్షసాధింపు చర్యలకు మా పార్టీ తలొగ్గేది లేదు. వెన్ను చూపేది అంతకన్నా లేదు. ప్రజల తరఫున, ప్రజల కోసం ప్రజల తోడుగా గట్టి పోరాటాలు చేస్తాం. దేశంలోని ప్రజాస్వామ్యవాదులంతా చంద్రబాబు దుశ్చర్యలను ఖండించాలి' అని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే మేడిపల్లి కుటుంబానికి సీఎం పరామర్శ

- అండగా ఉంటామని హామీ

అల్వాల్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి(40) ఆత్మహత్య చేసుకోవడంతో ఆయన్ను పరామర్శించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం అల్వాల్ పంచశీల కాలనీకి వచ్చారు. ఎమ్మెల్యే సత్యం ఆయన్ను చూడగానే బోరున విలపించారు. రేవంత్‌రెడ్డి ఆయన్ను కౌగలించుకుని మనోధైర్యాన్ని కల్పించారు. చిన్నారులైన యోజిత్, రుషికశ్రీని దగ్గరకు తీసుకుని ఓదార్చారు. దాదాపు 30 నిమిషాల పాటు రేవంత్‌రెడ్డి సత్యం ఇంట్లోనే ఉన్నారు. రూపాదేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ధైర్యంగా ఉండాలని, కుటుంబానికి అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. సీఎంతోపాటు ఎమ్మెల్యేను పరామర్శించిన వారిలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, రోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

27 నుంచి క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక

- జింఖానా మైదానంలో నిర్వహణ: కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని క్రీడా పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి నాలుగో తరగతిలో ప్రవేశానికి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం తెలిపారు. సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో ఈ నెల 27 నుంచి 30 వరకు ఉదయం 8 గంటల నుంచి ఎంపిక పోటీలుంటాయని చెప్పారు. 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, 6-10 మీటర్ల షటిల్ రన్, స్టాండింగ్స్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ, కిలో మెడిసిన్ బాల్‌త్రో, 800 మీటర్ల పరుగు, బరువు, ఎత్తు, మెడికల్ టెస్టులుంటాయన్నారు. హైదరాబాద్ జిల్లాలో మండల స్థాయి ఎంపికలు ఈ నెల 24, 25 తేదీల్లో జరుగుతాయని, జిల్లా స్థాయి ఎంపికలు 27 నుంచి 30 వరకు నిర్వహిస్తామన్నారు. అలాగే రాష్ట్రస్థాయి ఎంపికలు జులై 8 నుంచి 12 వరకు హకీంపేటలో ఉంటాయని చెప్పారు. వివరాలకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీకి చెందిన 040-27900649 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు తొలి రోజు 5,760 మంది హాజరు

హైదరాబాద్ సిటీ/రామంతాపూర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్‌లో ర్యాంకులు పొందిన అభ్యర్థులకు శనివారం కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. వివిధ పాలిటెక్నిక్‌లలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కోరుకునే అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన నిమిత్తం రాష్ట్రవ్యాప్తంగా 32 హెల్ప్‌లైన్ కేంద్రాలను సాంకేతిక విద్యాశాఖ ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల్లో తొలి రోజు 5,760 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసినట్లు కౌన్సెలింగ్ అధికారులు తెలిపారు. వివిధ పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్ల కోసం 911మంది అభ్యర్థులు శనివారం ఆన్‌లైన్‌లో ఆప్షన్లను పెట్టుకున్నారని, గరిష్ఠంగా ఒక అభ్యర్థి 134 ఆప్షన్లు ఎంచుకున్నట్లు చెప్పారు. ఈ నెల 25వరకు ధ్రువపత్రాల పరిశీలన, 27వరకు ఆప్షన్లకు అవకాశం ఉంటుంది. 30న అభ్యర్థులకు సీట్ల కేటాయింపు ఉంటుందని అధికారులు తెలిపారు.

నేడు సూర్యాపేటలో 'వివేక్' స్మారక సభ

- హాజరుకానున్న 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్

నల్లగొండ, జూన్ 22: ఛత్తీస్‌గఢ్‌లో 2015లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన వివేక్ తొమ్మిదో స్మారక సభను ఆదివారం సూర్యాపేటలో నిర్వహిస్తున్నట్లు ఆయన తల్లిదండ్రులు యోగానంద్, మాధవి శనివారం తెలిపారు. బీజాపూర్‌లో 2015లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన ముగ్గురు మావోయిస్టులల్లో వివేక్ ఒకరు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీ చదువుతూ కమ్యూనిజం భావజాలానికి ఆకర్షితుడై మావోయిస్టుల్లో చేరారు. వివేక్ తల్లిదండ్రులు ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. కాగా, వివేక్ వర్ధంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ రోడ్డులోని ఆర్‌ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు సభ నిర్వహిస్తున్నామని యోగానంద్ తెలిపారు. ఈ సందర్భంగా స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. '2024 ఎన్నికలు- ఒక అవగాహన' అనే అంశంపై 'ఆంధ్రజ్యోతి' సంపాదకుడు కె.శ్రీనివాస్ ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 'భారతదేశం ప్రజాస్వామ్యం' అనే అంశంపై విరసం నాయకుడు సీఎస్సార్ ప్రసాద్ మాట్లాడనున్నారు.

ఏపీ సభాపతిగా అయ్యన్న

సీనియర్ బీసీ నేతకు పట్టం

అమరావతి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర 16వ శాసన సభ సభాపతిగా బీసీ నాయకుడు, సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారమే ఆయన ఎన్నికకు సంబంధించి కూటమి పార్టీల నాయకులు నామినేషన్ సమర్పించిన విషయం తెలిసిందే. ఈ పదవికి ఇంకెవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో శనివారం ఉదయం సభ కొలువుదీరిన తర్వాత ఆయన ఎన్నికను ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి సభలో అధికారికంగా ప్రకటించారు. అనంతరం, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్‌లు అయ్యన్నపాత్రుడిని స్పీకర్ స్థానం వద్దకు తోడ్కొని వెళ్లారు. అనంతరం అయ్యన్నపాత్రుడు తన స్థానాన్ని అలంకరించారు. అయితే.. స్పీకర్ బాధ్యతలు చేపట్టే సమయంలో శాసన సభ సంప్రదాయాల ప్రకారం ప్రతిపక్షం కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని సభాపతికి గౌరవ సూచకంగా ఆయన స్థానం వరకు సాగనంపాలి. కానీ, వైసీపీ నాయకులు ఒక్కరు కూడా శనివారం సభకు హాజరుకాలేదు. ముఖ్యంగా ఆ పార్టీ అధినేత, ఎమ్మెల్యే జగన్ సైతం ఈ సంప్రదాయాన్ని విస్మరించారు.



సుదీర్ఘ అనుభవం!

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా, నర్సీపట్నం నియోజకవర్గానికి చెందిన అయ్యన్న పాత్రుడు టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉన్నారు. 16 ఏళ్ల మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పదేళ్లపాటు పార్టీకి సేవలందించారు. ఎన్టీఆర్ పిలుపుతో 25 ఏళ్ల వయసుల్లో అయ్యన్నపాత్రుడు రాజకీయాల్లోకి వచ్చారు. ఏడు సార్లు ఎమ్మెల్యే ఒకసారి ఎంపీగా విజయం దక్కించుకున్నారు. సభలో సంప్రదాయాలకు పెద్దపీట వేద్దామని సభ గౌరవాన్ని, హుందాతనాన్ని పెంచుదామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. తాను 1982 నుంచి సభలో ఉన్నానని తెలిపారు. సభలో తనను ఏకగ్రీవంగా ఎంపిక చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ నేతలు, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు. 22 మంది మహిళా ఎమ్మెల్యేలున్నారని, ఇంత మందికి సీట్లు ఇచ్చి సభలో మహిళలకు అవకాశమిచ్చిన చంద్రబాబుకు, పవన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సభకు ఇంకో ప్రత్యేకత ఉందని 33 శాతం మంది పోస్టు గ్రాడ్యుయేషన్ చదివిన సభ్యులున్నారని చెప్పారు. 39 మంది గ్రాడ్యుయేట్లు ఉన్నారని, 55 ఏళ్ల లోపు వయసున్న వారు 57 శాతం ఉన్నారంటే ఎక్కువ మంది యువకులు ఈ సభలో ఉన్నారని తెలిపారు. స్పీకర్ తనకు పదవి కాదని, బాధ్యతగా ఇచ్చారని అన్నారు. ప్రజలు తమపై ఉంచిన ఈ బాధ్యతను నెరవేర్చాల్సిన అవసరముందన్నారు. ఈ దఫా అసెంబ్లీకి మరో విశిష్టత ఉందని, కొత్తగా 88 మంది సభ్యులు సభలో అడుగు పెట్టారన్నారు. మొదటి సారి గెలిచిన ఎమ్మెల్యేల్లో 9 మందికి మంత్రి పదవులు ఇచ్చి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రోత్సహించారన్నారు. కాగా, తనకు జీవితాన్ని ఇచ్చిన టీడీపీని జీవితంలో మరచిపోలేనని అయ్యన్న తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ తనకు కల్పించిన అవకాశాన్ని గుర్తు చేసుకున్నారు.

నాన్నే చిన్నారిని చంపేశాడు!

- బావిలోకి ఎత్తి పడేసి హత్య చేసిన తండ్రి
- తనకు పుట్టలేదన్న అనుమానంతో దారుణం
- అనంతపురం జిల్లా నార్పలలో ఘటన

నార్పల, జూన్ 22: బడిలో చదువుకుంటున్న ఆరేళ్ల కూతురి వద్దకు ఆ తండ్రి వెళ్లాడు. 'ఇంటికి వెళదాం రామ్మా..' అని పిలిచాడు. బడి సంచి చేతబట్టుకుని నాన్న ఆటోలో కూర్చుంది. కానీ ఆటో ఇంటి వైపు కాకుండా.. పొలాల వైపు వెళ్లింది. నిర్జన ప్రదేశంలోని ఓ పాడుబడిన నేల బావి వద్ద ఆగింది. 'ఇక్కడికి ఎందుకు నాన్నా..?' అని అడిగితే.. 'ఈత నేర్పిస్తానమ్మా.. బావిలో దూకు..' అన్నాడు. 'వద్దు నాన్నా.. భయమేస్తోంది..' అని ఆ పాప మొరాయించింది. ఎంత చెప్పినా నాన్న వినలేదు. దాదాపు అరగంటపాటు ఏడుస్తూ.. భయపడుతూ అక్కడే కూర్చుంది. కానీ అనుమానపు పొరలు, మద్యం మత్తు కమ్ముకున్న అతడి కళ్లకు కన్నకూతురి భయం కనిపించలేదు. పాపను ఎత్తి బావిలో పడేశాడు. ఆ తరువాత ఏమీ ఎరుగనట్లు ఇంటికి వెళ్లాడు. తన కూతురిని ఎవరో కిడ్నాప్ చేశారని డ్రామా మొదలు పెట్టాడు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనుమానం వచ్చి తమదైన శైలిలో విచారిస్తే.. తానే బావిలో తోసేశానని అంగీకరించాడు. ఈ అమానవీయ ఘటన అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రంలో జరిగింది. నార్పల కొత్త బస్టాండ్ కాలనీకి చెందిన గణేష్‌కు ఎనిమిదేళ్ల క్రితం అమలతో వివాహం జరిగింది. వీరికి కూతురు పావని(6), ఓ కుమారుడు ఉన్నారు. రెండేళ్ల నుంచి గణేష్ భార్యపై అనుమానం పెంచుకున్నాడు. వ్యసనాలకు బానిసై.. దొంగతనాలు చేసేవాడు. భారీగా అప్పులు చేశాడు. డబ్బుల కోసం భార్యను వేధించేవాడు. ఆమెకు వివాహేతర సంబంధం ఉందని, పావని తనకు పుట్టలేదని అనుమానించేవాడు. అందుకే కూతుర్ని చంపేయాలని అనుకున్నాడు. ఈ నెల 20న మద్యం సేవించి, బడి వద్దకు వెళ్లి పావనిని తన ఆటోలో ఎక్కించుకుని పొలాల వైపు తీసుకెళ్లి బావిలో పడేశాడు. అదే రోజు సాయంత్రం తన కూతురు కనిపించడం లేదని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు గణేష్‌పైనే అనుమానంతో విచారించగా జరిగిన ఘోరాన్ని బయటపెట్టాడు. పోలీసులు బావిలో ఉన్న పావని మృతదేహాన్ని శనివారం బయటకు తీయించారు.


తండ్రి గణేష్‌తో పావని (ఫైల్)

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

▪ ఆర్కే RK



కొత్తపలుకు

కత్తి మీద సామే!

ఇల్లు అలకగానే పండగ వచ్చినట్లు కాదని అంటారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ప్రజాస్వామ్యంలో పాలకులు ఎలా ఉండకూడదో మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అండ్ కో రుజువు చేసినందున తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యేలుగా ఎన్నికైనవారు బాధ్యతతో మెలగాలి. జగన్‌కు వ్యతిరేకంగా ప్రజలు కసిగా తీర్పు ఇచ్చినందున ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రుల వ్యవహార శైలిని ప్రజలు నిశితంగా గమనిస్తుంటారు. అధికారం బాధ్యత మాత్రమే అని తెలుసుకుంటే మంచిది. తమకు 11 సీట్లు మాత్రమే ఎందుకు వచ్చాయో గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకోవడానికి అధికారంలో ఉన్నప్పుడు ఉన్మాదంగా వ్యవహరించిన జగన్ అండ్ కో సిద్ధపడడం లేదు. కనుక వారి విషయం ప్రజలే తేల్చుకుంటారు. శాసనసభలో దారుణంగా అవమానంపాలైన చంద్రబాబు.. శాసనసభను బహిష్కరించి ముఖ్యమంత్రిగానే మళ్లీ సభలో అడుగుపెడతానన్న తన శపథాన్ని నెరవేర్చుకున్నారు. నాటి ఆయన ధర్మాగ్రహాన్ని ప్రజలు అర్థం చేసుకుని దీవించారు. 1989 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత నన్నపనేని రాజకుమారి తనను మాటలతో కించపరిచారన్న కారణంగా ఎన్టీరామారావు కూడా అప్పట్లో శాసనసభను బహిష్కరించారు. ఆ తర్వాత 1994లో భారీ మెజారిటీతో మళ్లీ అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్.. ముఖ్యమంత్రిగానే సభలో అడుగిడారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా లభించలేదు. ఇప్పుడు మళ్లీ ఇంతకాలానికి జగన్‌రెడ్డికి కూడా ప్రతిపక్ష నాయకుడి హోదా లభించలేదు. అయినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విర్రవీగకుండా శాసనసభ్యుల ప్రమాణస్వీకారం సందర్భంగా జగన్మోహన్‌రెడ్డికి సముచిత గౌరవం కల్పించారు. కానీ జగన్ రోత మీడియా మాత్రం ఆయనను అవమానించారంటూ వార్తలు వండి వార్చి తన బుద్ధి పోనిచ్చుకోలేదు. తనకు తగిన గౌరవం ఇచ్చినా జగన్ మాత్రం హుందాగా వ్యవహరించలేకపోయారు. శాసనసభ సభ్యుడిగా ప్రమాణం చేసిన వెంటనే సభలో కూర్చోకుండా వెళ్లిపోయారు. ఎన్నికల్లో తన ఓటమిని ఊహించని జగన్మోహన్‌రెడ్డి, ఇప్పటికీ ఆ ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నారు. మళ్లీ మనమే అధికారంలోకి వస్తామని ఆయన తన మనుషులకు చెప్పుకొంటూ మానసిక ఆనందం పొందుతున్నారు. 2019 ఎన్నికల్లో 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన జగన్.. 2024 ఎన్నికల్లో 164 సీట్లతో అధికారంలోకి వచ్చిన కూటమిని ఓడించడం రాజకీయంగా అసాధ్యం కాదు గానీ తన ఈ ఘోర పరాభవానికి కారణం ఏమిటో ఆయన తెలుసుకునే ప్రయత్నం చేయకపోవడమే ఆశ్చర్యంగా ఉంది.

> ప్రస్తుతానికి చంద్రబాబు హుందాగానే వ్యవహరిస్తున్నారు. నాడు నిండు సభలో నన్ను అవమానించారు కనుక ఇప్పుడు నేను నిన్ను అవమానిస్తానని చంద్రబాబు భావిస్తే ఆయనకు, జగన్మోహన్‌రెడ్డికీ తేడా ఏముంటుంది? ప్రభుత్వ యంత్రాంగంలో లోపించిన జవాబుదారీతనాన్ని తిరిగి తీసుకురావాలి. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా అమలులో ఉందన్న భావన ప్రజలలో కల్పించాలి. రాజధాని అమరావతిని రెండు మూడేళ్లలో కట్టేస్తామని గొప్పలు చెప్పుకోవడం తగదు. చేయాలనుకున్నది చేసి చూపించండి. వాటి ఫలితాలు ప్రజలకు అందితే ఆటోమేటిక్‌గా ప్రజల మద్దతు లభిస్తుంది. రాష్ట్ర ఖజానాపై ఆర్థిక భారం మోపే పథకాల వల్ల ప్రయోజనం ఉండదు. ప్రభుత్వంపై ప్రజాభిప్రాయాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. ఈ దిశగానే చంద్రబాబు పాలన సాగుతుందని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా అందుకు సహకరిస్తారని ఆశిద్దాం.

జగన్ విపరీత మనస్తత్వం!

రాజకీయాలలో ఆత్మవిమర్శ చేసుకుని ముందుకుసాగినవాడే కింద పడినా పైకి లేవగలడు. జగన్మోహన్‌రెడ్డిది విపరీత మనస్తత్వం అని గతంలో అనేక పర్యాయాలు చెప్పుకొన్నాం. ఆయనలో సాధారణ లక్షణాలు ఉండివుంటే తన నివాసం కోసం రుషికొండపై 550 కోట్లు ప్రజాధనం ఖర్చు చేసి మాయామహల్ నిర్మించుకొని ఉండేవారు కాదు. ఆ భవనాన్ని సొంత డబ్బుతో నిర్మించుకొని ఉంటే ఎవరికీ అభ్యంతరం ఉండేది కాదు. జనం సొమ్ముతో విలాసంగా బతకడానికి మనం రాచరిక వ్యవస్థలో లేం కదా? తాడేపల్లి ప్యాలెస్ వద్ద నాలుగు వైపులా కాంపౌండ్ వాల్‌పై 30 అడుగుల ఎత్తులో గ్రిల్ నిర్మించుకోవడాన్ని ఎవరైనా ఎలా జీర్ణించుకోగలరు? ఒక ముఖ్యమంత్రి రక్షణకు 30 అడుగుల ఎత్తులో గ్రిల్ నిర్మించుకోవడం విపరీత మనస్తత్వానికి నిదర్శనం కాదా? ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వ్యక్తికి ఇలాంటి ఆలోచనలు ఎందుకొస్తాయో తెలియదు! జగన్ మానసిక పరిస్థితిపై మానసిక వైద్యులు పరిశోధనలు చేయవలసిన అవసరం ఉంది. తాను నివసించినా నివసించకపోయినా ఊరికో ప్యాలెస్ నిర్మించుకోవడం జగన్‌రెడ్డి నైజం. పూర్వం రాజులు మాత్రమే ఇలా వేసవి, శీతాకాల విడిది కోసం ప్యాలెస్‌లు నిర్మించుకున్నారు. తానొకటి తలిస్తే దైవం మరొకటి తలచిందన్నట్టుగా రుషికొండపై ముచ్చటపడి కట్టించుకున్న ప్యాలెస్‌లోకి అడుగుపెట్టకుండానే జగన్ అధికారం కోల్పోయారు. హైదరాబాద్, బెంగళూరుల్లో సొంత డబ్బుతో ప్యాలెస్‌లు నిర్మించుకున్నందున అప్పుడు ప్రజలు పట్టించుకోలేదు. ప్రజల సొమ్ముతో రుషికొండపై ప్యాలెస్ నిర్మించినందునే ఆయన బాధ్యత తీసుకోవాలి. తాడేపల్లిలో 30 అడుగుల ఎత్తులో గ్రిల్‌ను నిర్మించుకున్నారంటే ఆయన ఏదో ఒక మానసిక సమస్యతో బాధపడుతున్నారని భావించాల్సి ఉంటుందని అంటున్నారు. కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని వెచ్చించి అంతెత్తున గ్రిల్ నిర్మించడానికి అధికారులు ఏ నిబంధన కింద అనుమతించారో తెలియదు. మిలటరీ పాలకులు కూడా ఇలాంటి శత్రు దుర్భేద్యాలను నిర్మించుకోరు. కొంత మందిలో విపరీత పోకడలు ఉంటాయి. బంగారంపై మోజుతో కొంత మంది పది నుంచి పదిహేను కిలోల బంగారు నగలను ఒంటిపై వేసుకొని తిరగడం చూశాం. అది ప్రైవేటు వ్యవహారం కనుక మనం వారి గురించి కాసేపు మాట్లాడుకొని మరచిపోతాం. జగన్మోహన్‌రెడ్డికి బంగారంపై మోజు లేదు. తనతో పాటు తన భార్య కూడా ఆడంబరంగా కనపడకూడదని కోరుకునేవారు. అయితే రాచరిక నియంతృత్వ పోకడలను మాత్రం అణచుకోలేకపోయారు. ఫలితంగా ప్రజల తిరస్కారానికి గురయ్యారు.

వ్యవస్థ సర్వభ్రష్టత్వం!

రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత అప్పట్లో పరిస్థితులు ఎలా ఉండేవో అధికారులు నోరు విప్పి చెప్పడం మొదలుపెట్టారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అయివుండి కూడా ఇంతగా ఎందుకు దిగజారిపోయారని ప్రశ్నించగా, "జగన్ పాలనలో ఒక రకమైన భయానక వాతావరణం ఉండింది. మనసులో మాట చెప్పుకోవడానికి కూడా సాహసించలేకపోయాం. భయం గుప్పిట్లో బతికాం. అందుకే మనసు చంపుకొని పనిచేశాం" అని కొంత మంది అధికారులు చెబుతున్నారు. మొత్తమ్మీద జగన్మోహన్‌రెడ్డితో పాటు ఆయన కోటరీలో ఉన్న వారి విపరీత మనస్తత్వాల వల్ల అధికార యంత్రాంగం కుళ్లిపోయింది. తెలంగాణలో కూడా అధికార వ్యవస్థ భ్రష్టుపట్టిపోయింది. ప్రగతిభవన్ పేరిట ప్యాలెస్‌ను పోలిన భవనాన్ని నిర్మింపజేసి అందులో నుంచి కాలు బయటపెట్టకుండా కనుసైగలతో రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. ఇది జరిగిన తర్వాత కూడా జగన్ అండ్ కో జాగ్రత్తపడలేదు. అధికారులు కూడా తమ ధోరణి మార్చుకోలేదు. బటన్లు నొక్కుతున్నందున జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తారని నమ్మి అడ్డగోలు పనులు చేశారు. ఈ నేపథ్యంలో కుళ్లిపోయిన అధికార యంత్రాంగంతోనే పని చేయించుకోవల్సి రావడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు కత్తి మీద సాము వంటిదే. ఏ అధికారి ఎంతగా చెడిపోయిందీ తెలుసుకోవడానికి స్కానర్లు లేవు కదా! అందుకే అధికారుల ఎంపికలో కొన్ని తప్పులు జరిగాయి. అయితే చంద్రబాబుకు ఆప్షన్లు తక్కువ. గతంలో సమర్థులుగా పేరు తెచ్చుకున్న అధికారులు కూడా ఈ ఐదేళ్లలో చెడిపోయారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు, చేసిన ఎంపికలపై తెలుగు తమ్ముళ్లు నిరసన వ్యక్తంచేస్తున్నారు. జగన్మోహన్‌రెడ్డి సృష్టించిన సంప్రదాయం ఆమోదయోగ్యం కాకపోయినా చంద్రబాబు కూడా అలాగే వ్యవహరించాలని తెలుగు తమ్ముళ్లు సోషల్ మీడియాలో రెచ్చిపోతున్నారు. జగన్ తరహాలోనే పాలించే పక్షంలో ప్రభుత్వం మారడం ఎందుకు? జగన్‌ను జనం కసిగా ఎందుకు ఓడించారో తెలుసుకోవడానికి కూడా తెలుగు తమ్ముళ్లు అంగీకరించడం లేదు. రాజకీయాల్లో ఈ ఐదేళ్లూ ప్రత్యేక అధ్యాయం అని చెప్పవచ్చు. గ్రామ స్థాయి కార్యకర్త నుంచి చంద్రబాబు వరకు అందరూ ప్రభుత్వ వేధింపులకు గురయ్యారు. అయితే కొంత మంది నాయకుల వలె తలవొంచి రాజీ పడకుండా జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ప్రతి కార్యకర్తా తాజా విజయంలో తమ వాటా ఉందని భావిస్తున్నారు. తమకు ఎదురైన అనుభవాలను గుర్తుచేసుకుంటూ పగ తీర్చుకోవాలని రగిలిపోతున్నారు. దీనికితోడు గుడివాడలో ఇంతవరకు ఓటమి తెలియని కొడాలి నాని వంటి వారు ఇప్పుడు ఘోర పరాజయం పాలయ్యాక కూడా గుణపాఠం నేర్చుకోకుండా నోటికి పని చెబుతున్నారు. దీంతో తెలుగు తమ్ముళ్లు చంద్రబాబును టార్గెట్‌గా చేసుకొని సోషల్ మీడియాలో విమర్శలు చేస్తున్నారు. లోకేశ్ చెబుతూ వచ్చిన రెడ్‌బుక్‌ను మడచి పెట్టుకొమ్మని పరుషంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. జగన్‌రెడ్డి వలె కక్షపూరిత పాలన చేయాలనుకోవడం సమర్థనీయం కాదు. అదే జరిగితే రాష్ట్రం మొత్తం ఫ్యాక్షన్ జోన్‌గా మారిపోతుంది. అదే సమయంలో మితిమీరిన ఉదారత్వం కూడా ప్రదర్శించకూడదు. తప్పు చేసిన అధికారులను, నాయకులను చట్టప్రకారం శిక్షించడానికి చర్యలు తీసుకోవలసిందే. కంటికి కన్నూ పంటికి పన్నూ ప్రజాస్వామ్యంలో చెల్లదు.

> జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే కూల్చివేయించిన ప్రజావేదికను అలాగే ఉంచాలి. అప్పుడే విధ్వంసకర పాలనను ప్రజలు ఆమోదించరని భావితరాల నాయకులకు హెచ్చరికగా ఉంటుంది.



akbar

..అలా చేస్తే తేడా ఏముంది?

వివేకానంద రెడ్డిని హత్య చేయించిన వారిని ముఖ్యమంత్రిగా జగన్ రక్షించారని ప్రజలు నమ్మారు. అందుకే ఆయన సొంత జిల్లా కడపలో కూడా మూడే స్థానాలు వచ్చాయి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వంటి వారు కూడా చావు తప్పి కన్ను లొట్టబోయిన చందంగా ఆరేడు వేల స్వల్ప మెజారిటీతో గెలిచారు. కూటమి నేతలు అభ్యర్థుల ఎంపికతో పాటు మరికొన్ని జాగ్రత్తలు తీసుకొని ఉంటే జగన్మోహన్‌రెడ్డికి పదకొండు అసెంబ్లీ సీట్లు, నాలుగు లోక్‌సభ సీట్లు కూడా వచ్చివుండేవి కావు. అసెంబ్లీలో ఐదారు సీట్లే వచ్చి వుండేవి. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం లేకపోవడం శ్రేయస్కరం కాదు. అయితే జగన్ అండ్ కో పోకడల కారణంగానే ప్రజలు ఇటువంటి తీర్పు ఇచ్చారు. ఇంత జరిగినా జగన్ అండ్ కో వైఖరిలో కించిత్ మార్పు కూడా రాకపోవడం ఆశ్చర్యంగా ఉంది. తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్‌రెడ్డి వాడుతున్న ఫర్నిచర్ విలువ ఎంతో చెబితే డబ్బులు ముఖాన పడేస్తామని కొడాలి నాని వంటి వారు నోరు పారేసుకోవడం ఏమిటి? ఇవ్వడానికి మీరెవరు? తీసుకోవడానికి చంద్రబాబు ఎవరు? అది ప్రభుత్వ ఆస్తి. గతంలో ఓడిపోయిన మంత్రులు తమ ఇళ్లలోని ఫర్నిచర్‌ను ప్రభుత్వానికి అప్పగించేవారు. ప్రభుత్వ వాహనాలను ఇంట్లో పిల్లలు స్కూలుకు వెళ్లడానికి లేదా సొంత అవసరాలకు వాడుకోవడాన్ని నైతికంగా నేరంగా ఒకప్పుడు పరిగణించేవారు. ఇప్పుడు ఇంత సున్నితంగా ఆలోచించేవారు ఎక్కడ? కొడాలి నాని వంటి వారు గతంలో మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ రావును ఇదే ఫర్నిచర్ పేరిట వేధించినప్పుడు నోరు ఎందుకు విప్పలేదు? అప్పుడు ఆయన కూడా ఫర్నిచర్ విలువ చెల్లిస్తానని చెప్పినా కూడా వినకుండా వేధించారు. విలువ కట్టడం ఎందుకు? వాడుకున్న ఫర్నిచర్‌ను స్వాధీనం చేయవచ్చు కదా? ప్రస్తుతానికి చంద్రబాబు హుందాగానే వ్యవహరిస్తున్నారు. నాడు నిండు సభలో నన్ను అవమానించారు కనుక ఇప్పుడు నేను నిన్ను అవమానిస్తానని చంద్రబాబు భావిస్తే ఆయనకు, జగన్మోహన్‌రెడ్డికీ తేడా ఏముంటుంది? శాసనసభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన జగన్ సభా కార్యక్రమాల్లో పాల్గొనకుండా పులివెందుల వెళ్లిపోయారు. సభకు హాజరయ్యే విషయంలో ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారో తెలియదు. గత శాసనసభలో స్పీకర్ తమ్మినేని సీతారాం కూడా ప్రతిపక్షంపై తరచుగా నోరు పారేసుకున్నారు. ఇప్పుడు స్పీకర్‌గా ఎన్నికైన చింతకాయల అయ్యన్నపాత్రుడికి కూడా నోటి దురుసు ఎక్కువే. సభాపతిగా ఆయన ఎలా వ్యవహరిస్తారో చూడాలి. సభను ఆయన అదుపు చేస్తారో? ఆయనను సభ అదుపు చేస్తుందో? చూడాలి. జగన్ అండ్ కో పోకడలతో పాటు వారి నోళ్లకు అదుపు లేకపోవడం వల్లనే ఈ ఘోర పరాజయం వారికి ఎదురైంది. మేం శాశ్వతంగా అధికారంలో ఉంటాం— చంద్రబాబు పనైపోయిందని భావించి విర్రవీగారు. ఇప్పుడు అవమాన భారాన్ని తట్టుకోలేకపోతున్నారు. జగన్మోహన్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో కూడా 40 శాతం వరకు ఓట్లు వచ్చాయని, ఆ విషయం మరచిపోకూడదనీ కొంత మంది అపర మేధావులు చెబుతున్నారు. నిజమే, గత ఎన్నికల్లో కూడా 23 సీట్లు మాత్రమే వచ్చిన చంద్రబాబుకు కూడా 40 శాతం ఓట్లు వచ్చాయి. ఇప్పుడున్న సమాజంలో కళ్లెదురుగా హత్యలు చేసిన, చేయించిన వారికి కూడా కుల, మత ప్రాతిపదికన ఎన్నో కొన్ని ఓట్లు వేసేవారు ఉన్నారు. అలాగని జగన్‌రెడ్డిని తీసిపారేయడం కూడా సరికాదు. చంద్రబాబు ప్రభుత్వం మునుముందు ఎలా వ్యవహరించబోతున్నది అన్నదాన్ని బట్టి జగన్ రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వ వ్యతిరేకత ఆధారంగానే ఇటీవలి కాలంలో ప్రజలు తీర్పు ఇస్తున్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇచ్చిన తీర్పు జగన్‌రెడ్డికి వ్యతిరేకంగా ఇచ్చింది మాత్రమే. తెలుగుదేశం—జనసేన—బీజేపీ మధ్య పొత్తు కుదిరినందున మెజారిటీలు పెరిగాయి. గత ఐదేళ్ల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు తగు విధంగా అడుగులు వేస్తారని ఆశిద్దాం. ఈ ఐదేళ్లలో ఆయనకు అనేక మంది అనేక రూపాలలో సహాయ సహకారాలు అందించారు. వారంతా తమకు తగిన గుర్తింపు, గౌరవం దక్కాలని కోరుకుంటారు. అందులో తప్పు లేదుగానీ ప్రభుత్వాన్ని నడిపించడంలో సారథికి స్వేచ్ఛ ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరినందున కూటమిలోని భాగస్వామ్య పక్షాలు కూడా తమ మాటకు విలువ ఉండాలని, పదవుల పంపకంతో పాటు అధికారంలో వాటా ఉండాలని కోరుకుంటారు. చంద్రబాబుకు ఇదొక విషమ పరీక్ష. అయితే అనేక డక్కామొక్కీలు తిన్న అనుభవం ఉన్నందున, జనసేనాని పవన్ మనసు నొప్పించకుండా చాకచక్యంగా వ్యవహరిస్తారని భావించవచ్చు. తెలుగు తమ్ముళ్లు కూడా తమ నాయకుడు చంద్రబాబును జగన్‌తో పోల్చుకోకూడదు. జగన్ మనస్తత్వం బాబుకు కూడా అలవడి ఉంటే ఇంతకాలంగా ఆయన రాజకీయాల్లో కొనసాగి ఉండేవారు కారు. ప్రస్తుత దేశ రాజకీయాల్లో నాలుగున్నర దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్న నాయకుడు మరొకరు లేరు. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే కూల్చివేయించిన ప్రజావేదికను అలాగే ఉంచాలి. అప్పుడే విధ్వంసకర పాలనను ప్రజలు ఆమోదించరని భావితరాల నాయకులకు హెచ్చరికగా ఉంటుంది. సోషల్ ఇంజనీరింగ్ పేరిట ఎన్నికల్లో కులాలవారీగా సీట్లు కేటాయించినా ఫలితం ఉండదు. గుడ్ గవర్నెన్స్‌కు మాత్రమే ప్రజల మద్దతు ఉంటుంది. ఈ ప్రభుత్వం మాది— ఈ ప్రభుత్వంలో మేమంతా హాయిగా జీవిస్తున్నాం. ఏ ఒక్క వర్గానికీ అన్యాయం జరగలేదు.. ప్రతి వర్గానికీ మేలు చేస్తున్నారన్న భావన ప్రజల్లో ఏర్పడాలి. అప్పుడే ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఫీల్ గుడ్ భావన ఏర్పడుతుంది. సంక్షేమం పేరిట ప్రజలకు ఇంత పడేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తామంటే కుదరదని జగన్ విషయంలో రుజువైంది. ప్రభుత్వ యంత్రాంగంలో లోపించిన జవాబుదారీతనాన్ని తిరిగి తీసుకురావాలి. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా అమలులో ఉందన్న భావన ప్రజలలో కల్పించాలి. రాజధాని అమరావతిని రెండు మూడేళ్లలో కట్టేస్తామని గొప్పలు చెప్పుకోవడం తగదు. చేయాలనుకున్నది చేసి చూపించండి. వాటి ఫలితాలు ప్రజలకు అందితే ఆటోమేటిక్‌గా ప్రజల మద్దతు లభిస్తుంది. రాష్ట్ర ఖజానాపై ఆర్థిక భారం మోపే పథకాల వల్ల ప్రయోజనం ఉండదు. ప్రభుత్వంపై ప్రజాభిప్రాయాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. ఈ దిశగానే చంద్రబాబు పాలన సాగుతుందని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా అందుకు సహకరిస్తారని ఆశిద్దాం. తెలివైన వాళ్లు మూర్ఖుల తప్పిదాలను గమనించి నేర్చుకుంటారు. అందుకే వారి నిర్ణయాలు ఇతరులకు కూడా ఆమోదయోగ్యంగా ఉంటాయి!


> జగన్మోహన్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో కూడా 40 శాతం వరకు ఓట్లు వచ్చాయని, ఆ విషయం మరచిపోకూడదనీ కొంత మంది అపర మేధావులు చెబుతున్నారు. నిజమే, గత ఎన్నికల్లో కూడా 23 సీట్లు మాత్రమే వచ్చిన చంద్రబాబుకు కూడా 40 శాతం ఓట్లు వచ్చాయి. ఇప్పుడున్న సమాజంలో కళ్లెదురుగా హత్యలు చేసిన, చేయించిన వారికి కూడా కుల, మత ప్రాతిపదికన ఎన్నో కొన్ని ఓట్లు వేసేవారు ఉన్నారు. అలాగని జగన్‌రెడ్డిని తీసిపారేయడం కూడా సరికాదు. చంద్రబాబు ప్రభుత్వం మునుముందు ఎలా వ్యవహరించబోతున్నది అన్నదాన్ని బట్టి జగన్ రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వ వ్యతిరేకత ఆధారంగానే ఇటీవలి కాలంలో ప్రజలు తీర్పు ఇస్తున్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇచ్చిన తీర్పు జగన్‌రెడ్డికి వ్యతిరేకంగా ఇచ్చింది మాత్రమే. తెలుగుదేశం–జనసేన–బీజేపీ మధ్య పొత్తు కుదిరినందున మెజారిటీలు పెరిగాయి. గత ఐదేళ్ల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు తగు విధంగా అడుగులు వేస్తారని ఆశిద్దాం.

> తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్‌రెడ్డి వాడుతున్న ఫర్నిచర్ విలువ ఎంతో చెబితే డబ్బులు ముఖాన పడేస్తామని కొడాలి నాని వంటి వారు నోరు పారేసుకోవడం ఏమిటి? ఇవ్వడానికి మీరెవరు? తీసుకోవడానికి చంద్రబాబు ఎవరు? అది ప్రభుత్వ ఆస్తి. గతంలో ఓడిపోయిన మంత్రులు తమ ఇళ్లలోని ఫర్నిచర్‌ను ప్రభుత్వానికి అప్పగించేవారు. ప్రభుత్వ వాహనాలను ఇంట్లో పిల్లలు స్కూలుకు వెళ్లడానికి లేదా సొంత అవసరాలకు వాడుకోవడాన్ని నైతికంగా నేరంగా ఒకప్పుడు పరిగణించేవారు. ఇప్పుడు ఇంత సున్నితంగా ఆలోచించేవారు ఎక్కడ? కొడాలి నాని వంటి వారు గతంలో మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ రావును ఇదే ఫర్నిచర్ పేరిట వేధించినప్పుడు నోరు ఎందుకు విప్పలేదు? అప్పుడు ఆయన కూడా ఫర్నిచర్ విలువ చెల్లిస్తానని చెప్పినా కూడా వినకుండా వేధించారు. విలువ కట్టడం ఎందుకు? వాడుకున్న ఫర్నిచర్‌ను స్వాధీనం చేయవచ్చు కదా?

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

దుమ్ములేపిన దుమ్ముగూడెం ఆనకట్ట

> ధవళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లులేక ఉభయ గోదావరి జిల్లాల్లో భూములు ఎండిపోతున్నాయి. మీ గవర్నమెంటు ఎవరో కాంట్రాక్టరుకు లబ్ధి చేయడానికి తెలంగాణలోని దుమ్ముగూడెం ప్రాజెక్టు గేట్లు మూసివేసి, గోదావరి నీరు కిందికి పారకుండా ఆంధ్ర రైతులను ఇబ్బంది పెడుతున్నది. ఇది అన్యాయం కదా! దీనిపై మీ వివరణ కావాలి అని ముక్కుశర్మ ముఖ్యమంత్రితో అన్నారు. ముఖ్యమంత్రికి తల తిరిగింది. ఎక్కడ గోదావరి, ఎక్కడ దుమ్ముగూడెం, ఎక్కడ ధవళేశ్వరం ప్రాజెక్టు, ప్రభుత్వానికి తెలియకుండా గేట్లు మూసివేయడమేంటి?



srini

అది 1970వ సంవత్సరం. తెలంగాణ ఉద్యమంతో పాటు ఆంధ్రా ఉద్యమం కూడా ఆరంభమైంది. ముఖ్యమంత్రిగా బ్రహ్మానందరెడ్డి దిగిపోయి పీవీ నరసింహారావు నియమించబడ్డారు. నేను ఒక రోజు సాయంత్రం శిల్పినగర్‌లో శిల్పులతో మాట్లాడుతుండగా, భద్రాచలం దేవాలయ బంట్రోతు వచ్చి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దేవస్థానం ఆఫీసుకు అర్జెంటుగా రమ్మన్నారు అని చెప్పాడు. అప్పుడు నాగిరెడ్డి గారు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్. నేను ఆయన రూములోకి ప్రవేశించగానే "ప్రకాశం గారు! హైదరాబాద్ నుంచి ఫోన్ ఇద్దరు ముఖ్య అతిథులు దైవదర్శనానికి భద్రాచలం వస్తున్నారు. అందులో ఒకరు ఎమ్మెల్యే వావిలాల గోపాలకృష్ణయ్య, రెండవవారు ఆంధ్రపత్రిక చీఫ్ రిపోర్టర్ ముక్కుశర్మ. ఇద్దరూ ఫైర్‌బ్రాండ్‌లే. జాగ్రత్తగా వారికి దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చేసి దైవదర్శనం చేయించండి. వారిద్దరూ ఉదయం 7 గంటలకల్లా దేవాలయానికి వచ్చి అభిషేక సేవలో పాల్గొంటారు. వారికి కావలసిన అన్ని ఏర్పాట్లు మీరు చూసుకోవాలి. వావిలాల ప్రభుత్వానికి సింహస్వప్నం. నిస్వార్థపరుడు. ముక్కుశర్మ వార్తలను కళ్లతోనే కాకుండా ముక్కుతో కూడా వాసన చూడగలడు. అందుకే ఆయనను ముక్కుశర్మ అని అంటారు. వీరు ఎప్పుడూ కలిసే ఉంటారు. బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ఆయన డైనింగ్‌రూమ్‌లో భోజనం చేస్తున్నా శర్మకి లోపలికి వెళ్లడానికి అనుమతి ఉండేది. అందుకని వారిని జాగ్రత్తగా చూడాల్సిన బాధ్యత మీ మీద పెడుతున్నాను" అని చెప్పారు.

మరునాడు ఉదయం ఆరు గంటలలోపే వారిని రిసీవ్ చేసుకోవడానికి చిత్రకూట మంటపంలోనే నేను, నాగిరెడ్డిగారు ఎదురుచూస్తున్నాం. వావిలాల, ముక్కుశర్మ ఏడు గంటలకల్లా దేవాలయ ప్రాంగణంలో ప్రవేశించారు. సాధారణ పరిచయాలయ్యాక వారిని రాజగోపురం నుంచి మెయిన్ దేవాలయంలోకి తీసుకువెళ్లి అర్థమంటపంలో కూర్చోబెట్టాను. దేవాలయ అర్చకులు శఠగోపాలాచారి, అప్పలాచార్యులిద్దరూ వారికి తీర్థమిచ్చి, సీతాలక్ష్మణ సమేత రామచంద్రుల వారి అభిషేకంలో కూర్చోబెట్టారు. పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత, దేవాలయం అర్చకులు వారిని ఆశీర్వదించి, ప్రసాదాలు అందజేశారు. వారు ప్రతి విషయం విశదంగా అడిగి తెలుసుకున్నారు. అంతా సవ్యంగా జరిగింది అనుకున్నాం. ఇంతలో మేము పర్ణశాల చూడాలనుకుంటున్నాం అని ముక్కుశర్మ రిక్వెస్టు చేశారు. భద్రాచలానికి 24 మైళ్ల దూరంలో ఉంది పర్ణశాల. వారిని తీసుకుని దేవాలయ బస్సులో పర్ణశాలకు వెళ్లాం.

1969లో వచ్చిన భూకంపానికి పర్ణశాల గుడి పడిపోయింది. దేవుని విగ్రహాలు మాత్రం సురక్షితంగా ఉన్నాయి. దేవాలయం గోదావరి ఒడ్డున ఉంది. హైదరాబాద్ నుంచి శాస్త్రజ్ఞులు, గణపతి స్థపతి, ఎండోమెంటు ఇంజనీర్లు అంతా వచ్చి చూశారు. పర్ణశాల చుట్టూ ఉన్నవి నల్లరేగడి నేలలు. భూకంపానికి సెంటరు గోదావరి అవతల ఉన్న లక్ష్మణగుట్ట అని నిర్ధారించారు. గోదావరి అవతల అన్నీ బొగ్గు గనులు. మళ్లీ దేవాలయం కట్టాలి కదా! హైదరాబాద్ నుంచి వచ్చిన నిపుణులు ఏం నిర్ణయించారంటే.. దేవాలయ ఫౌండేషన్ 36 అడుగుల లోతు ఉండాలి. అక్కడ ఆ విధంగా తవ్విన ఫౌండేషన్‌లో 24 అడుగులు రాతిబండలు, ఇసుకతో నింపాలి. దానిమీద ఆర్‌సీసీ (కాంక్రీటు) రాఫ్ట్ వేయాలి. అందులో 16 పిల్లర్లు కుదించి, గ్రౌండ్ లెవల్‌కు వచ్చిన తర్వాత, అక్కడ మళ్లీ పిల్లర్ల మీద కాంక్రీటుతో రాఫ్ట్ వేసి దాని మీద దేవాలయం కట్టాలి. ఈ పని ప్రారంభించే ముందు దేవుడి విగ్రహాలు తొలగించి, వేరేచోట ఉంచి వాటికి రోజూ పూజా కైంకర్యాలు జరపాలి. శాస్త్రబద్ధంగా విగ్రహాలను పీఠం నుంచి తొలగించి పక్కన ఉన్న సత్రంలోని ఒక గదిలో పర్యవేక్షింపజేశాం. ఎనిమిది నెలల తర్వాత దేవాలయం పూర్తయింది. ఆలయంలో విగ్రహాల పునః ప్రతిష్ఠ, సంప్రోక్షణ జరిగింది.

సరే ఇప్పటి విషయానికి వద్దాం. మేమందరం పర్ణశాలకు చేరుకున్నాక నేను వారికి భూకంపానికి దేవాలయం కూలిపోవడం, తిరిగి నిపుణుల సలహా మేరకు ఏ విధంగా నిర్మించింది వివరించాను. దేవాలయంలో పూజలు చేయించి, తిరిగి అందరం భద్రాచలం బయలుదేరాం. ఇంతలో శర్మగారు భద్రాచలం పోయే లోపల మనం దుమ్ముగూడెం ప్రాజెక్టు చూసి వెడదామన్నారు. దుమ్ముగూడెం మెయిన్ రోడ్డుకు ఆరు మైళ్ల లోపలగా ఉంటుంది. కాటన్ దొర ధవళేశ్వరం ప్రాజెక్టు కట్టడానికి ముందు రాజమండ్రి నుంచి గోదావరి నది ప్రవాహాన్ని గమనిస్తూ భద్రాచలం దాటి దుమ్ముగూడెం వరకు ప్రయాణించి అక్కడ ఒక బేరేజీ కట్టడానికి నిర్ణయించారు. ఇది ధవళేశ్వరానికి కొట్టుకువచ్చే బురద (సిల్టు) ఆపడానికి పనికొస్తుంది. అదికాక గోదావరి మధ్య ఇక్కడ చిన్న ద్వీపకల్పం కూడా ఉంది. పూర్వం ప్రాజెక్టులు నిర్మించే ముందు ప్రతి అంశాన్ని అధ్యయనం చేసి ప్రవాహవేగాన్ని, నీటి లభ్యతను, అది కట్టే చోట భూమి పటిష్ఠతను కూలంకషంగా పరిశీలించి ప్రాజెక్టులు కట్టేవారు. ధవళేశ్వరం, నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరామ్‌సాగర్ వంటివి దృఢంగా నిలబడి వేల ఎకరాలకు సాగు, తాగు నీరు అందిస్తున్నాయంటే అప్పటి పాలకులు, ఇంజనీర్లు, కంట్రాక్టర్ల దూరదృష్టి కారణం. ఆదరాబాదరాగా కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ఏ విధంగా నిరర్థకమైందో మన కళ్లముందు కనబడుతోంది కదా.

మేమందరం దుమ్ముగూడెం వెళ్లి ఆనకట్ట పైకి ఎక్కాం. హైదరాబాద్ నుంచి వచ్చిన పెద్దలు ప్రాజెక్టు చూసి సంతోషపడతారని అనుకున్నాను. కాని అక్కడ జరిగింది మరొకటి. దుమ్ముగూడెం ఆనకట్ట లాకులు పూర్తిగా మూసివేసి, గోదావరిలో ఎగువనీరును ఆపి నిల్వచేసి ఉంచారు. ముక్కుశర్మ నా వైపు తిరిగి ఇక్కడ ప్రాజెక్టుకు సంబంధించిన స్టాఫును ఎవరినైనా పిలిపించమన్నారు. అక్కడే ఉన్న ఇరిగేషన్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ మా వద్దకు వచ్చాడు. ఇదేదో కొంప మునిగేలా ఉందని నాకు అనుమానం వచ్చింది.

గోదావరి నీళ్లను కిందికి వదలకుండా ఎందుకు లాకులు బంద్ చేశారు అని శర్మగారు వర్క్స్ ఇన్‌స్పెక్టర్‌ను అడిగారు. అందుకాయన— ఆ ఏముందిలెండి, ఇప్పుడు గోదావరిలో ప్రవాహం తక్కువగా ఉంది కదా! ఎండాకాలం కదా! రాజమండ్రి పేపరు మిల్లుకు బొంగులు పంట్లు లాగా కట్టి, ఈ ప్రవాహంలో రాజమండ్రి దాకా తీసుకువెడతారు. ఆ బొంగు పంటులు ముందుకు కదలాలంటే నీళ్లు ఉండాలి కదా! అందుకనే అన్ని బొంగు పంట్లు, పై నుంచి ఇక్కడకు వచ్చేదాకా నీరు ఆపివేసి, తర్వాత కిందికి వదుల్తాం— అని చెప్పాడు.

ఈ బొంగులు ఎవరివి? దీనికి, డిపార్టుమెంటుకి ఏమి సంబంధం అని శర్మ అడిగారు. అందుకు ఇన్‌స్పెక్టర్— ఇవి ఒక ప్రైవేటు కాంట్రాక్టరువి. ఆయన పైన ఆదిలాబాద్ అడవుల నుంచి వీటిని నరికించి, పంటులుగా కట్టి, రాజమండ్రి పేపరు మిల్లుకు పంపుతాడు అని చెప్పాడు. అప్పుడు శర్మ ఎందుకు గోదావరి మీదుగా పంపుతున్నాడు. లారీలకు లోడ్ చేసి రాజమండ్రి పంపవచ్చు కదా అన్నారు. అందుకు ఇన్‌స్పెక్టర్— అది చాలా ఖర్చుతో కూడిన పని. ఇదైతే పంటు మీద ఇద్దరు మనుషులను బత్తెం, కూలి ఇచ్చి పంపిస్తే మూడవ రోజుకల్లా రాజమండ్రికి చేరతాయి. అక్కడ కాంట్రాక్టరు పేపరు మిల్లుకు అప్పజెప్పి పని పూర్తి చేసుకుంటాడు. మా డిపార్టుమెంటులో పైవాళ్లనందరినీ మేనేజ్ చేసుకున్నాడని ముసిముసి నవ్వులు నవ్వుతూ చెప్పాడు.

వాళ్లు ఎవరనుకుని ఈ అర్భకుడు డిపార్టుమెంటు గుట్టంతా బయటపెడుతున్నాడు అనుకుని నేను వెంటనే— ఏమయ్యా! చాలా ఎక్కువగా మాట్లాడుతున్నావు. వారెవరనుకుంటున్నావు. నోరు మూసుకుంటే మంచిదని వార్నింగ్ ఇచ్చాను. కాని అతను లెక్కచేయలేదు.

ధవళేశ్వరం ఆయకట్టుకు నీళ్లు వదలటానికి ప్రాజెక్టులో తగినంత నీటి నిల్వ లేదు. తూర్పు, పశ్చిమగోదావరి రైతులు నీళ్లకోసం గగ్గోలు పెడుతున్నారు. తెలంగాణ, ఆంధ్ర ఉద్యమాలు జోరుగా సాగుతున్నాయి. బ్రహ్మానందరెడ్డి దిగిపోయి పీవీ నరసింహారావు ముఖ్యమంత్రి అయ్యారు. ఇక్కడ దుమ్ముగూడెం ఆనకట్ట మీద ఇద్దరు ప్రముఖ వ్యక్తులు ఏదో డిస్కస్ చేస్తున్నారు. గోదావరి తల్లి దుమ్ముగూడెం ఎగువన నిండుగా ఉంది. దిగువన చిన్నపాయగా కనబడుతోంది. ప్రముఖులిద్దరూ నా వంక తిరిగి బయల్దేరదామన్నారు. సాయంత్రానికి భద్రాచలం చేరుకున్నాం. రాత్రికి వారు హైదరాబాద్ బయల్దేరి వెళ్లిపోయారు. నేను, మా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఊపిరి పీల్చుకున్నాం. కానీ జరిగింది మరొకటి.

మరుసటి ఉదయం తొమ్మిదింటికి వావిలాల గోపాలకృష్ణయ్య, ముక్కు శర్మ ముఖ్యమంత్రి నివాసానికి చేరుకున్నారు. ధవళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లలేక ఉభయ గోదావరి జిల్లాల్లో భూములు ఎండిపోతున్నాయి. మీ గవర్నమెంటు ఎవరో కాంట్రాక్టరుకు లబ్ధి చేయడానికి తెలంగాణలోని దుమ్ముగూడెం ప్రాజెక్టు గేట్లు మూసివేసి, గోదావరి నీరు కిందికి పారకుండా ఆంధ్ర రైతులను ఇబ్బంది పెడుతున్నది. ఇది అన్యాయం కదా! దీనిపై మీ వివరణ కావాలి అని ముక్కుశర్మ ముఖ్యమంత్రితో అన్నారు. ముఖ్యమంత్రి నిర్ఘాంతపోయారు. ఎక్కడ గోదావరి, ఎక్కడ దుమ్ముగూడెం, ఎక్కడ ధవళేశ్వరం ప్రాజెక్టు, ప్రభుత్వానికి తెలియకుండా గేట్లు మూసివేయడమేంటి?

అప్పటికే ఆంధ్ర ఉద్యమం ఊపందుకుంటున్నది. వెంటనే ముఖ్య కార్యదర్శిని పిలిచి ఆ పెద్దలకు వివరణ ఇప్పించారు. చకచకా ఫోన్లు కదిలి అప్పటి నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరును, ఆయన కింది దుమ్ముగూడెం ప్రాజెక్టులో ఉన్న సబార్డినేట్ ఉద్యోగులను సస్పెండ్ చేశారు. అర్జెంటుగా గేట్లు తెరచి కిందికి నీళ్లు వదిలారు.

అదీ! ఒక శక్తిమంతుడైన పత్రికా విలేఖరి, నిస్వార్థపరుడైన శాసనసభ్యుడి పరిశోధన! ఇప్పుడు అటువంటి వ్యక్తులు గాని, వ్యవస్థ గాని కరువయింది.

▪ కొప్పుల ప్రకాశం
రిటైర్డ్ ఇంజనీరు, భద్రాచలం



బాలసముద్రం చెత్తట్రాన్స్‌ఫర్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల పనులు పూర్తి చేయండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, జూన్ 22: బల్దియా పరిధిలోని రెండు చోట్ల ఏర్పాటు చేసిన చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు ఆదేశించారు. హనుమకొండ బాలసముద్రం, వరంగల్ పోతననగర్‌లోని చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లను సిబ్బందితో కలిసి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సివిల్ పనులు పూర్తి చేసి త్వరగా చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లను వినియోగంలోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధి కారులకు సూచించారు. రెండు ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు పనిచేస్తే నగరంలో ఉన్న చాలా చెత్తను త్వరితగతిన తరలించవచ్చన్నారు. సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈలు రాజయ్య, సంజయ్‌కుమార్, డీఈలు రవికుమార్, సంతోష్‌బాబు, శానిటరీ సూపర్ వైజర్ శ్యాంరాజు పాల్గొన్నారు.

వైద్యం మిథ్య!



- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందని వైద్యం
- కనీస సౌకర్యాలు కరువు, డాక్టర్ల పోస్టులు ఖాళీ
- కానరాని ల్యాబ్‌టెక్నీషియన్లు, సిబ్బంది కొరతతో ఇబ్బందులు
- దయనీయంగా ఆరోగ్య ఉపకేంద్రాలు
- ప్రహసనంగా మారిన పల్లె దవాఖానాలు
- ఏజెన్సీ ప్రాంతాల్లో దైన్యం
- దూరంగా పీహెచ్‌సీలు
- కొత్త పీహెచ్‌సీల ప్రతిపాదనలు బుట్టదాఖలు
- అన్ని ఆస్పత్రుల్లో తీవ్రంగా మందుల కొరత
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణ రోగులు



వరంగల్ మెడికల్, జూన్ 22: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) వైద్యం అందని ద్రాక్షలా మారింది. అనేక సమస్యలతో కునారిల్లుతున్న ఈ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద రోగులకు సరైన వైద్యాన్ని అందించలేక పోతున్నాయి. చేసేది లేక చివరకు వారు ప్రైవేటు ఆస్పత్రులను సందర్శించక తప్పడం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు పాలకులు పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటున్న వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. పీహెచ్‌సీల్లో డాక్టర్లతో పాటు వివిధ విభాగాల్లో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేసే విషయంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది.

డాక్టర్ల కొరత

ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల్లో పల్లె దవాఖానాలను నెలకొల్పినా పలుచోట్ల డాక్టర్లను నియమించలేదు. మహిళా, పురుష సమీకృత కార్య కర్తలు (ఎంపీహెచ్) పోస్టులు కూడా 40 శాతానికిపైగా ఖాళీగా ఉన్నాయి. ఒక్కో పీహెచ్‌సీలో ఇద్దర ప్రధాన వైద్యులను నియమించాల్సి ఉండగా, కొన్ని కేంద్రాల్లో ఒక్కొక్కరు మాత్రమే ఉన్నారు. దీంతో ఆర్‌బీఎస్‌కే నుంచి కొందరిని పల్లె దవాఖానాల్లో నియమించినా వారిని కూడా పీహెచ్‌సీలకు సర్దుబాటు చేస్తూ డిప్యూటేషన్‌పై పంపిస్తున్నారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొన్ని చోట్ల పూర్తిస్థాయి వైద్య సేవలు అందడం లేదు. పీహెచ్‌సీల్లో, పల్లె దవాఖానాల్లో, ఆరోగ్య ఉపకేంద్రాల్లో డాక్టర్ల లేకపోవడంతో రోగులు ఆ వైద్య కేంద్రాలకు వేళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. పీహెచ్‌సీల్లో ఒక్క డాక్టరే ఉండడంతో ఆయన సెలవు పెట్టినరోజు ఆ కేంద్రంలో రోగులకు వైద్య సేవలకే కూడా సెలవే. ఒక్కో పీహెచ్‌సీకి రోజుకు కనీసం 60 నుంచి 70 మంది రోజులు వస్తుంటారు. వారంతా పీహెచ్‌సీకి వచ్చి డాక్టర్ కోసం పడిగాపులు కాయడం, తీరా ఆ రోజు డాక్టర్ రావడం లేదని చెప్పడం నిరాశతో వెనుతిరిగి వెళ్లడం పరిపాటిగా మారింది.

ల్యాబ్ టెక్నీషియన్లు లేక..

ఉమ్మడి జిల్లాలో అనేక ల్యాబ్ టెక్నీషియన్ల (ఎల్‌టీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంలో కీలకమైన ల్యాబ్‌టెక్నీషియన్లు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగ నిర్ధారణ పరీక్షల కోసం ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో పేద రోగులు అక్కడ పెద్ద మొత్తంలో ఫీజులు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నారు. పీహెచ్‌సీల్లో ఎల్‌టీలు లేకపోవడంతో రోగుల రక్త నమూనాలను అక్కడ ఉన్న ఇతర సిబ్బంది సేకరిస్తుండడం కనిపిస్తోంది.

అధ్వాన్నంగా ఉప కేంద్రాలు

ఉమ్మడి జిల్లాలోని ఆరోగ్య ఉపకేంద్రాలు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఆరోగ్య ఉపకేంద్రాలను పల్లెదవాఖానాలుగా తీర్దిదిద్దాలని ప్రభుత్వం భావించినప్పటికీ అది పూర్తిస్థాయిలో ఆచరణలోకి రాలేదు. ఇంతకాలం ఎన్ఎన్ఎం, ఆశావర్కర్ల సేవలకు మాత్రమే పరిమితమైన ఈ కేంద్రాల్లో క్వాలిఫైడ్ డాక్టర్లను నియమించాలని నిర్ణయించినప్పటికీ ఇప్పటి వరకు ఆ దిశగా పెద్దగా అడుగులు పడలేదు. ఆరోగ్య ఉపకేంద్రాలకు రావడానికి క్వాలిఫైడ్ డాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆశించిన లక్ష్యం నెరవే రలేదు. ప్రతీ ఐదువేల జనాభాకు ఒకటి చొప్పున ఆరోగ్య ఉప కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో ఇద్దరు ఏఎన్ఎంలు, ప్రతీ వెయ్యి జనాభాకు ఒక ఆశావర్కర్ చొప్పున ఉండి ప్రభుత్వ వైద్యసేవలను, పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లాలి. అయితే ఈ ఉప కేంద్రాల్లో డాక్టర్ల లేని కారణంగా అవి

మిగతా 8వ పేజీలో..

ఏజెన్సీలో అందని వైద్యం

గిరిజన ప్రాంతాల్లో కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు కలగా మారింది. ఏజెన్సీ పరిధిలోని మండలాలు విస్తీర్ణపరంగా పెద్దగా ఉంటాయి. రవాణ సౌకర్యాలు తక్కువగా ఉంటాయి. మారుమూల ప్రాంతాల్లో పరిస్థితులు మరింత దయనీయంగా ఉంటాయి. వ్యాధులు ఎక్కువగా ప్రబలేది ఇక్కడే. వాస్తవంగా ఇక్కడ ఒక్కో ఏజెన్సీ మండలంలో విస్తీర్ణాన్ని బట్టి రెండేసి పీహెచ్‌సీలను ఏర్పాటు చేయాల్సి ఉండగా, కొన్నిచోట్ల ఒక్కటి కూడా సరిగా లేదు. దీంతో ములుగు జిల్లా పరిధిలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సేవలు అందని దుస్థితి నెలకొని ఉన్నది. ఏజెన్సీల్లో కొత్త పీహెచ్‌సీల ఏర్పాటుకు వైద్యాధికారులు ప్రతిపాదనలు పంపినప్పటికీ ఇప్పటి వరకు ఆమోదానికి నోచుకోలేదు.

మృత్యుఘోష

ఏజెన్సీలో తరుచూ శిశువులు, గర్భిణులు, బాలింతలు మృతి చెందుతున్న సంఘటనలు తరుచూ చోటుచేసుకుంటుండడంతో మారుమూల కొత్త పీహెచ్‌సీల ఏర్పాటు చర్చనీయాంశంగా మారింది. ఏజెన్సీ ఏరియాలోని పీహెచ్‌సీలు మండల కేంద్రాలకు 50 నుంచి 60 కి.మీ. దూరంలో గ్రామాలు ఉండడం, ఆయా గ్రామాలకు ఎటువంటి రోడ్డు సదుపాయం లేకపోవడంతో రోగులు చికిత్స కోసం ప్రయాస పడాల్సి వస్తోంది. ఆయా ప్రాంతాల్లోని గిరిజనులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా సకాలంలో వైద్య సేవలు అందని పరిస్థితి. దీంతో రోగులు, గర్భిణులను మంచాల్లో మోసుకొని రావల్సి వస్తున్నది. ఈ క్రమంలో తల్లీ లేదా బిడ్డ ప్రాణాలు పోతున్న ఉదంతాలు కూడా అడపాదడపా చోటు చేసుకుంటున్నాయి. విస్తీర్ణపరంగా అధికంగా ఉన్న గిరిజన ప్రాంతాల్లో కొత్తగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాత ఆరోగ్య ఉపకేంద్రాలను పునర్విభజన చేయాల్సిన అవసరం ఉందని డాక్టర్లు అభిప్రాయపడుతున్నారు.



నలుగురు పోలీసులకు ప్రతిభా పురస్కార్

వరంగల్ క్రైం, జూన్ 22: విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులకు ప్రతిభా పురస్కార్ అవార్డులు ప్రకటించారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఉత్తమ సేవా పథకం టీ.యాదగిరి (హెడ్ కానిస్టేబుల్, ఆర్మ్డ్ రిజర్వ్), సేవా పథకాలు కె.శ్రీధర్‌రావు (ఇన్‌స్పెక్టర్), ఎం.డి.సాధిక్ (హెడ్ కానిస్టేబుల్, ఏఆర్), ఎం.భిక్షపతి (కానిస్టేబుల్, ఏఆర్), జి.శ్రీనివాస్ (కానిస్టుబుల్, ఏఆర్) పథకాలు పొందారు. 2023-24 సంవత్సరానికి ఎంపికైన వీరు ఆగష్టు 15న పురస్కారాలు అందుకోనున్నారు.



వర్సిటీ నిబంధనలు పాటించిన కళాశాలలకే గుర్తింపు

- డిగ్రీ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీలు చేస్తాం..
- అటానమస్ కళాశాల పరీక్షల ఫలితాలను ఆడిట్ చేస్తాం..
- కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి
- వర్సిటీ అనుబంధ కళాశాల ప్రిన్సిపాళ్లతో సమావేశం

7

డొల్ల కంపెనీల పేరిట మోసం

- జాబ్ గ్యారంటీ అంటూ వసూళ్లు
- డైరెక్టర్లుగా అవకాశం ఇస్తామని దగా
- దిక్కుతోచని స్థితిలో బాధితులు
- హనుమకొండలో ఓ నిర్వాహకుడి నయా దందా

7

గిరిజనుల సంక్షేమానికి ఎస్టీ కమిషన్ కృషి

- ప్రజల ఆరోగ్యంపై వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి..
- క్యాన్సర్ పేషెంట్ల కోసం పథకం తీసుకొచ్చిన కేంద్రం
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్



కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 22: దేశంలోని గిరిజనుల సంక్షేమం కోసం ఎస్టీ కమిషన్ పని చేస్తుందని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ పేర్కొన్నారు. హనుమకొండలోని కలెక్టరేట్‌లో శనివారం జిల్లా అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, వెంకట్‌రెడ్డిలతో కలిసి వైద్య, ఆరోగ్య, గిరిజన, హాస్టల్స్ తదితర అంశాలపై హుస్సేన్ నాయక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లా డుతూ.. క్యాన్సర్ పేషెంట్ల కోసం కేంద్ర ప్రభుత్వం పథకం తీసుకొచ్చిందని, ఈ పథకం ద్వారా క్యాన్సర్ వైద్యానికి రూ.15లక్షలు అందజేస్తుందన్నారు. ఈ పథకం గురించి ప్రచారం కల్పిస్తే అవసరార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎంజీఎం ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని, వైద్యం కోసం వచ్చే వారికి భరోసా కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. గిరిజన హాస్టళ్లలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కోసం అవసరమైతే సీట్లు, రూమ్‌ల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గిరిజన భవన్‌లో సౌకర్యాలను మెరుగుపరిచేవిధంగా ప్రణాళికను తయారు చేసి పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా విద్య, వైద్య, గిజన హాస్టళ్లు, ఆస్పత్రులు తదితర అంశాల గురించి ఆయా అధికారులను హుస్సేన్ నాయక్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షా సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, ప్రభుత్వ ఛాతి ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ రవి, డీటీడీవో ప్రేమకళ, హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగించాలి

వరంగల్ మెడికల్: ప్రభుత్వ ఆస్పత్రిలో కల్పిస్తున్న వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం కల్పించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ కోరారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ శనివారం సందర్శించారు. ఎంజీఎంలోని పలు వార్డులను ఆయన సందర్శించి రోగులతో మాట్లాడారు. వైద్యులు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మా ట్లాడుతూ.. ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రికి ధైర్యం వచ్చే వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ఆస్పత్రిలో పారిశుధ్య కార్యక్రమాన్ని ఇంకా మెరుగుపర్చాల్సిన అవస రం ఉందన్నారు. కొవిడ్ అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసేవలు కాస్త మెరుగైనప్పటికీ ఇంకా పటిష్టప ర్చాల్సిన అవసరం ఉందన్నారు.

రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులను నియమించాలన్నారు. ఎంజీఎం ఆస్పత్రిలో 1700 పడకలు ఉండగా, కేవలం 22 ఐసీయూ పడకలు మాత్రమే ఉండటం పట్ల విచారం వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాలను ఇంకా మెరుగుపర్చాల్సి ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిభారం ఎక్కువగా ఉందని, నలుగురు చేసే పని ఒక్కరే చేస్తున్నారని తమ పర్యటనలో గుర్తించామన్నారు. డాక్టర్లకు మెరుగైన జీతాలు ఇస్తే ఇంకా అంకితభావంతో పనిచేసే అవకాశం ఉందన్నారు. అనంతరం ఎంజీఎంలోని సూపరింటెండెంట్ చాంబర్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి, కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మోహన్‌దాస్, ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీతో 78,432 రైతులకు లబ్ధి

- డీసీసీ బ్యాంకు పరిధిలో మొత్తంగా రూ.529.44కోట్ల మాఫీ
- రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచే ముఖ్యమంత్రి
- మీడియా సమావేశంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూన్ 22: రాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయడం ద్వారా వరంగల్ ఉమ్మడి జిల్లాలో డీసీసీ బ్యాంకు పరిధిలో 78,432 రైతులకు లబ్ధి చేకూరనున్నట్లు తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో రుణమాఫీ, లబ్ధిపొందే రైతుల వివరాలను తెలియచేశారు. డీసీసీ పరిధిలోని బ్రాంచిలు, సహకార సంఘాల నుంచి రుణాలు తీసుకున్న రైతులకు ప్రభుత్వ నిర్ణయం ద్వారా గొప్ప ఆర్థిక ప్రయోజనం చేకూరనుందన్నారు. ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనల మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీసీసీ బ్యాంకు ద్వారా రుణమాఫీ కలిగే రైతుల వివరాలతో కూడిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందచేసినట్లు చెప్పారు. ఈ విషయంలో పూర్తి పారదర్శకతతో వ్యవహరించినట్లు చెప్పారు. రుణమాఫీ, రైతుల వివరాల గురించి సందేహాలు ఉన్నట్లైతే రైతు, సహకార సంఘాలు తమ ద్వారా నివృత్తి చేసుకోవచ్చని సూచించారు.

డీసీసీ బ్యాంకు, సహకార సంఘాల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రుణాలు తీసుకున్న రైతుల్లో 7లక్షల75వేల మంది రైతులకు ఆర్థిక ప్రయోజనం కలగనుందని చెప్పారు. రూ.5048.01 కోట్ల రుణమాఫీ జరుగనుందని వివరించారు. కేవలం డీసీసీ బ్యాంకులు, సహకార సంఘాల నుంచి రుణాల పొందిన రైతుల రుణాల మాఫీయే ఇంత పెద్ద మొత్తంలో ఉంటే.. ఇక వాణిజ్య ఇతర బ్యాంకుల నుంచి తీసుకున్న రైతులు భారీ మొత్తంలో ఉంటుందన్నారు.

ఇంతటి వ్యయభారాన్ని సైతం లెక్క చేయకుండా రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉండడం అభినందనీయమన్నారు. దేశ చరిత్రలోనే రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి ముఖ్యమంత్రిగా చిరస్థాయిలో నిలిచిపోతారని కొనియాడారు. గత ప్రభుత్వం దశల వారిగా రుణమాఫీ నిర్ణయాలు ప్రకటిస్తే కాంగ్రెస్ ప్రభు త్వం ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయడం సాహసోపేతమైనదిగా అభివర్ణించారు.


రుణమాఫీ విషయంలో ప్రతిపక్షాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నోరు పారేసుకున్నాయని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయంతో రైతులే వారికి గుణపాఠం చెప్పనున్నారని రవీందర్‌రావు పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీ బ్యాంకు డైరెక్టర్ హరిప్రసాద్, డైరెక్టర్లు నర్సింగారావు, నరేందర్, మురళీధర్, రవితేజ, జగన్ మోహన్, యాదగిరిరెడ్డి, డీసీసీ బ్యాంక్ సీఈవో మహ్మద్ వాజీర్ సుల్తాన్, సీపీవోలు రోహిణి, దమయంతి, కురువనాయక్, రాజశేఖర్, నవీన్, కల్యాణి, రాధిక, అశోక్, మధుసుదన్, స్రవంతి, కృష్ణమోహన్, రాజు, బ్యాంక్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసే నిర్ణయాన్ని తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, డీసీసీ బ్యాంకు డెరెక్టర్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. శుక్రవారం హనుమకొండలోని డీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయం ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం









రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం పదోన్నతులు కల్పించాలి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్




హనుమకొండలోని విద్యుత్ భవన్‌లో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

హనుమకొండ టౌన్, జూన్ 22: గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం పదోన్నతులు కల్పించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ సూచించారు. శనివారం నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో గిరిజన విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డితో హుస్సేన్‌నాయక్ ప్రత్యేకంగా సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా లైజనింగ్ ఆఫీసర్‌ను నియమించి, ఎస్టీ సెల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన ఉద్యోగులపై ఉన్న 20 డీసీ కేసులపై సమీక్ష జరిపి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్స్ మోహన్‌రావు, అశోక్, సదర్‌లాల్, గిరిజన విద్యుత్ ఉద్యోగుల అసోసియేషన్ కంపెనీ అధ్యక్షుడు భూక్య వాలునాయక్, అజ్మీర శ్రీరామ్‌నాయక్, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు బి.రాజశేఖర్, కేబీ రాజేందర్, స్వామినాయక్, తదితరులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో ఎస్టీ కేసులపై సమీక్ష

వరంగల్ క్రైం: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ శనివారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయానికి వచ్చారు. అదనపు డీసీపీ రవి కమిషన్ సభ్యుడికి స్వాగతం పలికారు. అనంతరం కమిషనరేట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఎస్టీ పెండింగ్ కేసుల వివరాలు, బాధితులకు అందించాల్సిన నష్టపరిహారానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని హుస్సేన్ నాయక్ సూచించారు.



మహదేవపూర్ సీఐపై బదిలీ వేటు

మహదేవపూర్ రూరల్, జూన్ 22: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ సీఐ రాజేశ్వరరావుపై బదిలీ వేటు పడింది. ఈ మేరకు మల్టీ జోన్-1 ఐజీ రంగనాథ్ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రతిని ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. రెండు నెలల కిందట మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో ఓ ప్రజాప్రతినిధి డ్యాన్స్ చేసిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. సందర్భంలో విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ సస్పెండ్ చేయడంతో పాటు ఎస్సై ప్రసాద్‌ను వీఆర్‌కు బదిలీ చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. మహిళా కానిస్టేబుల్‌పై లైంగిక దాడి కేసులో రెండు రోజుల కిందట కాళేశ్వరం ఎస్సై భవానీ సేన్ అరెస్టు డిస్మస్ అయ్యాడు. ఈరెండు ఘటనలు రెండునెలల వ్యవధిలో ఒకే సర్కిల్ పరిధిలో చోటు చేసుకోవడంతో పర్యవేక్షణ అధికారిగా ఉన్న మహదేవపూర్ సీఐ రాజేశ్వర్‌రావుపై బదిలీ వేటు పడినట్లు తెలుస్తోంది. వరుసగా సంఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో సమర్థంగా విధులు నిర్వర్తించే అధికారికి బాధ్యతలు అప్పగించాలని ఉద్దేశంతో సీఐ రాజేశ్వరరారవును బదిలీ చేసినట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం ఆయన స్థానంలో కొత్తవారికి బాధ్యతలు అప్పగించకపోవడంతో పోస్టింగ్ కోసం పలువురు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. గతంలో కాళేశ్వరం, మహదేవపూర్ పీఎస్‌లలో ఎస్సైలుగా పనిచేసి సీఐగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లిన అధికారులు.. మళ్లీ మహదేవపూర్ సర్కిల్‌లోనే పోస్టింగ్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. వీరితో మరో ఇద్దరు ఇదే సర్కిల్‌లో పోస్టింగ్ కోసం స్థానిక రాజకీయ నాయకుల సహకారంతో ఉప ముఖ్యమంత్రి వద్ద పైరవీ చేస్తున్నట్లు సమాచారం.











విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరిస్తున్న పాలిసెట్ జిల్లా కన్వీనర్ డాక్టర్ బైరి ప్రభాకర్

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం


వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 22: పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమైంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్ హెల్ప్‌లైన్ సెంటర్‌లో పాలిసెట్ వరంగల్ జిల్లా కన్వీనర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ శనివారం ప్రారంభించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మొదటి రోజు మొత్తం 480 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించినట్లు డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. కాగా, వెయ్యిలోపు ర్యాంకులు సాధించిన 15 మంది విద్యార్థుల తల్లిదండ్రులను కౌన్సెలింగ్ సెంటర్‌లో కన్వీనర్ డాక్టర్ ప్రభాకర్ శాలువాతో సత్కరించారు. విద్యార్థుల లక్ష్యసాధనకు అన్ని విధాలా సహకారాలు అందిస్తున్న తల్లిదండ్రులను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు చూపిస్తున్న శ్రద్ధకు గౌరవంగా తాము ఈ సత్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలిగినా తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

డొల్ల కంపెనీల పేరిట మోసం

● జాబ్ గ్యారంటీ పేరిట వసూళ్లు ● డైరెక్టర్లుగా అవకాశం ఇస్తానని దగా ● దిక్కుతోచని స్థితిలో బాధితులు

వరంగల్ క్రైం, జూన్ 22: డొల్ల కంపెనీలు పెట్టి నిరుద్యోగులను మోసం చేసిన ఘటన హనుమకొండలో చోటు చేసుకుంది. లేని కంపెనీలు ఉన్నట్లు పేపర్ల మీద సృష్టించి లక్షలు దండుకుని తప్పించుకుని తిరుగుతున్నాడు ఓ ప్రబుద్ధుడు. సదరు మాయలోడు చేసిన మోసంతో పలువురు నిరుద్యోగులు రోడ్డున పడ్డారు. అతడు చెప్పిన మాయమాటలు నమ్మిన బాధితులు లక్షలు పోగొట్టుకుని ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..

హనుమకొండలోని ఒక ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఒక వ్యక్తి.. 2017లో హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్రారంభించాడు. ఈ క్రమంలో 2020లో ఎథిరాం ప్రైవేటు లిమిటెడ్ కంపెనీని ప్రారంభించి వరంగల్ నగరంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రెయినింగ్ సెంటర్ ప్రారంభించాడు. స్థానికుల సహకారంతో మడికొండ ఐటీ సెక్టార్‌లో కొంత ప్రభుత్వ స్థలం తీసుకున్నాడు. జాబ్ గ్యారంటీ పేరిట ట్రెయినింగ్ ప్రారంభించి ఒక్కొక్కరి వద్ద రూ.2లక్షలకు పైగా వసూలు చేశాడు. ఇలా.. దాదాపు 100 మంది వద్ద డబ్బులు తీసుకున్నట్లు బాధితులు తెలిపారు. ట్రెయినింగ్ పూర్తి అయిన తర్వాత నిరుద్యోగులు ఉద్యోగాలపై నిలదీస్తే తప్పించుకుతిరిగాడు. దీంతో కంపెనీ నిర్వాహకుడిని విద్యార్థులు నిలదీశారు. ఈ విషయమై ఇంజనీరింగ్ కళాశాల ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో నిర్వాహకుడిని ప్రశ్నించారు. కేసు పెడతామని హెచ్చరించడంతో చెప్పా పెట్టకుండా రాత్రికి రాత్రి బోర్డు తిప్పేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. కంపెనీలన్నీ పేపర్లమీదనే ఉన్నట్లు గ్రహించిన బాధితులు.. మోసపోయినట్లు గ్రహించి నిర్వాహకుడి కోసం వెతికినా ఫలితం లేకుండాపోయిందని వాపోతున్నారు. అయితే హైదరాబాద్‌లో వెతికిపట్టుకున్న కొందరు విద్యార్థులను బెదిరించినట్లు సమాచారం. డబ్బులు పోగొట్టుకున్న బాధితులు వారి పేరు చెప్పేందుకు సైతం జంకుతున్నారంటే నిర్వాహకుడు ఏ స్థాయిలో బెదిరింపులకు గురిచేస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు.



భాగస్వామ్యం ఇస్తానని మోసం

ఎథిరాం ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ నిర్వాహకుడు ట్రెయినింగ్‌ల పేరిట నిరుద్యోగులను మోసం చేయడంతోపాటు డైరెక్టర్లుగా అవకాశం ఇస్తానని పలువురిని మోసం చేసినట్లు తెలిసింది. పొరుగు దేశంలో ఉన్న స్నేహితుడి వద్ద రూ.25లక్షలు తీసుకున్న సదరు కంపెనీ నిర్వాహకుడు.. మరొకరిని ఇండియాకు పిలిపించి మోసం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇండియాకు వచ్చిన మరో బాధితుడి నుంచి రూ.15లక్షలు తీసుకుని డైరెక్టర్ చేస్తానని మోసం చేయడంతో పాటు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వలేదని బాధితుడు తెలిపాడు. బాధితుడు ప్రస్తుతం హైదరాబాద్‌లో ఒక షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. పొరుగు దేశంలో ఉన్న బాధితుడు హైదరాబాద్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితులు తెలిపారు. హనుమకొండకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి ఒకరు తన కుమారుడికి ఎథిరాం కంపెనీలో డైరెక్టర్ అవకాశం ఇస్తానంటే రూ.1కోటి వరకు నిర్వాహకుడికి ఇచ్చాడు. ఈ విషయాన్ని స్వయంగా ప్రభుత్వ ఉద్యోగి తెలిపాడు. ఇలాగే మరో ముగ్గురి వద్ద రూ.15లక్షల చొప్పున తీసుకుని సంవత్సరంలో కోటి ఇస్తానని, నెలనెల రూ.1లక్ష వేతనం ఇస్తానని మోసం చేసినట్లు బాధితులు తెలిపారు. తన వద్ద పనిచేసే ఉద్యోగులకు సైతం వేతనాలు ఇచ్చేవాడు కాదనే విమర్శలున్నాయి. సదరు నిర్వాహకుడిపై బాధితులు ఇండస్ట్రీస్ ప్రిన్సిపల్ సెక్రెటరీకి, జిల్లా జనరల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు.

జాబ్ గ్యారంటీ అని మోసం చేశాడు..

ఎన్.రాహుల్, బాధితుడు



జాబ్ గ్యారంటీ అంటే శిక్షణ కోసం రూ.1లక్ష 50వేల చెల్లించాను. శిక్షణ కూడా ఏమి ఇవ్వలేదు. శిక్షణ కోసం లెక్చరర్స్ కూడా లేరు. మమ్మల్ని యూట్యూబ్‌లో చూసుకుని నేర్చుకోండి అనేవాడు. తొమ్మిది మాసాలు జాబ్ వస్తుందనే ఆశతో టీచింగ్ లేని శిక్షణలో పాల్గొన్నాం. తీరా జాబ్ గురించి ప్రశ్నించే సమయంలో బోర్డు తిప్పేసి వెళ్లాడు. డబ్బులు వసూలు చేసుకునేందుకు ప్రయత్నించాం. ఫలితం లేకుండా పోయింది. జాబ్ కోసం వచ్చి డబ్బులు పోగొట్టుకున్నాం. అతడి జాడ కోసం వెతుకుతున్నాను.

కంటెంట్ తీసుకుని మోసం చేశాడు..

కె.సంతోష్, బాధితుడు



మోసపూరిత మాటలు చెప్పి నేను తయారు చేసిన ఒక సంస్థకు సంబంధించిన కంటెంట్ తీసుకున్నాడు. ఒక సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్ తీసుకున్నాడు. నా సర్వీసు తీసుకుని మోసం చేశాడు. అతడి వల్ల రూ.15లక్షలకు పైగా నష్టపోయా. డబ్బులు అడిగితే అనుచరుడితో బెదిరింపులకు పాల్పడుతున్నాడు. లీగల్ నోటీసు ఇచ్చినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. అతడిపై పోలీసులు చర్యలు తీసుకోవాలి.

ప్రైవేటు ఫిర్యాదులు వచ్చాయి..

ఆర్.సంతోష్‌కుమార్, టీఎస్ఐఐసీ, జోనల్ మేనేజర్

ఎథిరాం ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి స్థలం కేటాయించాం. కిందటేడు భవనం పూర్తి చేయాల్సి ఉండగా, గడువు కోరితే మరో సంవత్సరం ఇచ్చాం. ఈ యేడు నెలాఖరులోగా పూర్తి చేయకుంటే నోటీసు ఇచ్చి కేటాయించిన స్థలం రద్దు చేస్తాం. సంస్థ నిర్వాహకుడిపై ప్రైవేటు ఫిర్యాదులు వచ్చాయి. నిర్వాహకుడుకి డబ్బులు ఇచ్చామని, భాగస్వామ్యం ఇస్తానని ఇవ్వలేదని, జాబ్ ఇస్తానని డబ్బులు తీసుకుని మోసం చేశాడని ఫిర్యాదు వచ్చాయి. అవి ప్రైవేటు ఫిర్యాదులు.. మా పరిధిలోవి కావు. కొంతమంది కంపెనీ వివరాలు ఆర్టీఏ కింద కోరితే అందించాం. నిబంధనలు విస్మరిస్తే సదరు నిర్వాహకుడిపై చర్యలు తీసుకుంటాం.

విద్యుత్ పోల్ ఎక్కే పరీక్షకు 12 మంది హాజరు

హనుమకొండ టౌన్, జూన్22: జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) నియామకాల్లో భాగంగా శనివారం హనుమకొండ ములుగురోడ్డులోని నార్తర్న్ పవర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌పీటీఐ)లో 7వ సారి నిర్వహించిన విద్యుత్ స్తంభం ఎక్కే పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి 16 మందికిగానూ 12 మంది హాజరైనట్లు హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ తెలిపారు. డైరెక్టర్ మోహన్‌రావు, వరంగల్ ఎస్ఈ మధుసూదన్‌రావు, టెక్నికల్ డీఈ ఆనందం, ఎన్‌పీటీఐ డీఈ రాజేందర్ పర్యవేక్షణలో వీడియోగ్రఫీ మధ్య పరీక్ష ముగిసింది. కాగా, కమిటీ ఎంపిక చేసిన అభ్యర్థుల పేర్లను హనుమకొండ ఎస్ఈ కార్యాలయంలో ప్రదర్శించనున్నట్లు ఎస్ఈ తెలిపారు.

మానుకోటలో యువకుడి అదృశ్యం



పొడకంటి రంజిత్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, జూన్ 22 : మహబూబాబాద్ జిల్లా కేంద్రం భవానినగర్‌లో ఈ నెల 10వ తేదీన పొడకంటి రంజిత్ అనే యువకుడు అదృశ్యమయ్యాడని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. హనుమకొండ 57వ డివిజన్ సమ్మయ్యనగర్‌కు చెందిన పొడకంటి వెంకటేశ్వర్లుకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తెను మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి కొన్నేళ్ల క్రితం వివాహం జరిపించగా ఈ నెల 10న ఆమె గుండెజబ్బుతో మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు చిన్న కొడుకు పొడకంటి రంజిత్‌ను తీసుకుని కుటుంబసభ్యులు మహబూబాబాద్‌కు చేరుకున్నారు. అంత్యక్రియల అనంతరం సాయంత్రం కిరాణషాపుకు వెళ్లి వస్తానని చెప్పిన రంజిత్ రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో వారు బంధువుల ఇండ్లలో వాకబు చేశారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 11న తండ్రి వెంకటేశ్వర్లు మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ దేవేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వర్సిటీ నిబంధనలు పాటించిన కళాశాలలకే గుర్తింపు

కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి

వర్సిటీ అనుబంధ కళాశాల ప్రిన్సిపాళ్లతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్, జూన్ 22: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో యూజీసీ నిబంధనల మేరకు నడుచుకునే కళాశాలలకే వర్సిటీ అనుబంధ గుర్తింపును కొనసాగిస్తామని, నిబంధనలు పాటించని కళాశాలల గుర్తింపు రద్దు చేస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి స్పష్టంచేశారు. వర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్ల సమావేశం శనివారం కేయూ సెనెట్ హాల్‌లో జరిగింది. కేయూ అకడమిక్ ఆడిట్ డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ మల్లారెడ్డి పాల్గొని మాట్లాడారు. వర్సిటీ అనుబంధ కళాశాలలన్నీ బలోపేతం అయినప్పుడే వర్సిటీకి పేరు ప్రఖ్యాతులు వస్తాయని అన్నారు. వర్సిటీ పరిధిలోని కళాశాలలను ఆకస్మికంగా తనిఖీలు చేస్తామని చెప్పారు. కొత్త కోర్సులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను, సేవలను అందించాలని సూచించారు. బోధన, శిక్షణ, పరిశోధనపై దృష్టి సారించాలని కోరారు. వర్సిటీ ఎంపిక చేసిన ప్రభుత్వ కళాశాలలను పరిశోధన కేంద్రాలుగా అనుమతులు ఇచ్చామన్నారు. అటానమస్ పొందిన కళాశాలల పరీక్షల ఫలితాలను ఆడిట్ చేస్తామని వెల్లడించారు. అనేక సమస్యలున్నప్పటికీ పరీక్షల నిర్వహణ పక్బందీగా నిర్వహించి ఫలితాలను సరైన సమయంలో విడుదల చేస్తున్నామని, పేర్కొన్నారు. ప్రభుత్వ అధ్యాపకులు పేపర్ వాల్యూవేషన్‌కు రావాలని కోరారు. వర్సిటీ కింద 297 కళాశాలుండగా, 197 కళాశాల బోధన సిబ్బందిని వర్సిటీ పోర్టల్‌లో నమోదు చేశారని వివరించారు.

డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు మాట్లాడుతూ.. జూన్ 10 నుంచి డిగ్రీ 3, 5వ సెమిస్టర్ క్లాస్‌లు ప్రారంభించినట్లు తెలిపారు. జూలై 1 నుంచి దోస్త్ మేరకు 1వ సెమిస్టర్ క్లాస్‌లు ప్రారంభమవుతాయని వెల్లడించారు. కళాశాలలు వర్సిటీ ఫీజులు చెల్లించాలని, అధ్యాపకుల రాటిఫికేషన్ చేయించుకోవాలని కోరారు. వర్సిటీ ఆదేశాల మేరకు రికార్డులన్ని పకడ్బందీగా నిర్వహించాలని, ల్యాబ్ చేయించాలని చెప్పారు. పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి మాట్లాడుతూ.. పరీక్షల నిబంధనలు పాటించాలని, అంతర్గత పరీక్షల, ప్రయోగ పరీక్షలు కచ్చితంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. మాల్‌ప్రాక్టీస్ కేసుల వివరాలను ఎప్పటికప్పుడు ప్రిన్సిపాళ్లు పరీక్షల విభాగానికి తెలియజేయాలని చెప్పారు. ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు పరీక్షల ప్రమోషన్, మాల్‌ప్రాక్టీస్, చాలెంజ్ వాల్యూవేషన్, వాల్యూవేషన్‌తో పాటు బకెట్ సిస్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే పరీక్షల విభాగానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడూ విద్యార్థులకు తెలియజేయాలని చెప్పారు. కేయూ ఎన్ఎస్ఎస్ సమన్వయ అధికారి ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ యూనిట్లను మైభారత్ పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు. వర్సిటీ పరిధిలో 356 యూనిట్లు సక్రమంగా బ్యాంకు అకౌంట్లను నిర్వహిస్తున్నాయని, మిగతా 77 సక్రమంగా పనిచేయాలని చెప్పారు. కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు స్పోర్ట్స్ ఫీజులు చెల్లిస్తున్నప్పటికీ క్రీడల్లో పాల్గొనడం లేదని అన్నారు. 297 కళాశాలల్లో కేవలం 10/15 కళాశాల విద్యార్థులే స్పోర్ట్స్‌లో పాల్గొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అల్మానాక్ మేరకు కళాశాలలు క్రీడలు నిర్వహించాలని, క్రీడా అధ్యాపకులను నియమించాలని అన్నారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్స్ పలు సందేహాలను వర్సిటీ అధికారులకు విన్నవించారు. ప్రధానంగా 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు నిర్వహించాలని, అతిథి అధ్యాపకుల ఉత్తర్వులు సక్రమంగా ఇవ్వాలని, అల్మానాక్‌లో గ్యాప్ లేకుండా చూడాలని కోరారు. పరీక్షల విభాగం సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయాలని కోరారు. పరీక్షల విభాగంలో హెల్ప్‌లైన్ నెంబర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వర్సిటీకి, కాలేజియేట్ కమిషనరేట్ ఉన్నతాధికారులు సమన్వయం చేసుకోవాలని కోరారు. కేయూ అకడమిక్ విభాగం ఏఆర్ డాక్టర్ కోలా శంకర్ మాట్లాడుతూ.. కళాశాల ప్రారంభమైన 15 రోజుల్లో రీఅడ్మిషన్ పొందాలని చెప్పారు. ఈ సమావేశంలో పీఆర్‌వో డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ వందన సమర్పణ చేయగా, ఏఆర్‌లు హబీబుద్దీన్, ఆర్‌వీ, తొర్రూరు, పరకాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు డాక్టర్ బొలగాని రాములు, డాక్టర్ కొప్పుల మల్లేశం, డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కుమ్మరిగూడెం పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న మాదాసు వెంకన్న

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

మడికొండ, జూన్ 22 : గ్రేటర్ వరంగల్ 45వ డివిజన్ కుమ్మరిగూడెంలోని మండల పరిషత్ పాఠశాలలో శనివారం మాదాసు వెంకన్న దాతృత్వం చాటుకుని విద్యార్థులకు పుస్తకాలు, బియ్యం అందజేశారు. కొన్ని రోజులుగా పాఠశాలలో విద్యార్థులు లేక పాఠశాల మూతపడే స్థితికి రావడంతో స్థానిక మాజీ సర్పంచ్, సామాజిక వేత్త నల్లమారి రమేష్ చొరవచూపి బాల వికాస సంస్థ, తల్లిదండ్రుల సహకారంతో పాఠశాలకు పూర్వవైభవం తీసుకువచ్చారు. ప్రస్తుత పరిస్థితిని తెలుసుకున్న దాత మాదాసు వెంకన్న పాఠశాలను సందర్శించి రమేష్‌ను అభినందిస్తూ విద్యార్థులకు తనవంతు సహకారం అందరజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సీహెచ్.రవిందర్, సిబ్బంది, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రుణమాఫీపై కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



కడిపికొండలో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నేతలు



హసన్‌పర్తిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మడికొండ, జూన్ 22 : కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రైతు రుణమాఫీని సీఎం. మంత్రుల కేబినెట్‌లో ఆమోదం పొందిన నేపథ్యంలో మడికొండ చౌరస్తాలో శనివారం కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. టపాసులు పేల్చి జైకాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మెట్టుగుట్ట ఛైర్మన్ పైడిపాల రఘుచందర్, నాయకులు కుర్ల మోహన్, వస్కుల శంకర్, వస్కుల నాగరాజ్, ఎడబోయిన ప్రభాకర్, కర్ర హరీష్‌రెడ్డి, రాజారపు స్వామి, సట్ల సదానందం, జక్కుల సదానందం, గుర్రం జ్యోతిఅమర్‌నాథ్, నీలం రజినీవేణు, వస్కుల బాస్కర్, కడమంచి సాయిలు, మూల మురళి, కళ్ళెపు నర్సయ్య, కొత్త క్రిష్టారెడ్డి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి ఏక కాలంలో రూ. 2లక్షల రైతు రుణమాఫీ చేయడానికి మంత్రి వర్గ సమావేశంలో ఆమోదం తెలపడం పట్ల కడిపికొండలో హర్షం వ్యక్తం చేస్తూ శనివారం దర్గా సొసైటీ పీఏసీఎస్ మాజీ వైస్ ఛైర్మన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్మెట వెంకటరమణా, డివిజన్ అధ్యక్షుడు సట్ల సదానందం, గ్రామ అధ్యక్షుడు కట్కూరి రమేష్, మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖ, నాయకులు రాము, బస్కె ప్రణయ్, నర్మెట వేణు, బస్కె రవి, నర్మెట సుదాకర్, శీలం రమేష్, బత్తిని విజ్జగిరి, పెద్దపెల్లి వీరస్వామి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

హసన్‌పర్తి : రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంనర్సింహారెడ్డి అన్నారు. రైతు రుణ మాఫీ సందర్భంగా శనివారం హసన్‌పర్తిలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతు రుణమాఫీతో 48 లక్షల మంది రైతులకు మేలు జరుగుతుందన్నారు. మేనిఫె స్టోలో ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి నెరవేర్చుతున్నట్లు తెలిపారు. ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలుచేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగెళ్ళపెల్లి తిరుపతి, 66వ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, మాజీ సర్పంచ్ జోరుక పూల, తోకల లక్ష్మారెడ్డి, పెసరు శ్రీనివాస్‌రెడ్డి, చిర్ర తిరుపతి, చరణ్, మదన్‌గౌడ్, తాళ్ళపెల్లి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ చిత్రపటానికి పోటాపోటీగా క్షీరాభిషేకం

ఐనవోలు : ఐనవోలు మండలకేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు రెండు గ్రూపులుగా విడిపోయి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేయడం ఆ పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. రైతులకు ఒకే సారి రూ.2లక్షల రుణమాఫీ చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని హర్షిస్తూ శనివారం క్షీరాభిషేకానికి హాజరుకావాలని పార్టీ శ్రేణులు పిలుపునిచ్చారు. అంబేద్కర్ సెంటర్‌లో ఎంపీపీ మార్నేని మధుమతి ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కొద్ది నిమిషాల తర్వాత తెలంగాణ తల్లి సెంటర్‌లో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండలానికి చెందిన కొంత నాయకులతోపాటు మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్న ఈకార్యక్రమాల్లో కొందరు రెండు చోట్ల క్షీరాభిషేకంలో పాల్గొనడం విశేషం.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు



తనిఖీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

వరంగల్ మెడికల్, జూన్ 22 : లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.డి.యాకూబ్‌పాష హెచ్చరించారు. శనివారం హనుమకొండలోని రెండు ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కానింగ్ నిర్వహించిన వారి వివరాలు, పూర్తి వివరాలు కచ్చితంగానమోదు చేయాలన్నారు. అలాగే ప్రసవం, అబార్షన్ చేసిన వారి వివరాలు, ఫామ్ ఎఫ్ రికార్డులు సక్రమంగా ఉండాలని, డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డెమో వి.అశోక్‌రెడ్డి, సీహెచ్‌ఓ మాధవరెడ్డి పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకొని జూడాల నిరసన



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ డాక్టర్లు

వరంగల్ మెడికల్, జూన్ 22: సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మె మూడోరోజుకు చేరుకుంది. శనివారం కళ్లకు నల్ల గంతలు కట్టుకొని విధులకు హాజరయ్యారు. కేఎంసీ రోడ్లు సరిగ్గా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు తెలిపినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో స్టైఫండ్ విడుదల కోసం గ్రీన్ చానెల్ ఏర్పాటు చేసిన కేఎంసీలోని రోడ్ల నిర్మాణం, డాక్టర్ల కోసం కొత్త హాస్టల్ భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడంతో సమ్మెకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. తమ డిమాండ్లు పరిష్కరించకుంటే అత్యవసర సేవలు మినహా అన్ని ఆపేసి ఈ నెల 24 నుంచి సమ్మెను నిరవధికంగా కొనసాగిస్తామని కేఎంసీ జూడాలు ప్రకటించారు.

జీవన ఉపాధి కోసం స్థలం కేటాయించండి

▸▸ కలెక్టర్‌కు విశ్వకర్మ పరిషత్ సభ్యుల వినతి



కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేస్తున్న విశ్వకర్మ పరిషత్ సభ్యులు

హనుమకొండ చౌరస్తా, జూన్ 22: చేతి వృత్తులపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న విశ్వకర్మియా కమ్మరం (వెల్డింగ్‌వర్క్), వడ్రంగ వృత్తిదారులకు ఉపాధి పొందేందుకు 20ఎకరాల భూమిని కేటాయించి ఆదుకోవాలని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ జిల్లా అధ్యక్షుడు క్రిష్టాజి రవీంద్రచారి కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రావీణ్యను జిల్లా అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ జిల్లా అధ్యక్షుడు క్రిష్టాజి రవీంద్రచారి ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్మరం, వడ్రంగి వృత్తిదారులు పని చేసుకొని జీవనోపాధి పొందేందుకు మడికొండలోని రాంపూర్ ఇండస్ట్రీయల్ పార్క్‌లోని పారిశ్రామిక వాడలో 20ఎకరాల స్థలాన్ని కేటాయించి ఆదుకోవాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలిసోజు బుచ్చిరాములు, ఉపాధ్యక్షుడు కేసోజు వెంకట్, కార్పెంటర్ అసోసియేషన్ అధ్యక్షుడు రేపోజు చిరంజీవాచారి, కోశాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యం మిథ్య!

(5వ పేజీ తరువాయి)

పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతున్నాయి. వివిధ రోగాల బారిన పడిన సందర్భంలో గ్రామీణప్రాంత ప్రజలు ఆర్ఎంపీలను, పీఎంపీలను ఆశ్రయిస్తున్నారు.

మందుల కొరత

ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, పల్లె దవాఖానాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రుల్లో మందుల కొరత తీవ్రంగా ఉంది. రోగులకు పెట్టడానికి గ్లూకోజు బాటిళ్లు కూడా చాలినన్ని ఉండడం లేదు. జిల్లా కేం ద్రాల్లోని ఆస్పత్రులకు ప్రతీ రోజు 500మంది వరకు ఏరియా ఆస్పత్రులకు 300 వరకు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లకు 150 వరకు, పీహెచ్‌సీలకు 100 వరకు, ఆరోగ్య ఉప కేంద్రాలకు 50 మంది వరకు రోగులు వస్తుంటారు. యాంటీబయాటిక్, యాంటీ రేబిస్, ఏఆర్‌వీ, ఇన్సులిన్ వంటివి కూడా అందుబాటులో ఉండడం లేదు. మూణ్నెళ్లకోసారి వచ్చే మందుల కోటా కూడా సరిగా లేవడం లేదు. ప్రస్తు తం వర్షాకాలం. అంటువ్యాధులు ప్రబలే కాలం. కనీసం ఈ సమయంలోనైనా అవ సరమైన మందులను అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటు ఉంచాల్సి ఉండగా.. ఆ పరిస్థితి కనిపించడం లేదు. చాలా ఆస్పత్రుల్లో సరైన మందులు లేక రోగులు బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

మడికొండ, జూన్ 22: కడుపునొప్పి భరించలేక గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడగా, చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడు. ఎస్సై రాజబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మడికొండకు చెందిన గుమ్మడిరాజుల చంద్రయ్య(55) లాండ్రీషాప్ నడుపుతుండేవాడు. కొంతకాలంగా ఇతడు కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. శుక్రవారం నొప్పి తీవ్రత తట్టుకోలేక గడ్డి మందు తాగాడు. గమనించిన తన కుమారుడు రాజు ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య గుమ్మడిరాజుల కొమురమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

సర్వీసు నుంచి ఏడీఈ తొలగింపు

హనుమకొండ టౌన్, జూన్22: టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఆదిలాబాద్ రూరల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ) రేగుంట స్వామిని సర్వీసు నుంచి తొలిగిస్తూ సీఎండీ వరుణ్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వ్యవసాయ భూములకు విద్యుత్ సరఫరా కోసం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం సిరిచెల్మకు చెందిన రైతుల నుంచి రూ.15,000 తీసుకుంటూ 2010 నవంబర్‌లో కరీంనగర్ ఏసీబీ అధికారులకు ఏడీఈ పట్టుబడ్డాడు. కాగా, 2024 ఏప్రిల్ 10న ఏడేళ్ల జైలు శిక్ష, రూ.30వేల జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. న్యాయస్థానం తీర్పు మేరకు ఏప్రిల్ 10 నుంచి ఏడీఈ స్వామిని సర్వీస్ నుంచి తొలగిస్తూ శనివారం సీఎండీ ఉత్తర్వులు జారీచేశారు.

టీపీసీసీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా రజినీకాంత్



వడ్డెపల్లి, జూన్ 22 : గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌కు చెందిన న్యాయవాది కందుకూరి రజినీకాంత్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు టీపీసీసీ లీగల్‌సెల్ ఛైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కిట్స్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో మాట్లాడుతున్న వసంత టూల్స్ ఎం.డి. దయానందరెడ్డి

హసన్‌పర్తి, జూన్ 22: ఎర్రగట్టుగుట్ట వద్ద గల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 1999 బ్యాచ్ ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. కాలేజీ రోజులను గుర్తు చేసుకున్నారు. అనంతరం సిల్వర్ జూబ్లీ హాల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన వసంత టూల్స్ అండ్ క్రాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ఎం.డి. అనుగు దయానందరెడ్డి మాట్లాడుతూ.. కిట్స్ కళాశాలలో చదివి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగిన తాము సమాజానికి ఉపయోగపడే నాణ్యమైన వస్తువులను ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. యువ ఇంజనీర్లు నాణ్యత, నైపుణ్యంపై దృష్టిపెట్టాలన్నారు. అనంతరం కిట్స్ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ అధ్యక్షుడు నాగులవంచ శ్రీధర్ మాట్లాడుతూ.. కళాశాలలోని ప్రస్తుత బ్యాచ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌ల కోసం సెమినార్లు, వర్క్‌షాపులు, పారిశ్రామిక సందర్శనలు నిర్వహించి, లేబొరేటరీలల్లో అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయడం జరిగిందన్నారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ కోసం శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.అశోక్‌రెడ్డి, కోశాధికారి నారాయణరెడ్డి, పూర్వ విద్యార్థులు సునీల్, భీమ్‌లాల్, భూపతి, ప్రద్యుమ్న, కళ్యాణ్, ఇందిర, మారుతి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమమే లక్ష్యం

వడ్డెపల్లి, జూన్ 22: గిరిజనుల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్య మని, వారి ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేస్తున్నట్లు జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్‌నాయక్ అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్‌నాయక్ శనివారం హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన భవన్‌ను సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోరిక వీరన్ననాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బానోతు వెంకన్ననాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ భూక్య జంపానాయక్, గుగులోత్ వీరమ్మ నాయక్ తదితరులు ఆయ నను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అశోక కాలనీలో నూతనంగా నిర్మించిన గిరిజన భవన్‌లో ఫర్నిచర్, ఏసీ, వంట పాత్రలు, మరుగుదొడ్లు, సౌండ్ సిస్టం, స్నానాల గదులు, ట్రాన్స్‌ఫార్మర్ తదితర సౌకర్యాలులేక వేడుకలను నిర్వహించిన సందర్భాల్లో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటు న్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి గిరిజన భవన్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మధన్, గోపీసింగ్, నందనాయక్, వాంకుడోతు వీరన్న నాయక్ పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

▸▸ తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం విజ్ఞప్తి



జిల్లా పరిశ్రమల అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

కాళోజీ జంక్షన్, జూన్ 22: పీఎం విశ్వకర్మ కౌశల్ యోజన పథకం కింద ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి యోజన పథకం శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా పరిశ్రమల అధికారి విజ్ఞప్తి చేసింది. శనివారం ఆయన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి ఆధ్వర్యంలో సంఘం నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. పట్టణ ప్రాంతంలో ఆన్‌లైన్ ప్రారంభం కాకపోవడం వల్ల చేతి వృత్తులు చేస్తున్న కళాకారులు, ఆర్టిజన్లు ఇతర ప్రాంతాల నుంచి నమోదు చేసుకుంటున్నారని వివరించారు. నిజామాబాద్, సిద్దిపేట, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల్లో ఇప్పటికే పీఎం విశ్వకర్మ, కౌశల్ యోజన పథకం శిక్షణ కేంద్రాలు ఏర్పాటయ్యాయని తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు కాలేదని ఇప్పటికైనా జిల్లా అధికారులు చొరవ తీసుకొని ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. దశాబ్ద కాలంగా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలకు చెందిన చేతి వృత్తులు చేస్తున్న కళాకారులు ఎలాంటి లబ్ధిచేకూరలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఇంకా రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ఉపాధ్యక్షుడు వీణవంక సదానందం, పెండోట సురేష్ కుమార్, హనుమకొండ జిల్లా సంఘం అధ్యక్షుడు అలుగోజు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రామోజు నాగసోమేశ్వర చారి, రాష్ట్ర కమిటీ సభ్యులు కత్రోజు లింగాచారి, నాయకులు ఉన్నారు. ఈసందర్భంగా జిల్లా పరిశ్రమల శాఖ అధికారి హరిప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్‌తో మా ట్లాడి త్వరలో నే కౌశల్ యోజన పథకం శిక్షణకేంద్రాన్ని ఉమ్మడి జిల్లా కేంద్రంగా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

బాధితులకు పరామర్శ

ఐనవోలు, జూన్ 22 : ఐనవోలుకు చెందిన బొల్లేపల్లి నర్సమ్మ ఇటీ వల అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ జడ్పీ వైస్ ఛైర్మన్ గజ్జెలి శ్రీరాములుతో కలిసి మృతురాలి కుమారులైన రమేష్, పరమేష్‌తోపాటు కుటుంబసభ్యులను పరామర్శించి సం తాపం తెలిపారు. ఆయన వెంట నాయకులు జయపాల్, రాజేందర్, వెంకన్న, డబ్బ శ్రీనివాస్, మహేష్ ఉన్నారు.



నర్సమ్మ చిత్రపటం వద్ద సంతాపం వ్యక్తం చేస్తున్న రమేష్

స్పోర్ట్స్ హాస్టళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 22: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(సాట్) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఉన్న మూడు స్పోర్ట్స్‌హాస్టళ్లలో నిరుపేద విద్యార్థులకు వసతి కల్పించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆర్థిక స్థోమత లేక, క్రీడల్లో ఉత్సాహం, ఆసక్తి ఉన్న పేద విద్యార్థులకు 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ఉచిత చదువులతో పాటు వివిధ క్రీడాంశాలలో తర్ఫీదు అందిస్తూ రాష్ట్రానికి, దేశానికి గుర్తింపు తీసుకవచ్చే మెరికలాంటి క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు స్పోర్ట్స్ స్కూల్‌లు వేదికలుగా నిలుస్తున్నాయి. 1 సెప్టెంబరు 2015 నుంచి 31 ఆగస్టు 2016 మధ్య జన్మించిన వారు 2024-25 విద్యా సంవత్సరానికి 3వ తరగతి పూర్తిచేసి 4వతరగతిలో స్పోర్ట్స్ స్కూల్‌లో చేరేందుకు వరంగల్, హనుమకొండ జిల్లా కేంద్రాల లో శారీరక సామర్థ్యం పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఆదారంగా ఎంపిక చేయనున్నారు. రాష్ట్రంలోని మూడు స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలు పొం దేందుకు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన 20 మంది బాలుర, 20 మంది బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఉమ్మడి రాష్ట్రంలోని ఒక్కో జిల్లా నుంచి 20మంది బాలురు, 20మంది బాలికల ను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రాష్ట్రంలోని మూడు స్పోర్ట్స్ స్కూల్‌లకు గాను ఒక్కో స్కూల్‌కు 40 మంది బాలురు, 40మంది బాలికలకు ప్రవేశాలను అందించనున్నారు. ఆసక్తి అర్హత కలిగిన విద్యార్థులు 4పాస్ పోర్టు సైజ్ ఫోటోలు, కుల ధ్రువీకరణ, జనన ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, 3వతరగతి ప్రోగ్రెస్ రిపోర్టు, ఆధార్ కార్డులను వెంట తీసుకొని ఈ నెల 27న ఉదయం 8 గంటల లోపు రిపోర్టు చేయాలని వరంగల్, హనుమకొండ జిల్లాల డీవైఎస్‌వోలు టీవీఎల్.సత్యవాణి, గుగులోత్ అశోక్ కుమార్‌లు తెలిపారు.

జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు ఇలా..

వైద్య పరీక్షల్లో నెగ్గిన విద్యార్థులకు పలు శారీరక సామర్థ్య అంశాల్లో ఎంపిక పోటీలు ఉంటాయి. జిల్లా యువజన క్రీడల అధికారుల పర్యవేక్షణలో జిల్లా కేంద్రాలలోని వివిధ క్రీడా మైదానాలలో ఎత్తు, బరువు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, 800మీటర్ల పరుగు, 6ఇంటూ10 షటిల్ రన్, ఫ్లెక్సిబిలిటీ పరీక్ష, మెడిసిన్ బాల్‌త్రోలో బాలబాలికల వేర్వేరుగా ఎంపి పోటీలు నిర్వహిస్తారు. ఒక్కో పరీక్షకు అత్యధికంగా 3 పాయింట్లు ఉండగా, ఇందులో 10 పాయింట్లు సాధించిన 20 మంది బాలురు, 20 మంది బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుంది.

28, 29 తేదీల్లో ఎంపికలు

గుగులోత్ అశోక్‌కుమార్, డీవైఎస్‌వో హనుమకొండ



హనుమకొండ జిల్లాపరిధిలోని 14 మండలాల నుంచి ఈనెల 28, 29 తేదీలలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలకు రంగం సిద్ధం చేస్తున్నాం. ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు అన్ని సదుపాయాలను కల్పించేందుకు డీఎస్ఏ కోచ్‌లు అందుబాటులో ఉన్నారు. 3వ తరగతి పూర్తి చేసి 4వ తరగతిలో స్పోర్ట్స్ స్కూల్‌లో చేరేందుకు వేదికగా జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహిస్తాం. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తాం. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు 4వ తరగతిలో స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక కావడం ద్వారా సరైన వసతులతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా తీర్చిదిద్దే శిక్షకులు అందుబాటులో ఉంటారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

బాలసముద్రం, జూన్ 22 : అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన హనుమకొండలోని నాగేంద్రనగర్‌లో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండలోని నాగేంద్రనగర్ కాలనీకి చెందిన మక్కల మంజుల (36) అనే వివాహిత వరంగల్ జిల్లా కోర్టులో స్వీపర్‌గా పనిచేస్తోంది. మంజుల భర్త అశోక్‌తో గొడవ పడి రెండేళ్ల నుంచి పిల్లలతో వేరుగా నివాసం ఉంటోంది. జిల్లా కోర్టులో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన స్వీపర్‌గా పనిచేస్తోంది. మంజులకు గతంలో పరిచయం ఉన్న ఇద్దరు వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి కరెంటు ఆఫ్ చేశారు. ఆపై మంజులపై దాడిచేసి గొంతునులిమి హత్య చేసినట్లు కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈవిషయంపై సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైల్వే పెన్షనర్లకు ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యబృందం

కాజీపేట, జూన్ 22 : కాజీపేట రైల్వే పెన్షనర్ల కార్యాల యంలో శనివారం హనుమకొండ శరత్ మ్యాక్స్‌విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో రైల్వే పెన్షనర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 120మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 50 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ తరఫున రాయితీలపై ప్రత్యేక ఆపరేషన్లు చేస్తామని వైద్యులు చెప్పారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కందుల సంగమయ్య కార్యదర్శి కెవి.రావు, కోశాధికారి కె.ఐలయ్య, ఆసుపత్రి సిబ్బంది కె.అనిల్, ఎస్.అశోక్, రఘుతోపాటు రైల్వే పెన్షనర్లు పాల్గొన్నారు.

గుట్కా పట్టుకున్న పోలీసులు

వరంగల్ క్రైం, జూన్ 22: ప్రభుత్వం నిషేధించిన రూ.40వేల విలువ కలిగిన గుట్కాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిన్నవారి స్ట్రీట్‌లో గుట్కా నిల్వలు చేసినట్టు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. గుట్కా నిల్వ చేసిన ఆరిఫ్ అనే వ్యక్తిని మట్టెవాడ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ సార్ల రాజు, సుంకరి రవికుమార్ ధృవీకరించారు.

పీడీఎస్ రైస్ పట్టివేత

పర్వతగిరి మండలంలోని ఉబ్బితండాలో 120 క్వింటాళ్ల రూ.3లక్షల 12వేల విలువకలిగిన పీడీఎస్ రైస్‌న టాస్క్‌ఫోర్స్ పోలీసలు పట్టుకున్నారు. రమేశ్, కిషన్ అనే ఇద్దరు వ్యక్తులు మండలంలోని పలు గ్రామాల్లో పీడీఎస్ రైస్ సేకరించి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేశారు. విక్రయిస్తున్న ఇద్దరిలో రమేశ్ అరెస్టు కాగా, కిషన్ పరారీలో ఉన్నారు. రైస్ పట్టుకున్న విషయాన్ని సీఐ దయాకర్ ధృవీకరించారు.

మామునూర్‌లో పీడీఎస్ రైస్ పట్టివేత

మామునూరులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు 40 కింటాళ్ల రూ.1లక్ష 4వేల విలువకలిగిన పీడీఎస్ రైస్‌ను పట్టుకున్నారు. చిన్న, సమ్మయ్య అనే ఇద్దరు వ్యక్తులు మామునూరు పరిసర ప్రాంతాల్లో రైస్ సేకరిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం మామునూరు పోలీసులకు అప్పగించారు.

రైల్వే డాక్టర్‌కు సన్మానం

కాజీపేట, జూన్ 22: కాజీపేటకు బదిలీపై వచ్చిన డాక్టర్ వినయ్ బాబును శనివారం రైల్వే సంఘ్ నాయకులు ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, బొకే ఇచ్చి అభినందించారు. రైల్వే కార్మికులకు వైద్య సేవలందించడంలో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అందుకు సంఘ్ కార్యవర్గం పూర్తిసహకారం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ్ సోషల్ మీడియా డివిజన్ కో-ఆర్డినేటర్, రన్నింగ్ బ్రాంచ్ ఛైర్మన్ పాక రాజ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 22 : నీట్ ప్రవేశ పరీక్షను రద్దు చేసి మరోసారి పరీక్ష నిర్వహించాలని టీఎస్ఎఫ్ సిటీ అధ్యక్షుడు నాగారం మణితేజ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మణితేజ మాట్లాడుతూ.. నీట్ ప్రశ్నా పత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ నిర్వహణలో ఎన్‌టీఏ విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బి.సంతోష్, వి.సాంబరాజ్, కె.సంతోష్, నితిన్, శివ, సాయికృష్ణ, భరత్ పాల్గొన్నారు.

నీట్ పేపర్ లీకేజీ ఘటనకు బాధ్యత వహించాలి

న్యూశాయంపేట : దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనకు కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహరావు డిమాండ్ చేశారు. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట శనివారం నీట్ పేపర్ లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని విద్యార్థులు, పీడీఎస్‌యూ నాయకులు ప్లకార్డులు చేతపట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు దీపక్, మహేంద్ర, గోపిచంద్, అనిత, శృతి, ప్రణవి, కీర్తిక, అనిత, స్పందన తదితరులు పాల్గొన్నారు.


దోషులను శిక్షించాలి

ఐనవోలు : నీట్ పరీక్ష లీకేజీ దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. పేపర్ లీకేజీకి ప్రధాని బాధ్యత వహించి దేశ ప్రజలకు క్షమాపణ చేప్పాలని తెలిపారు. నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించాలన్నారు. నీట్ పరీక్షను రద్దుచేసి మళ్లీ నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎన్‌టీఏను రద్దు చేయాలి

బాలసముద్రం : ఎన్‌టీఏను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలో శనివారం ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులతో కలిసి ఎన్‌టీఏను రద్దు చేయాలని ర్యాలీ చేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. యూజీసీ నెట్ ఎగ్జామ్ క్యాన్సిల్ చేయాలని, నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలన్నారు. యూజీసీ సీఎస్ఐటీఆర్ పరీక్ష వాయిదా వేయడంలోనే ఎన్‌టీఏ అసమర్థత కనిపిస్తుం దన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్, అర్జున్, రామ్, నందిని, కళ్యాణ్, రమ్య, అనూష తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ బలరామ్ మృతి



హసన్‌పర్తి, జూన్ 22 : ప్రముఖ ఆర్ఎంపీ, ఆర్యసమాజం నిర్మాణంలో ఒకరైన నేదునూరి బలరాం శనివారం మృతి చెందాడు. ఈయన ఆర్యసమాజ్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ, ఆర్ఎంపీగా ప్రజలకు సేవలందించారు. ఈయన మృతదేహాన్ని 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేశ్‌కుమార్, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి నేదునూరి రాజమౌళి, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం జిల్లా నాయకుడు పిట్టల కుమారస్వామి, కుమ్మరి సంఘం నాయకులు నేదునూరి సాంబయ్య, ఆర్ఎంపీలు మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు.

నవ్య కుటుంబ కదంబం ఆదివారం



ప్రతి అంతం మరొక ఆరంభానికి నాంది అవుతుంది. ఆ ఆరంభానికి అడ్డుపడే శక్తులు ఎప్పుడూ ఉంటాయి. వాటిని జయించినప్పుడే నవ్య యుగం ప్రారంభమవుతుంది. 'కల్కి' సినిమా కథాంశమిదే.



మూడు లోకాలు.. మూడు కాలాలు..

అదీ 'కల్కి'

"**గంగ** మానవజాతికి జీవాధారం. కలియుగం అంతంలో గంగ ఎండిపోతుంది.. అప్పుడు ఈ భూమిపై ఉన్న అతి పురాతన నగరం- కాశీ ఎలా ఉంటుంది? మన సంస్కృతి కాశీ నుంచే ప్రారంభమయిందనేది ఒక భావన. అలాంటి కాశీ మరో వెయ్యి ఏళ్ల తర్వాత ఎలా ఉంటుంది? ఆ సమయంలో ఆర్థిక కార్యకలాపాలు ఎలా జరుగుతాయి? ఆ సమయంలో వాహనాలు ఎలా ఉంటాయి? ప్రజల జీవన విధానం ఎలా ఉంటుంది? వీటిని దృష్టిలో పెట్టుకొని కాశీని ఈ సినిమాలో నిర్మించారు. ఆ కాశీపై ఒక పిరమిడ్‌లా ఉండే భవిష్యత్ నగరం- కాంప్లెక్స్ మన భూమిపై ఏమి ఉండవో.. అవన్నీ ఈ కాంప్లెక్స్‌లో లభిస్తాయి. కాశీలో గంగ ఎండిపోయి కనిపిస్తుంది. కానీ కాంప్లెక్స్‌లో ఆహ్లాదకరమైన సముద్రం ఉంటుంది. ఒక విధంగా చూస్తే- ఇది ఒక స్వర్గం. ఈ భూమిపై ఉండే త్రిశంకు స్వర్గం. ఈ రెండూ కాకుండా - మరో ప్రపంచం కూడా 'కల్కి'లో కనిపిస్తుంది. దీని పేరు శాంబాలా. దీనిలో నివసించే వారు మనకు భిన్నమైన వారు. వీరికి దేవుడు ఉండడు. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే- దేవుణ్ణి ఆ లోకం నుంచి బహిష్కరిస్తారు. కాంప్లెక్స్‌లో నివసించేవారికి, శాంబాలాలో వారికి మధ్య నిరంతరం పోరాటం జరుగుతూ ఉంటుంది. కల్కి శాంబాలాలో జన్మిస్తాడని అందరూ నమ్ముతూ ఉంటారు.

అశ్వత్థామ: మహాభారతంలోని ప్రధానమైన పాత్రల్లో అశ్వత్థామ ఒకరు. 'కల్కి' సినిమాలో ఈ పాత్ర ను అమితాబ్ పోషించారు. భారతంలో అశ్వత్థామ చిరంజీవి... మహావీరుడు. అతడికి మరణం ఉండదు. దుర్యోధనుడికి మిత్రుడు. కౌరవుల తరఫున పోరాడాడు. ఇప్పటి దాకా విడుదలయిన రెండు ట్రైలర్స్ ఆధారంగా చూస్తే- 'కల్కి'ని పెంచటంలోను, అతణ్ణి ఒక ప్రతిభావంతుడైన యోధుడిగా తీర్చిదిద్దటంలోను అమితాబ్‌దే ప్రధాన పాత్ర అనిపిస్తుంది. అయితే అందరూ అభిమానించే పురాణపాత్రలు ఈ చిత్రంలో కనిపించవు" అంటారు నాగ్ అశ్విన్. 'అపరిమితయిన శక్తితో పుట్టిన ఒక వ్యక్తికి తన అధికారాన్ని ఏం చేసుకోవాలో తెలియదు. ఆ సమయంలో అతనికి ఒక గురువు దొరుకుతాడు..ఈ చిత్రంలో ఇదొక ముఖ్యమైన అంశం.." అంటారాయన.

కలి: ఒక నాయకుడి శక్తి అతను పోరాడే ప్రతినాయకుడి శక్తి కన్నా ఎక్కువగా ఉండాలి. అప్పుడే అతను నాయకుడు అవుతాడు. ఈ సినిమాలో కమల్‌హాసన్ ప్రతినాయక పాత్ర కూడా ఇలాంటిదే! శంబాలాలోని అతి శక్తిమంతుడైన వ్యక్తి అయిన 'కలి'గా కమల్ ఇప్పటికే ప్రేక్షకుల ప్రశంసలు పొందుతున్నారు. నాగ్ అశ్విన్ తొలిసారి కలిసి కథ చెప్పిన తర్వాత.. కమల్ ఈ పాత్ర ఎలా ఉంటే బావుంటుందనే విషయంపై చాలా అధ్యయనం చేశారట. "ఆ పాత్రకు ఎలాంటి దుస్తులు వేసుకోవాలి? ఎలాంటి మేకప్ ఉంటే బావుంటుంది? అనే విషయంపై నాగీకి కొన్ని రిఫరెన్స్‌లు పంపాను. కానీ వాటిని అప్పటికే అమితాబ్‌కు ఉపయోగిస్తున్నారని ఆ తర్వాత తెలిసింది" అంటారు కమల్. ఈ సినిమాలో మరో ముఖ్య పాత్ర దీపికది. ఈ ప్రపంచాన్ని కాపాడే వీరుడికి జన్మనిచ్చే పాత్ర ఆమెది. ఇక ఈ చిత్రంలో ప్రధానమైన పాత్ర ప్రభాస్‌ది! ఎప్పుడైతే ఈ ప్రపంచం క్రమం తప్పుతుందో., అలాంటి సమయంలో ప్రపంచాన్ని కాపాడటానికి వస్తానని విష్ణువు చెప్పిన మాటల ఆధారంగా పుట్టిన అవతారమే కల్కి. దశావతారాల తర్వాత వచ్చే అవతారం. అయితే ఇప్పటి దాకా బయటకు వెలువడిన ట్రైలర్స్, ఇతర పబ్లిసిటీ మెటీరియల్ ఆధారంగా చూస్తే- కల్కి తన అందమైన కలలో గుర్రంపైనే వెళ్తుంటాడు. కానీ అతనికి తోడుగా ఉండేది మాత్రం అత్యాధునికమైన 'బుజ్జి'. ఇంకో రెండు వేల ఏళ్ల తర్వాత ఎలాంటి వాహనాలు ఉండచ్చు? అనే విషయానికి ప్రతీక ఈ బుజ్జి. ఇక హీరో కల్కికి ప్రేమికురాలిగా దిశా పటానీ, మరో ముఖ్యమైన పాత్రలో శోభన కనిపిస్తున్నారు. ఇప్పటిదాకా ఈ చిత్రం గురించి మనకు తెలిసింది అతి తక్కువే! ఇంకా ఈ సినిమాలోని అనేక పాత్రల కోసం మరో నాలుగు రోజులు వేచి చూడాల్సిందే!



వ్యక్తిగతంగాను.. వృత్తిపరంగాను ఈ సినిమా ఒక అద్భుతమైన ప్రయాణమని చెప్పుకోవాలి. ఈ సినిమా ద్వారా నేను ఎంతో నేర్చుకున్నాను. ఈ సినిమాలో ఉన్నది ఇప్పటి దాకా మనమెప్పుడూ చూడని అద్భుత ప్రపంచం. మీలాగే నేను కూడా సినిమా ఎప్పుడు విడుదల అవుతుందా? అని ఎదురుచూస్తున్నా.

- దీపిక పదుకొనే



ఈ సినిమా ఒక కల కన్నా పెద్దది. అంతకన్నా నేను ఎక్కువగా ఏమి చెప్పలేను..

- ప్రభాస్



మన ఊహకు కూడా అందని ఒక అద్భుతమైన సినిమాలో పనిచేసినందుకు చాలా ఆనందంగా ఉంది. భవిష్యత్తులో ఎలా ఉంటుందనే ఊహకు ప్రతిరూపం ఈ చిత్రం. ఇలాంటి ఒక ఊహ వచ్చినందుకు నాగినీ అభినందించాల్సిందే!

- అమితాబ్ బచ్చన్



ఒక విలన్ పాత్రలో నటించాలని చాలా కాలంగా అనుకుంటున్నా.. ఎందుకంటే ఒక సినిమాలో ఉంటే మంచి విషయాలన్నీ విలన్‌కే దక్కుతాయి.. హీరోలు డ్యూయెట్స్ పాడుతూ, హీరోయిన్ల కోసం వేచి చూస్తూ ఉంటారు.. కానీ విలన్ తను ఏమనుకుంటాడో అది చేయగలుగుతాడు

- కమల్ హాసన్



5 గంటల్లోనే

'భైరవ ఏంథమ్' పూర్తైపోయింది

'కల్కి'- ప్రస్తుతం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా. దీని నుంచి తాజాగా విడుదలయిన - "భైరవ ఏంథమ్" దేశవ్యాప్తంగా దుమ్మురేపుతోంది. ప్రముఖ పంజాబీ గాయకుడు దిల్‌వీర్, హీరో ప్రభాస్ నటించిన ఈ గీతానికి పోని ప్రకాష్‌రాజ్ కొరియోగ్రాఫర్‌గా వ్యవహరించారు. పంజాబీ గెటప్‌లో ప్రభాస్ కనిపించిన ఈ గీతపు కొరియోగ్రఫీ విశేషాలను పోనీ - 'నవ్య'తో పంచుకున్నారు.



"**ఈ** పాట చేసినందుకు చాలా సంతృప్తిగా ఉంది. దాదాపు ఎనిమిదేళ్ల నుంచి నేను ఎక్కువగా ప్రాజెక్టులు చేయటం లేదు. అలాంటి నాకు 'కల్కి'లో ఈ పాటకు కొరియోగ్రఫీ చేసే అవకాశం రావటం ఒక అదృష్టమనే చెప్పాలి. ప్రస్తుతం ఈ పాట దేశవ్యాప్తంగా విశేష ఆదరణ లభిస్తోంది. ప్రతి కొరియోగ్రాఫర్ ఇలాంటి పాట కోసం ఎదురుచూస్తూ ఉంటారు. 'కల్కి' కోసం ఒక చిన్న సాయం చేసిపెట్టమని నిర్మాత స్వప్న అడిగింది. సెట్స్‌కు వెళ్లాను. అదంతా వేరే ప్రపంచంలా అనిపించింది. "ఇలాంటి చిన్న పనుల కోసం నన్ను పిలవకు.. పెద్ద పని కోసం పిలువు" అని స్వప్నతో సరదాగా అన్నాను. అంతకుముందు ఆమెతో 'అన్నీ మంచి శకునములే..' కూడా పనిచేశాను. ఒక రోజు స్వప్న హఠాత్తుగా ఫోన్ చేసి "ప్రభాస్‌తో ఒక సాంగ్ ఉంది.. చేస్తావా?" అని అడిగింది. నాకు ఒక క్షణం ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. నేను హైదరాబాద్‌లో స్థిరపడిన పంజాబీని. పంజాబీ నృత్యం స్వాభావికంగా నాలో ఉంటుంది. ఇక ప్రభాస్- మన దేశంలోనే అతి పెద్ద స్టార్. ఈ రెండింటినీ ఒక చోట కలిపే అవకాశం రావటం చాలా అరుదైన విషయం. ముందు నేను నమ్మలేదు. చాలా హడావిడిగా అన్నీ జరిగిపోయాయి.

కళ్ల ముందు ప్రభాస్!

నేను మొదటిసారి ఆ పాట విన్నప్పుడు- ప్రభాస్ నాకు పూర్తి స్థాయి పంజాబీ డ్రెస్‌లో కళ్ల ముందు కనిపించాడు. 'ఇంత అందంగా ఉన్నాడేంటి?' అనుకున్నా. నేను ఈ విషయం అందరికీ చెప్పినప్పుడు అందరు నమ్మలేని నిజాన్ని చూసినట్లు అనిపించారు. దిల్‌జిత్ ఉత్తరాది రాష్ట్రాలకు, పంజాబీ సంస్కృతికి ప్రతీక. ఇక ప్రభాస్ దక్షిణ భారతదేశానికి ప్రతీక. వీరిద్దరూ కలిస్తే- ఆ ఆలోచనే అందరితోను ఉత్సుకత రేకెత్తించింది. నేను ఈ విషయం ప్రభాస్‌కు చెప్పినప్పుడు ముందు అంత ఆసక్తి చూపించలేదు. "నన్ను నమ్మండి. ఒక్క ఛాన్స్ ఇవ్వండి. రిజల్ట్ చూసి మీరే ఆశ్చర్యపోతారు" అని ప్రభాస్‌తో చెప్పా. "ఆర్ యూ ష్యూర్?' అన్నారు. అనుకున్నట్లే- ప్రభాస్ సెట్ మీదకు పూర్తి పంజాబీ దుస్తులతో వచ్చినప్పుడు- సెట్‌లో ఉన్నవారందరూ చప్పట్లు కొట్టి, గట్టిగా అరవటం మొదలుపెట్టారు. వారి రెస్పాన్స్‌ను చూసి నాకే మతిపోయింది. దిల్‌జిత్, ప్రభాస్‌లకు నేను కొరియోగ్రాఫర్‌గా 'వన్, టూ, త్రీ' అంటూ కౌంటింగ్ ఇవ్వాలి. కానీ వారిద్దరిని చూస్తూ నేను కౌంటింగ్ ఇవ్వటం కూడా మరచిపోయాను. సెట్‌లో విపరీతమైన ఎనర్జీ వచ్చేసింది. నేను 'డర్టీ పిక్చర్‌లో... విద్యాబాలన్‌తో 'ఊలాల.. ఊలాల..' పాటకు కొరియోగ్రఫీ చేస్తున్నప్పుడు ఇలాంటి ఉత్సుకత వచ్చింది. ఇంతకాలం తర్వాత మళ్లీ ఈ పాటకు వచ్చింది.

స్టెప్స్ తక్కువే!

దిల్‌జిత్‌కు, ప్రభాస్‌కు ఈ పాటలో కష్టమైన స్టెప్స్ పెట్టలేదు. దిల్‌జిత్ పెర్‌ఫార్మర్. డ్యాన్సర్ కాదు. అదే విధంగా ప్రభాస్‌కు ఉన్న ఇమేజ్ వేరు. తను డ్యాన్స్ చేయాల్సిన అవసరం లేదు. కేవలం నడిస్తే చాలు. వారిద్దరి మధ్య ఒక కెమిస్ట్రీ వచ్చేలా కొన్ని మూమెంట్స్‌ను డిజైన్ చేశాను. వారిద్దరూ మన దేశంలోని రెండు భిన్నమైన సంస్కృతులకు చెందిన పురుషులకు ప్రతీకలు. అంతేకాకుండా ఈ పాట మరో లుంగీ డ్యాన్స్ కావటం నాకు ఇష్టం లేదు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. నా జీవితంలో ఇంతత్వరగా ఏ పాటను కొరియోగ్రఫీ చేయలేదు. మొత్తం పాటను కేవలం ఐదు గంటల్లో పూర్తి చేశాం. స్వప్న, ప్రియాంక, కెమేరామేన్ అల్ఫేష్, ప్రొడక్షన్ టీమ్ చాలా కష్టపడి పనిచేశారు. ఒక రోజు రిహార్సల్స్ చేశాం అంతే! ఈ పాట పూర్తయిపోయి, బయటకు వెళ్లి.. సంచలనాలు క్రియేట్ చేస్తోందంటే నమ్మలేకపోతున్నా.

• సీవీఎల్ఎన్ ప్రసాద్





అలనాటి కథ


ఆ రోజుల్లో...

ఒకప్పుడు మన దేశంలో ముఖ్యమంత్రులకు చాలా గౌరవం ఉండేది. వారి సిఫార్సులను విదేశాలలో కూడా గౌరవంగా చూసేవారు. ఇక ప్రధానులకు సాహితీకారులంటే విపరీతమైన గౌరవం ఉండేది. ఒక దేశ ప్రధాని- ఒక విదేశీభాషకు సంబంధించిన లైబ్రరీ శంకుస్థాపన కార్యక్రమానికి రావటం ఇప్పుడు సాధ్యమవుతుందా? ఒకప్పుడు అది కూడా సాధ్యమే! నేటి పరిస్థితులను.. రాజకీయనాయకులను గమనిస్తుంటే- నాకు మారిషస్‌లో నా తొలి విదేశీ పర్యటన గుర్తుకువచ్చింది.



నాకు 26 ఏళ్లు ఉన్నప్పుడు నా తొలి విదేశీ పర్యటనకు వెళ్లా! అది కూడా తెలుగు రచయిత బృందానికి నాయకురాలిగా. మారిషస్‌లో తెలుగు వారి కోసం ఒక లైబ్రరీ నిర్మించాలనుకున్నారు. ఈ లైబ్రరీ శంకుస్థాపనా కార్యక్రమానికి తెలుగువారికి ప్రాతినిధ్యం వహిస్తూ ఒక బృందాన్ని పంపాలనుకున్నారు. నా పేరు ఎవరు ప్రతిపాదించారో తెలియదు కానీ.. శేషేంద్ర, పోతుకూచి సాంబశివరావు, నేను ఒక బృందంగా మారిషస్‌కు బయలుదేరాం. నాకు అక్కడ ఎవరు ఉంటారో తెలియదు. అక్కడ ఏం మాట్లాడాలో తెలియదు. ఎందుకైనా మంచిదని అప్పటి ముఖ్యమంత్రి బ్రహ్మానంద రెడ్డిని ఒక ఉత్తరం ఇవ్వమని అడిగాను. ఆయన అక్కడి ప్రధానికి నన్ను పరిచయం చేస్తూ ఒక ఉత్తరం ఇచ్చారు. విమాన ప్రయాణం బాగా జరిగింది. మారిషస్ రాజధానికి చేరుకున్నాం. అక్కడ ప్రభుత్వం తరుఫున ఆతిధ్యం ఇచ్చేవారు- నాకు ఒక చోట వసతి ఏర్పాటు చేశారు. శేషేంద్ర, ఇతరులకు వేరే చోట విడిది ఇచ్చారు. అందమైన పూలతోట.. సమీపంలోనే నదీతీరం.. నాకు వసతి ఏర్పాటు చేసిన ప్రాంతం స్వర్గంలా అనిపించింది.

ఉదయాన్నే లేచి బ్రేక్‌ఫాస్ట్ చేసి రిలాక్స్ అవుతున్న సమయంలో- ప్రధాని మంత్రి సీవూసగర్ అపాయింట్‌మెంట్ ఒక గంటలో ఉందనే కబురు వచ్చింది. వెంటనే మేము తయారయి ప్రధాని కార్యాలయానికి వెళ్లాం. అక్కడికి వెళ్లిన వెంటనే- ప్రధాని సెక్రటరీ డాక్టర్ హజారేసింగ్ మమల్ని రిసీవ్ చేసుకున్నారు. పిచ్చాపాటి మాట్లాడిన తర్వాత ప్రధాని కార్యాలయంలోకి మమల్ని తీసుకువెళ్లారు. ప్రధాని మాకు స్వాగతం చెప్పారు. ఆయనకు బ్రహ్మానందరెడ్డి రాసిన ఉత్తరాన్ని, కొన్ని పుస్తకాలను ఇచ్చాను. ఆ తర్వాత మేము లైబ్రరీకి శంకుస్థాపన చేస్తున్నామని చెప్పాం. మా ఆలోచనలు ఆయనతో పంచుకున్నాం. శంకుస్థాపన కార్యక్రమానికి రమ్మని ఆహ్వానించాం. ఒక దేశ ప్రధానిని- శంకుస్థాపన కార్యక్రమానికి రమ్మని అడగటమే ఒక సాహసం. అది కూడా ఎటువంటి ముందస్తు అపాయింట్‌మెంట్ లేకుండా. నాకు ఆయన వస్తాడనే నమ్మకం ఏ కోశాన లేదు. కానీ వెంటనే



ఆయన తన ప్రైవేట్ సెక్రటరీని పిలిచి- ఆ రోజు అపాయింట్‌మెంట్స్ ఏమిటో తెలుసుకున్నారు. అన్నింటినీ క్యాన్సిల్ చేయమని మా కార్యక్రమానికి వస్తానన్నారు. ఇప్పటికీ ఆ సంఘటన గురించి ఆలోచిస్తూ ఉంటే- అది నిజమా? కలా? అనే విషయం అర్థం కాదు. ఒక దేశ ప్రధాని దగ్గరకు ఎటువంటి అపాయింట్‌మెంట్ లేకుండా వెళ్లి- ఆయనను ఒక ప్రైవేట్ ఫంక్షన్‌కు పిలవటం ఇప్పుడు ఏ విధంగాను సాధ్యం కాదు. ఆ సమయంలో సాహిత్యకారుల పట్ల.. కళాకారుల పట్ల నాయకులకు అంత గౌరవం ఉండేది.

ఆ రోజు కార్యక్రమానికి ప్రధానితో పాటుగా ఆ దేశంలోని అనేక మంది కళాకారులు, సాహితీకారులు, భాషాభిమానులు హాజరయ్యారు. అంత మంది ముందు నేను ఒక ఉపన్యాసం ఇవ్వాల్సి వచ్చింది. ఒకప్పుడు మారిషస్‌లో ఎక్కువగా ఫ్రెంచ్ మాట్లాడేవారు. ఇంగ్లీషు తక్కువగా మాట్లాడేవారు. నాకు ఫ్రెంచ్ మాట్లాడటం అస్సలు రాదు. పైగా అంత మంది పెద్దల ముందు నా తొలి ప్రసంగం! నా పరిస్థితి ఎలా ఉండి ఉంటుందో అర్థం చేసుకోండి. మొత్తానికి నా ప్రసంగం బాగానే సాగింది. అందరూ ఆసక్తిగా విన్నారు. ఆ మర్నాడు నన్ను అనేక మంది సాహితీకారులకు పరిచయం చేశారు. ఈ పర్యటనలో నాకు బాగా గుర్తున్న మరొక సంఘటన- ప్రముఖ కవి మార్సెల్ కాబాన్, ఆయన భార్య మేడమ్ డి కెవిరన్‌లను కలవటం. ఒక అందమైన చిన్న కొండ మీద ఉన్న వారి ఇంటికి హజారేసింగ్ నన్ను తీసుకువెళ్లారు. అక్కడ కెవిరన్ మాకు ఆతిధ్యం ఇవ్వటంతో పాటుగా 'అప్సర' అనే ఫ్రెంచ్ దీర్ఘకవితను వినిపించారు. ఇప్పటికీ ఆమె మృదువైన కంఠం, చదివే విధానం అన్నీ జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి.

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/49R9nXb లో చదవండి.

దిక్సూచి DIKSUCHI

తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్‌లో
సివిల్స్ లాంగ్ టర్మ్ కోచింగ్



హైదరాబాద్-సైదాబాద్‌లోని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్- సివిల్స్(ప్రిలిమ్స్, మెయిన్స్) లాంగ్ టర్మ్ కోచింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఫుల్ టైమ్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. రాష్ట్రానికి చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, అనాథ అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులకు 2024 జూలై 18 నుంచి 2025 ఏప్రిల్ 18 వరకు తరగతులు నిర్వహిస్తారు. శిక్షణ పూర్తిగా ఉచితం. భోజనం, వసతి, రవాణా ఖర్చుల కోసం నెలకు రూ.5,000ల స్టయిపెండ్ ఇస్తారు. టీ, స్నాక్స్ కోసం రోజుకి రెండుసార్లు రూ.25లు ఇస్తారు. బుక్ ఫండ్ కింద రూ.5000ల నగదు చెల్లిస్తారు. లైబ్రరీ సౌకర్యం ఉంది.

సీట్ల వివరాలు: ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా 100 మందికి అవకాశం కల్పిస్తారు. 32 ఏళ్లలోపు వయసు ఉండి గతంలో సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్ ఎగ్జామ్ రాసిన మరో 50 మందికి నేరుగా అడ్మిషన్స్ ఇస్తారు. వీరు స్క్రీనింగ్ టెస్ట్ రాయనవసరం లేదు. సంబంధిత ధ్రువపత్రాలతో తమ దరఖాస్తును టీజీ బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సబ్మిట్ చేయాలి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్(సీశాట్) 2025కు నిర్దేశించిన అర్హతలన్నీ ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షలు మించకూడదు. అభ్యర్థులు నిరుద్యోగులై ఉండాలి. ఇతర కోర్సులు చేస్తున్నవారు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తత్సమాన ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లో చేరిన వారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థులు సీశాట్ 2025కి దరఖాస్తు చేయని పక్షంలో వారిని అడ్మిషన్ లిస్ట్ నుంచి తొలగిస్తారు. వీరు శిక్షణ సమయంలో అందుకున్న స్టయిపెండ్, బుక్‌ఫండ్ తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. అభ్యర్థులకు ప్రతి నెలా కనీసం 75 శాతం అటెండెన్స్ ఉంటేనే స్టయిపెండ్ ఇస్తారు. కోచింగ్ ప్రారంభమైన నాటి నుంచి రెండో నెలలో కనీసం 60 శాతం అటెండెన్స్ ఉంటేనే బుక్ ఫండ్ ఇస్తారు.

ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్: ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. మొదటి పేపర్లో జనరల్ స్టడీస్ నుంచి 100 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. రెండో పేపర్లో రీజనింగ్, అర్థమెటిక్, ఇంగ్లీష్ కాంప్రహెన్షన్ అంశాల నుంచి 50 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ ఎగ్జామ్(సీఎస్‌పీ పేపర్ 1, సీశాట్ పేపర్ 2) సిలబస్ ప్రకారమే ఉం టాయి. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 3
- **ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ తేదీ:** జూలై 7
- **టెస్ట్ ఫలితాలు విడుదల:** జూలై 10
- **తరగతులు ప్రారంభం:** జూలై 18 నుంచి
- **చిరునామా:** టీజీ బీసీ స్టడీ సర్కిల్, లక్ష్మీ నగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్-500059
- **వెబ్‌సైట్:** www.tgbcstudycircle.cgg.gov.in, https://studycircle.cgg.gov.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/9yCVnN3లో చదవండి.

విశాఖ ఐఐపీఈలో
బీటెక్

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ)- బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024 స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రోగ్రామ్‌తోపాటు డిప్లొమా ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తిచేసి క్యాట్ స్కోర్ లేకుండానే ఐఐఎం విశాఖపట్నంలో ఎంబీఏ చదివే వీలుంది.

విభాగాలు-సీట్లు: పెట్రోలియం ఇంజనీరింగ్‌లో 62 సీట్లు, కెమికల్ ఇంజనీరింగ్‌లో 63 సీట్లు, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 40 సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 65 శాతం మార్కులు చాలు. అభ్యర్థులందరికీ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 5
- **అకడమిక్ సెషన్ ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- **వెబ్‌సైట్:** iipe.ac.in

ఓయూలో లేటరల్ ఎంట్రీ

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన 'యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్'- బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో లేటరల్ ఎంట్రీకి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. 'కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీప్)' కింద నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రామ్‌లను డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఈ/బీటెక్ రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 30 సీట్లు చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. సాయంత్రం సమయాల్లో ఆరు నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు రూ.50,000.

అర్హత: తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ లేదా గుర్తింపు పొందిన బోర్డు నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. ఏఐ&ఎంఎల్ స్పెషలైజేషన్‌కు ఏ విభాగంవారైనా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఈ/ఏఐ/ఏఐడీ/ఏఐఎం /సీఎంఈ/సీఎస్‌బీ/సీఎస్‌సీ/సీఎస్‌డీ/సీఎస్‌జీ/సీఎస్‌ఐ/సీఎస్ఎం/సీఎస్ఎన్/సీఎస్ఓ/సీఎస్‌టీ/సీఎస్‌డబ్ల్యూ/సీఐసీ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు. జనరల్ అభ్యర్థులకు కనీసం 45 శాతం, రిజర్వ్‌డ్ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థులందరికీ కనీసం ఏడాది ఫుల్ టైమ్ ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 11
- **ఎంట్రెన్స్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 18
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 21
- **మొదటి ఫేజ్ కౌన్సెలింగ్:** జూలై 27
- **రెండో ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 3
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

విజువల్‌గా.. మ్యూజికల్‌గా...



నాగచైతన్య, సాయి పల్లవి జంటగా రూపుదిద్దుకుంటున్న 'తండేల్' చిత్రం వైజాగ్, శ్రీకాకుళం షెడ్యూల్ శనివారంతో పూర్తయింది. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. ఈ షెడ్యూల్‌లో హీరోహీరోయిన్లతో పాటు ఇతర నటీనటులు పాల్గొనగా కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. పాత్రల గెటప్, కాస్ట్యూమ్స్, బాడీ లాంగ్వేజ్, యాస ప్రామాణికంగా ఉండేలా దర్శకుడు చందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాస్తవ సంఘటనల ప్రేరణతో ఓ ప్రేమ కథగా 'తండేల్' ను భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. విజువల్‌గా, మ్యూజికల్‌గా ఎంతో అద్భుతంగా ఉండేలా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: దేవి శ్రీప్రసాద్, సినిమాటోగ్రఫీ: షామ్‌దత్, ఎడిటింగ్: నవీన్ నూలి.

రామానుజుల గొప్పతనం చెప్పే కథ



డా. సాయి వెంకట్ టైటిల్ రోల్‌లో నటించి.. దర్శకత్వం వహించిన సినిమా 'జయహో రామానుజ'. జో శర్మ, సుమన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాయిప్రసన్న, ప్రవల్లిక నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా వస్తున్న ఈ సినిమా ఫస్ట్ పార్ట్ జూలై 12న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'జయహో రామానుజ' సినిమా పాటలను చిత్ర బృందం శనివారం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు, హీరో సాయి వెంకట్ మాట్లాడుతూ 'మహిళల్ని గౌరవించాలని.. కుల మతాలకు అతీతంగా ఐకమత్యంతో మానవాళి కలసి ఉండాలని సందేశాన్ని ఇచ్చిన గొప్ప గురువు భగవత్ శ్రీ రామానుజాచార్యులు. ఆయన గొప్పదనం ఈ తరం వారికి తెలియాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రూపొందించాను' అని చెప్పారు. నిర్మాత ప్రవల్లిక మాట్లాడుతూ 'భారీ స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో నిర్మించిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రసన్నకుమార్, దర్శకుడు వీరశంకర్ పాల్గొన్నారు.

ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ



హాస్య నటుడు అలీ ఫ్యామిలీ నుంచి వచ్చిన సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన 'ప్రణయ గోదారి' చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. పి.ఎల్. విఘ్నేశ్ దర్శకత్వంలో పారమళ్ల లింగయ్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. గోదావరి అందాలు, నేచురల్ లొకేషన్స్‌లో చిత్రీకరించిన ఈ చిత్రంలోని 'కలలో .. కలలో' అంటూ సాగే గీతాన్ని సంగీత దర్శకుడు కోటి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ పాట చూస్తుంటే చక్కని అనుభూతి కలుగుతోంది. సాహిత్యం, సంగీతం, హీరోహీరోయిన్ల అభినయం చక్కగా కుదిరాయి. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే పాట అవుతుంది' అన్నారు. 'ఇది ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ. గోదారి అందాలు, అక్కడి ప్రజల జీవన విధానం అందంగా చూపించే ప్రయత్నం చేశాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో విడుదల చేస్తాం' అని తెలిపారు దర్శకనిర్మాతలు. సునీల్ రావినూతల, పృథ్వీ, సాయికుమార్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు.

ప్రతిభావంతుడు ఎన్టీఆర్‌తో...



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. 'దేవర పార్ట్ 1' సెప్టెంబర్ 27న విడుదలవుతోంది. ఈ సినిమాలోని ఓ పాటకు 'వార్', 'పఠాన్' సినిమాల ఫేమ్.. ప్రముఖ కొరియోగ్రాఫర్ బోస్కో మార్టిస్ నృత్యరీతుల్ని సమకూరుస్తున్నారు. థాయిలాండ్‌లో ప్రస్తుతం ఆ పాట షూటింగ్ జరుగుతోంది. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌తో తీసుకున్న ఫొటోను ఆయన షేర్ చేస్తూ.. "అత్యద్భుతమైన ప్రతిభావంతుడు ఎన్టీఆర్‌తో పనిచేయడం ఎంతో ఆనందాన్నిస్తోంది" అని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు.

కల్కి ప్రత్యేక షో, టికెట్ ధరల పెంపునకు అనుమతి



ప్రభాస్ హీరోగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2898 ఏ.డీ' చిత్రం ప్రత్యేక ప్రదర్శన, టికెట్ ధరల పెంపునకు అనుమతినిస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈనెల 27వ తేదీన చిత్రం విడుదల కానుంది. జూలై 4వ తేదీ దాకా 8 రోజుల పాటు ప్రతీరోజూ ఐదు షోలు ప్రదర్శించటానికి అవకాశం ఇచ్చారు. విడుదల రోజు ఉదయం 5:30 గంటలకు ప్రత్యేక ప్రదర్శనకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆ రోజు మొత్తం ఆరు షోలు ప్రదర్శించనున్నారు. ఇక టికెట్ ధరను జీఎస్టీతో కలిపి రూ.200లకు పెంచుకోవడానికి అనుమతించారు. సింగిల్ స్క్రీన్ థియేటర్‌లలో ప్రస్తుతం ఉన్న టికెట్ ధరపై రూ.75, మల్టీప్లెక్స్‌లలో రూ.100 అదనంగా పెంచుకోవడానికి అనుమతిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జితేందర్ శనివారం మెమోనెం.23424/జనరల్.ఏ1/2024ను జారీ చేశారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

లక్కు..నీ వెంట ...



'నా పేరు శివ', 'అంధగారం' వంటి చిత్రాల్లో నటించిన వినోద్ కిషన్ ప్రస్తుతం 'పేక మేడలు' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. అనూష కృష్ణ హీరోయిన్. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేశ్ వర్రే నిర్మిస్తున్నారు. ఈ సినిమా కోసం భార్గవ్ కార్తీక్ రాసిన 'లక్కు నీ వెంట కుక్క తోక లెక్క ఊపుకుంటూ వచ్చరో లచ్చన్న' అంటూ సాగే పాటను విడుదల చేశారు. నాగూర్ బాబు ఈ పాట పాడారు. స్మరణ్ సాయి సంగీత దర్శకుడు. ఈ సినిమాను జులైలో విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు.

అన్నయ్యా.. నేనూ నీవెంటే..!

» అన్న ఆత్మహత్య వార్త విని గుండెపోటుతో చెల్లెలి మృతి

» రంగారెడ్డి జిల్లా పెద్దపులి నాగారంలో ఘటన



విఠల్‌చారి, అనిత(ఫైల్)

మహేశ్వరం, జూన్ 22(ఆంధ్రజ్యోతి): ఒకే తల్లి పిల్లలైన ఆ అన్నాచెల్లెళ్లు మరణంలోనూ తమ ప్రేమానుబంధాన్ని చాటుకున్నారు. అన్నయ్య ఆత్మహత్య చేసుకున్నాడనే విషయం తెలిసిన వెంటనే చెల్లెలి గుండె ఆగిపోయింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం పెదపులి నాగారం గ్రామంలో శనివారం ఈ ఘటన జరిగింది. నాగారం గ్రామానికి చెందిన కమ్మరి విఠల్‌చారి(50) పదేళ్లుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. విఠల్‌చారికి వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలో కొంత వ్యవసాయభూమి ఉంది. ఆ భూమి దగ్గరకు వెళ్లివస్తానని చెప్పి శుక్రవారం ఇంటి నుంచి బయలుదేరిన విఠల్‌చారి తిరిగిరాలేదు. విఠల్‌చారి తన పొలం వద్ద ఓ చెట్టుకు ఉరి వేసుకుని ప్రాణాలు కోల్పోయి కనిపించాడు. శనివారం ఉదయం విఠల్‌చారి మరణ వార్త తెలుసుకున్న చెల్లెలు అనిత(45) గుండెపోటుతో కన్నుమూసింది. అన్నాచెల్లెళ్లు ఇద్దరు మరణించడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది.

మరో నేత కార్మికుడి బలవన్మరణం

సిరిసిల్ల క్రైం, జూన్ 22: వస్త్రపరిశ్రమలో సంక్షోభంతో సిరిసిల్ల రాజీవ్‌నగర్‌కు చెందిన నేత కార్మికుడు కుడిక్యాల నాగరాజు(47) ఆత్మహత్య చేసుకున్నాడు. మరమగ్గాలు నడుపుకుంటున్న నాగరాజు ఆరు నెలలుగా ఉపాధి లేక అప్పుల పాలయ్యాడు. గతంలో అనారోగ్యానికి గురికావడంతో రూ.4 లక్షల వరకు ఖర్చయింది. నాగరాజు పెద్ద కుమారుడు లోకేశ్ పదో తరగతి ఉత్తీర్ణుడయ్యాడు. అతడిని సిరిసిల్లలోని ప్రైవేటు కళాశాలలో చేర్పించాడు. తన సెల్‌ఫోన్ అమ్మి పుస్తకాలు కొనిచ్చాడు. కళాశాలలో ఫీజు చెల్లించాల్సి ఉందని.. కాలేజీ దూరంగా ఉండటంతో సైకిల్ కావాలని ఇటీవల లోకేశ్.. తండ్రిని అడిగాడు. పైసలు లేక కుమారుడి చిన్న కోరికను కూడా తీర్చలేకపోతున్నానని మనస్తాపం చెందిన నాగరాజు శుక్రవారం రాత్రి ఇంట్లో యాసిడ్ తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు.

చెంచు మహిళను పరామర్శించిన జూపల్లి

» రూ. 2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించిన మంత్రి

» రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : బీఆర్ఎస్

నాగర్‌కర్నూల్, జూన్ 22(ఆంధ్రజ్యోతి): చెంచు మహిళను వివస్త్రను చేసి ఆమెపై పాశవికంగా దాడి చేసిన నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మహిళపై జరిగిన దాష్టీకాన్ని హేయమైన ఆటవిక చర్యగా అభివర్ణించారు. నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లికి చెందిన చెంచు మహిళపై కౌలుదారులు దాడి చేసి అమానుషంగా ప్రవర్తించిన సంగతి తెలిసిందే. దాడిలో తీవ్రంగా గాయపడి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చెంచు మహిళను మంత్రి జూపల్లి శనివారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇలాంటి ఘటన జరగడం బాధాకరమన్నారు. ప్రభుత్వం అన్నివిధాలా బాధితురాలికి అండగా ఉంటుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. మహిళపై దాడి చేసిన నలుగురు వ్యక్తులు అమానవీయంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి ఆదేశించినట్లు వివరించారు. బాధిత కుటుంబానికి రూ. 2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చెంచు మహిళకు మెరుగైన చికిత్స అందించడంతో పాటు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని మాజీ మంత్రులు సబిత, సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళను వారు పరామర్శించారు. బీఆర్ఎస్ తరఫున రూ. 1.50లక్షల సహాయం అందజేశారు.

హైదరాబాద్ ఆపిల్

(మొదటి పేజీ తరువాయి)

రావొచ్చు. వీటన్నింటినీ పటాపంచలు చేస్తూ రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని పులిమామిడిలో ఓ స్వచ్ఛంద సంస్థ ఆపిల్ తోటను విజయవంతంగా సాగు చేస్తోంది. ఆ సంస్థ పేరు శ్రీనిఖిల్ చేతన! తమ సంస్థలోని ఎకరం విస్తీర్ణంలో ప్రయోగాత్మకంగా ఆపిల్ తోట సాగు చేస్తున్నారు. మూడేళ్లలో ఫలసాయం వచ్చే రకాన్ని ఎంచుకొని, 2021లో సాగు చేశారు. ఇప్పుడక్కడ చెట్లన్నీ విరగకాసిన కాయలతో ఉండటాన్ని చూసి సందర్శకులు ఆశ్చర్యపోతున్నారు. ఒకసారి ఫలసాయం మొదలయ్యాక ఏడాదికి రెండుసార్లు (జూన్, డిసెంబరు)లో ఫలసాయం వస్తుంది. కోసిన వెంటనే పూత మొదలవుతుంది. తాము సాగు చేసిన విధానాన్ని సంస్థ నిర్వాహకులు శార్దూల్ జోషీ వివరించారు. ఆయన వివరాల ప్రకారం.. ఎండ ఎక్కువగా ఉండే స్థానిక వాతావరణ పరిస్థితులను తట్టుకునేందుకు ప్రత్యేకంగా అన్నా, హరిమాన్ 99 అనే రకాల మొక్కలను సాగు కోసం ఎంచుకున్నారు. ఈ రెండు రకాలను కూడా హిమాచల్ ప్రదేశ్ నుంచి తీసుకొచ్చారు. ఒక్కో మొక్క (అంటుకట్టిన) కోసం రూ. 150 నుంచి 200 వరకు చెల్లించారు. 2021లో ఎకరా విస్తీర్ణంలో 160 మొక్కలు నాటారు. మొక్కకు మొక్కకు మధ్య 11 అడుగుల దూరం, సాలుకు సాలుకు మధ్య 16 అడుగుల దూరం పాటించారు. మొక్కలకు డ్రిప్ విధానంలో నీరు పెడుతున్నారు. ఎరువుగా ఆవుపేడనే వాడుతున్నారు. దోమలు, ఇతర కీటకాల నివారణ కోసం నిమ్మ నూనె పిచికారీ చేస్తున్నారు. 25 మిల్లీలీటర్ల నిమ్మ ఆయిల్ 25 లీటర్ల నీటిలో కలిపి.. పూత నుంచి కాత వరకు మూడు, నాలుగు సార్లు పిచికారీ చేస్తున్నారు. ఎలాంటి క్రిమిసంహారక మందులు వాడటం లేదు. ఆవులు వారి ప్రాంగణంలోనే ఉండటంతో వాటి పేడనే ఎరువుగా వేస్తున్నారు. భవిష్యత్తులో దీన్ని గ్రీన్ హౌస్ లేదా పాలీహౌస్‌గా మార్చి మరింత దిగుబడులు సాధించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. నగర శివార్లలో కొవిడ్ తర్వాత విల్లాలు, ఫామ్‌హౌస్‌ల కల్చర్ బాగా పెరిగింది. వేయి గజాలపైనే విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించుకుంటున్నారు. వీరంతా ఇపుడు ద్రాక్ష, యాపిల్ తోటలను తమ పెరట్లోనే పెంచుకునేందుకు ఆసక్తిచూపుతున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం కూడా తోడైతే కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లో పండే ఆపిల్ హైదరాబాద్ శివార్లలో కూడా విరివిగా సాగు చేసేందుకు అవకాశాలు మెరుగుపడతాయి.



పులిమామిడిలో ఏపుగా పెరిగిన ఆపిల్ మొక్కలు

కేంద్ర ప్రాయోజిత పథకాల వాటా పెంచాలి

'పాలమూరు'కు జాతీయ హోదా ఇవ్వాలి.. బడ్జెట్‌ను పెట్టేటప్పుడే రాష్ట్రాల రుణ పరిమితి ప్రకటించాలి

» రూ.2,250 కోట్ల వెనుకబడిన ప్రాంతాల నిధులను విడుదల చేయాలి

» కేంద్ర బడ్జెట్ సన్నాహక సమావేశంలో భట్టి

హైదరాబాద్, న్యూఢిల్లీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): 'కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్)' కింద రాష్ట్రానికి జనాభా నిష్పత్తి ప్రకారం నిధులను విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర డిప్యూటీ సీఎం.. ఆర్థిక, విద్యుత్తు శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన శనివారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో కేంద్ర బడ్జెట్ సన్నాహక, జీఎస్టీ కౌన్సిల్ 53వ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్రం తర ఫున భట్టి విక్రమార్క పాల్గొని పలు అంశాలను నిర్మలా సీతారామన్ దృష్టికి తెచ్చారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం గొప్ప పురోగతిని సాధిస్తూ జాతీయ ఆర్థిక వ్యవస్థకు విలువైన భాగస్వామిగా నిలుస్తోందని, అయితే రాష్ట్రానికి తక్షణమే పరిష్కరించుకోవాల్సిన సమస్యలున్నాయని తెలిపారు. ముఖ్యంగా సీఎస్ఎస్‌ల కింద తగ్గుతున్న నిధులు, కేంద్ర పన్నుల్లో వాటాను పంచుకునే ఆర్థిక సూత్రం వంటి సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉందన్నారు. నిజానికి సీఎస్ఎస్‌ల కింద ఏ ఒక్క రాష్ట్రానికి పక్షపాతం లేకుండా నిధులను విడుదల చేయాల్సి ఉంటుందని భట్టి అన్నారు. తెలంగాణ విషయంలో సీఎస్ఎస్‌ల నిధులు తగ్గాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో సీఎస్ఎస్‌ల కింద అన్ని రాష్ట్రాలకు రూ.4,60,000 కోట్లను విడుదల చేశారని, ఇందులో తెలంగాణకు రూ.6,577 కోట్లు వచ్చాయని తెలిపారు. అంటే.. ఇవి 1.4 శాతం నిధులు మాత్రమేనని, రాష్ట్ర జనాభా నిష్పత్తి (లేదా ఏ ఇతర అంగీకరించిన మార్గం) ప్రకారం చూసినా.. నిధులు తగ్గాయని అన్నారు. ఈ దృష్ట్యా సీఎస్ఎస్‌ల నిధులను జనాభా నిష్పత్తి ప్రకారం.. నిర్ణీత సమయంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని 94(2) సెక్షన్ ప్రకారం... వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి కింద ఏడాదికి రూ.450 కోట్ల చొప్పున ఐదేళ్లకు సంబంధించి రూ.2,250 కోట్ల నిధులు రాష్ట్రానికి రావాల్సి ఉందని, వీటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ పథకం కింద కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ... హైదరాబాద్ మినహా తెలంగాణలోని అన్ని జిల్లాలను వెనుకబడినవిగా ప్రకటించినందున... మరో ఐదేళ్ల పాటు నిధులను విడుదల చేయాలన్నారు. రాష్ట్రం ఏర్పాటైన మొదట్లో... తెలంగాణకు మంజూరైన రూ.495.21 కోట్ల సీఎస్ఎస్ నిధులు పొరపాటున ఏపీకి వెళ్లాయని, వీటిని ఏపీ నుంచి తెలంగాణకు ఇప్పించాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సమయంలోనే రాష్ట్రాల 'నికర రుణ పరిమితి(నెట్ బారోయింగ్ సీలింగ్)'ని తెలియజేయాలని, తద్వారా రాష్ట్రాలు తమ వనరులను సమర్థంగా వినియోగించుకునేలా ప్రణాళికలను రచించుకుంటాయని తెలిపారు. కేంద్ర పన్నుల విభజనలో రాష్ట్రాలకు వాటా తగ్గిందని, సెస్‌లు, సర్‌చార్జీల రూపంలో కేంద్రమే ఎక్కువ నిధులు లాక్కుంటుందని అన్నారు. మొత్తం పన్ను ఆదాయంలో సెస్‌లు, సర్‌చార్జీల వాటా 10 శాతానికి మించకుండా ఉండేలా చూడాలన్నారు. 'పాలమూరు-రంగారెడ్డి' ఇరిగేషన్ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని కోరారు. రీజినల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్)కు నిధులివ్వాలని, జిల్లాకొక నవోదయ పాఠశాలలను మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు. ప్రధాని సూర్యఘర్ పథకంలో విద్యుత్తు సబ్సిడీ, 'ముఫ్తీ బిజిలీ యోజన' కింద సబ్సిడీ నిధులను వినియోగించుకోవడానికి అవకాశం కల్పించాలని, ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రాలకు విధించిన పరిమితులను తొలగించాలని అన్నారు. రాష్ట్రాల మూలధన వ్యయం కోసం అమలు చేస్తున్న ప్రత్యేక ఆర్థిక సాయం పథకం కింద సంవత్సరానికి రూ.2.5 లక్షల కోట్లకు పెంచాలని, దీనికి సీఎస్ఎస్‌ల అనుసంధాన షరతులు, పరిమితులు లేకుండా చూడాలన్నారు. వివిధ సీఎస్ఎస్‌లను పునఃసమీక్షించి, అనవసరమైనవాటిని తొలగించాలని, రాష్ట్రాల ఆప్షన్ల మేరకు కొత్త పథకాలను ప్రవేశపెట్టాలని అన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి, ఆదాయ పంపిణీ అసమానతల తొలగింపునకు బడ్జెట్‌లో కొత్త పథకాలను ప్రవేశపెట్టి ఎక్కువ నిధులివ్వాలని కోరారు. నిరుద్యోగ యువతకు నైపుణ్య పెంపుదల శిక్షణ ఇవ్వాలన్నారు.



ప్రభుత్వ స్కూళ్ల నిర్మాణంలో జీఎస్టీ వద్దు

జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశంలోనూ మల్లు భట్టి విక్రమార్క పలు అంశాలపై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల నిర్మాణ పనులకు జీఎస్టీని మినహాయించాలని కోరారు. అలాగైతే... రాష్ట్రాలు అదనపు పాఠశాలల భవనాలను నిర్మించుకోవడానికి వీలవుతుందన్నారు. మద్యం తయారీలో వినియోగించే 'ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్'ను జీఎస్‌టీ నుంచి మినహాయించాలని అన్నారు. వివిధ సందర్భాల్లో పన్ను చెల్లింపుదారులపై విధించే జరిమానా, వడ్డీని మినహాయించే ప్రతిపాదనపై మద్దతు ఇస్తున్నామని తెలిపారు. జీఎస్టీ శ్లాబుల హేతుబద్ధీకరణకు మద్దతు ఇస్తున్నామన్నారు. కాగా, బొగ్గు గనులను వేలం వెయ్యడానికి చట్టాన్ని తెచ్చింది బీజేపీ అయితే బిల్లుకు పార్లమెంటులో మద్దతు తెలిపింది బీఆర్ఎస్సేనని విలేకరులతో మాట్లాడుతూ భట్టి దుయ్యబట్టారు.

రూ.6లక్షలతో యాదరుషి మండపం


యాదాద్రి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): రుష్యశృంగ మహర్షి, శాంతల పుత్రుడైన యాదమహర్షి పేరుతో వెలిసిన దివ్య పుణ్యక్షేత్రమే యాదగిరిగుట్ట. గతంలో కొండ కింద మొదటి ఘాట్ రోడ్డు సమీపంలో మర్రిచెట్టు వద్ద యాదరుషి విగ్రహం ఉండేది. భక్తులు ఆయన విగ్రహాన్ని దర్శించుకుని కొండపైకి వెళ్లేవారు. ఆలయ విస్తరణలో భాగంగా కొండ కింద తులసీ కాటేజీ దగ్గర ఉన్న మర్రిచెట్టు వద్ద ఆ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. దీంతో నాటి నుంచి భక్తులు పూజలు చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో క్షేత్రం వెలిసేందుకు కారకుడైన యాదరుషికి ప్రత్యేకంగా మండపాన్ని నిర్మించాలని ఆలయ అధికారులు సంకల్పించారు. యాదరుషి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు రూ.6లక్షల వ్యయంతో కొత్తగా ఓ మండపాన్ని నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇంజనీరింగ్ అధికారులు శనివారం స్థల పరిశీలన చేశారు. కొండపైకి వచ్చే మార్గంలో వైకుంఠ ద్వారం సమీపంలో యాదరుషి మండపాన్ని నిర్మించాలని అనుకుంటున్నారు.

శ్రీవారి లడ్డూ ధరల్లో మార్పు లేదు

» టీటీడీ స్పష్టీకరణ

తిరుమల, జూన్22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, లడ్డూప్రసాదం ధరల్లో ఎలాంటి మార్పు లేదని టీటీడీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. 'తిరుమలలో గతంలో రూ.300గా ఉన్న స్పెషల్ దర్శనాన్ని రూ.200కు, రూ.50 లడ్డూలను రూ.25కు తగ్గించారు' అంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని టీటీడీ స్పష్టం చేసింది. అలాగే శ్రీవారి దర్శనానికి సంబంధించి అధిక ధరలకు ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు పొందవచ్చని కొంతమంది ఫోన్ నంబర్లతో సర్క్యులేట్ అవుతున్న సమాచారంపై కూడా టీటీడీ స్పందించింది. 'వాస్తవానికి శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనానికి సంబంధించి టీటీడీ వెబ్‌సైట్ ద్వారానే కాకుండా వివిధ రాష్ట్రాలకు సంబంధించిన టూరిజం విభాగాలకు కొన్ని టికెట్లు కేటాయిస్తోంది. అయితే కొంతమంది దళారీలు టూరిజం వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసి ఇస్తామని పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. వారిని నమ్మి భక్తులు మోసపోవద్దు' అని టీటీడీ సూచించింది.





కలిసికట్టుగా కదం తొక్కగా..

టీ20 వరల్డ్‌కప్

బంగ్లాదేశ్‌పై భారత్ ఘన విజయం

సెమీస్ బెర్త్ దాదాపు ఖాయం




కుల్దీప్ (3/19)

హార్దిక్ పాండ్యా (50 నాటౌట్)

నార్త్ సౌండ్: టీ20 వరల్డ్‌కప్‌లో భారత్ అజేయ ఆటతీరు కొనసాగుతోంది. అటు బ్యాటింగ్.. ఇటు బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చడంతో శనివారం గ్రూప్ 1లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 50 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. టోర్నీలో జట్టుకిది వరుసగా ఐదో విజయం కాగా.. సూపర్-8లో రెండోది. దీంతో తమ గ్రూప్‌లో 4 పాయింట్లతో టాప్‌లో నిలవడంతో పాటు సెమీఫైనల్ బెర్త్‌ను కూడా దాదాపు ఖాయం చేసుకుంది. మరోవైపు ఆస్ట్రేలియా జట్టు అఫ్ఘాన్‌పై గెలిస్తే భారత్‌తో పాటు ఆసీస్ కూడా సెమీస్ చేరుతుంది. ఇక రెండు ఓటములతో ఉన్న బంగ్లాదేశ్ సాంకేతికంగా టోర్నీలోనే ఉన్నా ముందుకెళ్లడం అసాధ్యమే. మ్యాచ్‌లో ముందుగా భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 196 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా (27 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 50 నాటౌట్), కోహ్లీ (28 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 37), పంత్ (24 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 36), దూబే (24 బంతుల్లో 3 సిక్సర్లతో 34) కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు. తన్‌జీమ్, రిషాద్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 146 పరుగులు చేసి ఓడింది. షంటో (40), తన్‌జీద్ (29), రిషాద్ (24) మాత్రమే రాణించారు. కుల్దీప్‌నకు మూడు.. బుమ్రా, అర్ష్‌దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా హార్దిక్ పాండ్యా నిలిచాడు.

పోరాటమే లేదు..: భారీ ఛేదనలో బంగ్లా బ్యాటర్లను భారత్ బౌలర్లు సమర్థవంతంగా అడ్డుకున్నారు. ముఖ్యంగా స్పిన్నర్ కుల్దీప్ మధ్య ఓవర్లలో తడాఖా చూపించడంతో మిడిలార్డర్ కుదేలైంది. ఓపెనర్లు లిట్టన్ (13), తన్‌జీద్ ఓ మాదిరి ఆటతీరుతో తొలి వికెట్‌కు 35 పరుగులు జోడించారు. ఐదో ఓవర్‌లో లిట్టన్‌ను హార్దిక్ అవుట్ చేశాడు. కానీ కుల్దీప్ తన వరుస ఓవర్లలో తన్‌జీద్, తౌహిద్ (4), షకీబ్ (11) వికెట్లను తీయడంతో 98/4తో బంగ్లా ఆట పూర్తిగా లయ తప్పింది. ఆ తర్వాత మిగతా బ్యాటర్లు కూడా ప్రభావం చూపలేకపోయారు. 19వ ఓవర్‌లో రిషాద్‌ను బుమ్రా అవుట్ చేయడంతో బంగ్లాకు భారీ ఓటమి తప్పలేదు.

సమష్టిగా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్‌లో ఈసారి బ్యాటింగ్ విభాగం అదరగొట్టింది. సూర్య మినహా క్రీజులోకి వచ్చిన ప్రతీ ఆటగాడు బ్యాట్ ఝుళిపించడంతో స్కోరు 200 చేరువకు వచ్చింది. విఫలమవుతున్న విరాట్, దూబే సైతం ఆకట్టుకోగా.. హార్దిక్ ధనాధన్ ఆటతో అజేయ హాఫ్ సెంచరీతో నిలిచాడు. ఆరంభంలోనే ఓపెనర్లు రోహిత్ (23), విరాట్ జోరును చూపారు. నాలుగో ఓవర్‌లోనూ రోహిత్ 6,4తో ధాటిని ప్రదర్శించినా షకీబ్ వేసిన ఫుల్లర్ బంతికి క్యాచ్ అవుటయ్యాడు. దీంతో తొలి వికెట్‌కు 39 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తాజా టోర్నీలో ఈ వికెట్‌కు భారత్ నుంచి ఇదే అత్యధికం కావడం గమనార్హం. అటు ముస్తాఫిజుర్ ఓవర్‌లో కోహ్లీ సిక్సర్‌తో పవర్‌ప్లేలో జట్టు 53/1 స్కోరు సాధించింది. ఇక వచ్చీ రాగానే సిక్సర్ బాదిన సూర్యకుమార్ (6)ను తన్‌జీమ్ పెవిలియన్ చేర్చాడు. పంత్ మాత్రం తన ధాటిని కొనసాగించినా, ఆ తర్వాత స్పిన్నర్ రిషాద్‌కు చిక్కడంతో నాలుగో వికెట్‌కు దూబేతో 31 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో హార్దిక్ దూకుడుతో తిరిగి స్కోరు గాడిన పడింది. ఇక ఆరంభంలో నిదానంగా ఆడిన దూబే తర్వాత భారీ సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. కానీ ఎక్కువ సేపు క్రీజులో నిలువకుండా రిషాద్ ఓవర్‌లో బౌల్డయ్యాడు. అప్పటికే ఐదో వికెట్‌కు వీరి మధ్య 34 బంతుల్లోనే 53 పరుగులు జత చేరాయి. అటు ఆఖరి ఓవర్‌లో పాండ్యా ఫిఫ్టీని పూర్తి చేసుకున్నాడు. చివరి ఐదు ఓవర్లలో జట్టు 62 రన్స్ సాధించడం విశేషం.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (సి) జాకర్ (బి) షకీబల్ 23, కోహ్లీ (బి) తన్‌జీమ్ 37, పంత్ (సి) తన్‌జీమ్ (బి) రిషాద్ 36, సూర్యకుమార్ (సి) లిట్టన్ (బి) తన్‌జీమ్ 6, దూబే (బి) రిషాద్ 34, హార్దిక్ (నాటౌట్) 50, అక్షర్ (నాటౌట్) 3, ఎక్స్‌ట్రాలు: 7; **మొత్తం: 20 ఓవర్లలో 196/5; వికెట్ల పతనం:** 1-39, 2-71, 3-77, 4-108, 5-161; **బౌలింగ్:** మెహ్దీ హసన్ 4-0-28-0, షకీబల్ 3-0-37-1, తన్‌జీమ్ 4-0-32-2, ముస్తాఫిజుర్ 4-0-48-0, రిషాద్ 3-0-43-2, మహ్మదుల్లా 2-0-8-0.

బంగ్లాదేశ్: లిట్టన్ (సి) సూర్య (బి) హార్దిక్ 13, తన్‌జిద్ (ఎల్బీ) కుల్దీప్ 29, షంటో (సి) అర్ష్‌దీప్ (బి) బుమ్రా 40, హ్రిదయ్ (ఎల్బీ) కుల్దీప్ 4, షకీబల్ (సి) రోహిత్ (బి) కుల్దీప్ 11, మహ్మదుల్లా (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 13, జాకర్ అలీ (సి) కోహ్లీ (బి) అర్ష్‌దీప్ 1, రిషాద్ (సి) రోహిత్ (బి) బుమ్రా 24, మెహ్దీ హసన్ (నాటౌట్) 5, తన్‌జీమ్ (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు: 5; **మొత్తం: 20 ఓవర్లలో 146/8; వికెట్ల పతనం:** 1-35, 2-66, 3-76, 4-98, 4-109, 6-110, 7-138, 8-145; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-30-2, బుమ్రా 4-0-13-2, అక్షర్ పటేల్ 2-0-26-0, హార్దిక్ 3-0-32-1, జడేజా 3-0-24-0, కుల్దీప్ యాదవ్ 4-0-19-3.

పాయింట్ల పట్టిక — గ్రూప్-1

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
భారత్	2	2	0	0	4	2.425
ఆస్ట్రేలియా	1	1	0	0	2	2.471
అఫ్ఘాన్	1	0	1	0	0	-2.350
బంగ్లాదేశ్	2	0	2	0	0	-2.489

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

టీ20 ప్రపంచకప్‌లో 50 వికెట్లు పూర్తి చేసిన తొలిబౌలర్‌గా షకీబ్

1

వరల్డ్‌కప్‌ల్లో (టీ20, వన్డే) 3వేల పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా విరాట్

ఈ మైదానంలో జరిగిన టీ20ల్లో ఇదే అత్యధిక స్కోరు (196)

టీ20 వరల్డ్‌కప్ చరిత్రలోని ఓ మ్యాచ్‌లో ఎక్కువ సిక్సర్లు (13) బాదిన జట్టుగా భారత్.

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

అఫ్ఘానిస్థాన్ x ఆస్ట్రేలియా (ఉ.6. గం.)

ఇంగ్లండ్ x అమెరికా (రా.8. గం.)

హోప్ ఫటాఫట్

- చేజ్ మ్యాజిక్ ● 9 వికెట్లతో విండీస్ విక్టరీ
- అమెరికా నాకౌట్ ఆశలు గల్లంతు?


షాయ్ హోప్ (39 బంతుల్లో 82 నాటౌట్)


రోస్టన్ చేజ్ (3/19)

బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): ఇంగ్లండ్ చేతిలో కంగుతిన్న వెస్టిండీస్.. టీ20 వరల్డ్‌కప్‌లో బలంగా పుంజుకొంది. రోస్టన్ చేజ్ (3/19) తిప్పేయగా.. ఓపెనర్ షాయ్ హోప్ (39 బంతుల్లో 4 ఫోర్లు, 8 సిక్సలతో 82 నాటౌట్) ధనాధన్ అర్ధ శతకంతో సెమీస్ ఆశలను సజీవంగా నిలబెట్టుకొంది. సూపర్-8లో భాగంగా గ్రూప్-2లో శనివారం జరిగిన మ్యాచ్‌లో విండీస్ 9 వికెట్ల తేడాతో అమెరికాను చిత్తు చేసింది. హోప్ భారీ షాట్లతో చెలరేగిపోతుంటే.. అతడిని ఎలా కట్టడి చేయాలో యూఎస్ కెప్టెన్ ఆరోన్ జోన్స్‌కు పాలుపోలేదు. ఈ విజయంతో రన్‌రేట్‌ను భారీగా మెరుగుపరచుకొన్న విండీస్.. గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచింది. మరోవైపు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన యూఎస్ నాకౌట్ ఆశలు దాదాపుగా ముగిసినట్టే..! టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన అమెరికా 19.5 ఓవర్లలో 128 పరుగులకే కుప్పకూలింది. ఆండ్రిస్ గౌస్ (29), నితీష్ కుమార్ (20) టాప్ స్కోరర్లు. ధాటిగా ఆడుతున్న ఆండ్రిస్‌ను అల్జరీ జోసెఫ్ అవుట్ చేయగా.. ఆ తర్వాత 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' చేజ్ తన మాయాజాలాన్ని ప్రదర్శించాడు. పవర్‌హిట్టర్ ఆరోన్ జోన్స్ (11)ను బౌల్డ్ చేసిన రోస్టన్.. కోరె అండర్సన్ (7), హర్మీత్ సింగ్ (0)ను పెవిలియన్ చేర్చి అమెరికా బ్యాటింగ్ వెన్నువిరిచాడు. రస్సెల్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని వెస్టిండీస్ 10.5 ఓవర్లలో 130/1 స్కోరు చేసి సునాయాసంగా నెగ్గింది. తొలి వికెట్‌కు చార్లెస్ (15)తో కలిసి 67 పరుగులు జోడించిన హోప్.. ఆ తర్వాత పూరన్ (27 నాటౌట్)తో రెండో వికెట్‌కు అబేధ్యంగా 23 బంతుల్లో 63 రన్స్ జోడించాడు. దీంతో విండీస్ మరో 55 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకొంది.

సంక్షిప్త స్కోర్లు

అమెరికా: 19.5 ఓవర్లలో 128 ఆలౌట్ (ఆండ్రిస్ 29, నితీష్ 20; చేజ్ 3/19, రస్సెల్ 3/31, జోసెఫ్ 2/31).
వెస్టిండీస్: 10.5 ఓవర్లలో 130/1 (హోప్ 82 నాటౌట్, పూరన్ 27 నాటౌట్; హర్మీత్ 1/18).

పాయింట్ల పట్టిక — గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
సౌతాఫ్రికా	2	2	0	0	4	0.625
వెస్టిండీస్	2	1	1	0	2	1.814
ఇంగ్లండ్	2	1	1	0	2	0.412
అమెరికా	2	0	2	0	0	-2.908

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు



సురేఖ జట్టుకు హ్యాట్రిక్ స్వర్ణం

అంటాల్యా (టర్కీ): ఫామ్‌లో ఉన్న భారత మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు వరల్డ్‌కప్‌లో 'హ్యాట్రిక్ స్వర్ణంతో' అరుదైన ఘనతను అందుకొంది. శనివారం జరిగిన వరల్డ్‌కప్ స్టేజ్-3 టీమ్ ఫైనల్లో జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్నీత్ కౌర్‌ల త్రయం 232-229తో ఎస్తోనియాను ఓడించింది. షాంఘైలో జరిగిన స్టేజ్-1, యెచియాన్‌లో జరిగిన స్టేజ్-2లో కూడా పసిడి పతకాలు సాధించిన కాంపౌండ్ జట్టు.. వరుసగా స్టేజ్-3లో స్వర్ణ కాంతులీనింది. పురుషుల వ్యక్తిగత ఈవెంట్ ఫైనల్లో 148-149తో స్లాపెర్ (నెదర్లాండ్స్) చేతిలో ఓడిన ప్రియాన్ష్ రజతంతో సరిపెట్టుకొన్నాడు. కాగా, ఆదివారం జరిగే రికర్వ్ విభాగంలో భారత్ మూడు స్వర్ణాల కోసం తలపడనుంది. వ్యక్తిగత, మిక్స్‌డ్‌లో ధీరజ్ బొమ్మదేవర.. మహిళల ఈవెంట్‌లో అంకిత భక్త్ ఫైనల్లో ఆడనున్నారు.

నాకౌట్‌కు పోర్చుగల్

యూరో చాంపియన్‌షిప్


సిల్వా

డార్ట్‌మండ్ (జర్మనీ): యూరో చాంపియన్‌షిప్‌లో క్రిస్టియానో రొనాల్డో సారథ్యంలోని పోర్చుగల్ జట్టు నాకౌట్‌కు దూసుకెళ్లింది. గ్రూప్-ఎఫ్‌లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో పోర్చుగల్ 3-0తో తుర్కియేను చిత్తుచేసింది. పోర్చుగల్ జట్టులో సిల్వా (21వ), అకేంజీ (28వ), ఫెర్నాండెజ్ (56వ) తలో గోల్ సాధించారు. తన గ్రూపులో వరుసగా రెండు విజయాలు నమోదుచేసిన పోర్చుగల్ 6 పాయింట్లతో నాకౌట్‌కు అర్హత సాధించింది. ఇక, ఫ్రాన్స్-నెదర్లాండ్స్ గ్రూపు దశ బ్లాక్‌బస్టర్ పోరు 0-0తో డ్రాగా ముగిసింది. గ్రూప్ 'డి'లో అత్యంత బలమైన ఈ రెండు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ సాకర్ ఫ్యాన్స్‌కు మస్తు మజా పంచింది. ఫ్రాన్స్-నెదర్లాండ్స్ నువ్వా..నేనా..అనేలా తలపడడంతో ఒక్క గోల్ కూడా నమోదు కాకుండానే పోరు ముగియడం విశేషం. అయితే 69వ నిమిషంలో డచ్ మిడ్‌ఫీల్డర్ సిమోన్స్ గోల్ కొట్టినా..రెఫరీ 'ఆఫ్‌సైడ్'గా ప్రకటించాడు. గ్రూప్ 'ఎఫ్'లో చెక్ రిపబ్లిక్-జార్జియా మ్యాచ్ 1-1తో డ్రా అయ్యింది.

భారత్ X దక్షిణాఫ్రికా మహిళల మూడో వన్డే
మ.1.30 నుంచి జియో సినిమా, టీవీ 18లో



నగాల్‌కు ఒలింపిక్ బెర్త్

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ స్టార్ సుమిత్ నగాల్ పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌లో తలపడడం నగాల్‌కిది రెండోసారి. గతంలో టోక్యో ఒలింపిక్స్‌లో సింగిల్స్‌లో ఆడిన అతను రెండో రౌండ్‌లో మెద్వెదెవ్ చేతిలో ఓడిపోయాడు. ఇక, ఇటీవలి అద్భుత ప్రదర్శనతో నగాల్ ర్యాంకింగ్స్‌లోనూ 71వ స్థానానికి ఎగబాకడంతో విశ్వక్రీడలకు బెర్త్ దక్కించుకున్నాడు.

బిజినెస్





సంపన్నులు మకాం మార్చేస్తున్నారు..

హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ నివేదిక వెల్లడి

ఈ ఏడాది 4,300 మంది భారత మిలియనీర్లు ఇతర దేశాలకు వలస పోవచ్చని అంచనా

న్యూఢిల్లీ: భారత సంపన్నులు అధిక సంఖ్యలో వలసపోతున్నారని హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ తాజా నివేదిక వెల్లడించింది. గత ఏడాదిలో 5,100 మంది భారత మిలియనీర్లు (కనీసం రూ.8.3 కోట్ల సంపద కలిగిన వారు) ఇతర దేశాల్లో స్థిరపడగా.. 2024లో మరో 4,300 మంది ధనికులు తమ మకాం మార్చేయవచ్చని నివేదిక అంచనా వేసింది. అధిక శాతం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో స్థిరపడేందుకు మొగ్గుచూపుతున్నారని నివేదిక పేర్కొంది. మరిన్ని ముఖ్యాంశాలు..

- మిలియనీర్ల వలసల విషయంలో చైనా, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది.
- సంపన్నుల వలసలతో యూఏఈ అధికంగా లబ్ధిపొందనుంది. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 1.28 లక్షల మంది సంపన్నులు ఇతర దేశాల్లో స్థిరపడవచ్చని.. అందులో 6,800 మంది మిలియనీర్లు యూఏఈకి వలసపోవచ్చని అంచనా. అమెరికా, సింగపూర్ ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.
- 2013-23 మధ్యకాలంలో యూఏఈకి భారత సంపన్నుల వలసలు 85% పెరిగాయి.
- సంపన్నుల వలసలకు భద్రత, పన్ను ప్రయోజనాలు, ఆర్థిక కారణాలు కారణమని నివేదిక పేర్కొంది.

□ అమెజాన్ బిజినెస్.. బిజినెస్ వాల్యూ డేస్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ నెల 24 నుంచి 30 వరకు బిజినెస్ కస్టమర్లందరికీ ఇది అందుబాటులో ఉంటుందని తెలిపింది. ల్యాప్‌టాప్స్, స్మార్ట్‌వాచీలు, హోం, కిచెన్ అప్లయెన్సెస్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు సహా ఇతర ఉత్పత్తులపై 70 శాతం వరకు డిస్కౌంట్‌ను ఆఫర్ చేస్తున్నట్లు ప్రకటించింది.

□ హైదరాబాద్‌లో జరుగుతున్న బీ2బీ ఇండస్ట్రియల్ మెషినరీ, ఇంజనీరింగ్ ఎగ్జిబిషన్..ఇండోమాక్‌లో మెషిన్ టూల్స్, ఆటోమేషన్, రోబోటిక్స్, వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్ ఉత్పత్తులు కొలువు దీరాయి. ఆదివారం ఈ ఎగ్జిబిషన్ ముగియనుంది.

□ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్.. ఐ ప్రొటెక్ట్ స్మార్ట్ టర్మ్ ప్లాన్‌పై మహిళలకు ప్రత్యేక రాయితీని అందిస్తోంది. ఈ ప్లాన్‌పై మహిళలకు 15 శాతం లైఫ్‌టైమ్ డిస్కౌంట్‌ను అందించనుండగా వేతనాలు పొందే మహిళలకు మరో 15 శాతం అదనంగా రాయితీని అందించనుంది.

□ టైర్ల తయారీ సంస్థ మిచెలిన్.. వాణిజ్య వాహనాల కోసం ఎక్స్ మల్టీ ఎనర్జీ జెడ్ ప్లస్ పేరుతో టైర్లను విడుదల చేసింది. భారత మార్కెట్ కోసం ఈ టైర్లను ప్రత్యేకంగా తయారు చేసినట్లు వెల్లడించింది.

దేశీయ వాహన కంపెనీల ఈ-రష్!



బడా ఎస్‌యూవీల ఎలక్ట్రిఫికేషన్‌పై దృష్టి

వచ్చే 6-8 నెలల్లో మార్కెట్లోకి పలు కొత్త మోడళ్ల విడుదల

ఎలక్ట్రిక్ కార్ల (ఈవీ) విభాగంలోనూ పోటీ వేడెక్కుతోంది. మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడీ, వోల్వో వంటి అంతర్జాతీయ లగ్జరీ కార్ల బ్రాండ్లను మినహాయిస్తే, దేశీయ మార్కెట్లో అధికంగా హ్యాచ్‌బ్యాక్, కాంపాక్ట్ ఎస్‌యూవీ మోడళ్లలోనే ఎలక్ట్రిక్ వెర్షన్లు అందుబాటులో ఉన్నాయి. ఈ విషయంలో మరో మెట్టెక్కేందుకు వాహన సంస్థలు మిడ్‌సైజ్, బడా ఎస్‌యూవీ మోడళ్లలోనూ ఈ-వెర్షన్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నాయి. టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం), హ్యుండయ్, కియా, మారుతి సుజుకీ, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ వచ్చే 6-8 నెలల్లో పలు ఈ-ఎస్‌యూవీలను మార్కెట్లో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి.

టాటాదే హవా



నెక్సాన్, పంచ్, టియాగో, టిగోర్ ఈవీ వెర్షన్లతో దేశీయ ఎలక్ట్రిక్ కార్ల విభాగంలో దాదాపు 70 శాతం మార్కెట్ వాటాను చేజిక్కించుకున్న టాటా మోటార్స్ తన ఈ-పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించనుంది. ఇందులో భాగంగా ఎస్‌యూవీ హారియర్‌లోనూ ఈవీ వెర్షన్‌ను ప్రవేశపెట్టేందుకు సంస్థ సిద్ధమవుతోంది. సంప్రదాయ ఇంధన ఇంజన్‌తో కూడిన హారియర్ ఎక్స్‌షోరూమ్ కనీస ధర రూ.17 లక్షల స్థాయిలో ఉంది. హారియర్ ఈవీ రేటు ప్రారంభ రేటు రూ.22-25 లక్షల స్థాయిలో ఉండవచ్చని అంచనా. కాగా, టాటా మోటార్స్ త్వరలో విడుదల చేయనున్న క్రాసోవర్ వెహికిల్ 'కర్వ్'లో సంప్రదాయ ఇంజన్ వేరియంట్లతో పాటు ఈవీ వెర్షన్‌ను సైతం అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిసింది.

మార్చి నాటికి హ్యుండయ్ క్రెటా

హ్యుండయ్ మోటార్ ఇండియా తన బెస్ట్ సెల్లింగ్ మోడళ్లలో ఒకటైన క్రెటాలో ఎలక్ట్రిక్ వేరియంట్‌ను వచ్చే మార్చి నాటికి మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్నట్లు తెలిపింది. ఇప్పటికే 'ఈవీ 6' మోడల్‌ను దేశీయ మార్కెట్లో విక్రయిస్తోన్న కియా.. త్వరలో 'ఈవీ 9'ను లాంచ్ చేయనుంది. దీని ధర రూ.కోటి స్థాయిలో ఉండవచ్చని అంచనా. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ప్రస్తుతం జెడ్ఎస్, కోమెట్ ఈవీలను అందుబాటులోకి తెచ్చింది. క్లౌడ్ పేరుతో ఎలక్ట్రిక్ క్రాసోవర్ యుటిలిటీ వెహికిల్‌ను త్వరలో విడుదల చేయనుంది. దాని ధర రూ.20 లక్షల స్థాయిలో ఉండే అవకాశం ఉంది.

మహీంద్రా ఎక్స్‌యూవీ 700 ఈవీ

మరో దేశీయ వాహన తయారీ సంస్థ మహీంద్రా తన ఎస్‌యూవీ మోడల్ 'ఎక్స్‌యూవీ 700'లో ఈ-వెర్షన్‌ను లాంచ్ చేసేందుకు సిద్ధమవుతోంది. దీని ధరను రూ.20 లక్షల లోపే నిర్ణయించే అవకాశం ఉంది. ఆ తర్వాత కంపెనీ బోర్న్ ఎలక్ట్రిక్ మోడల్ 'బీఈ 05'ను మార్కెట్లోకి ప్రవేశపెట్టనుంది. దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ ఇండియా సైతం ఎలక్ట్రిక్ వాహన విభాగంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈవీఎక్స్ కాన్సెప్ట్ ఆధారిత ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ మోడల్‌ను కంపెనీ వచ్చే ఏడాది తొలినాళ్లలో జరగబోయే ఆటో ఎక్స్‌పోలో ఆవిష్కరించనుంది. దాని ధరను రూ.10-15 లక్షల స్థాయిలో నిర్ణయించే అవకాశముంది. అంతర్జాతీయ లగ్జరీ కార్ల బ్రాండ్ల విషయానికొస్తే, మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ ఇప్పటికే పలు ఎలక్ట్రిక్ వెర్షన్లను దేశీయ మార్కెట్లోకి ప్రవేశపెట్టాయి. ఎలక్ట్రిఫికేషన్‌లో ఈ రెండు కంపెనీలు మిగతా లగ్జరీ బ్రాండ్ల కంటే ముందున్నాయి. భారత్‌లో ఈక్యూ ఎస్ లగ్జరీ సెలూన్, ఈక్యూ బీ, ఈక్యూ ఈ ఎలక్ట్రిక్ మోడళ్లను విక్రయిస్తోన్న బెంజ్.. ఈ ఆగస్టులో ఈక్యూ ఏ మోడల్‌ను ప్రవేశపెట్టనుంది.

విశాఖలో మోగ్లిక్స్ కేంద్రం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బీ2బీ ఈ-కామర్స్ సంస్థ మోగ్లిక్స్.. కార్యకలాపాలు విస్తరించేందుకు రెడీ అవుతోంది. కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మోగ్లిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ గోయల్ వెల్లడించారు. రూ.10 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఈ సెంటర్ వచ్చే ఏడాది కాలంలో కార్యకలాపాలు ప్రారంభించనుందని చెప్పారు. పారిశ్రామిక సంస్థలు, ఎంఎస్ఎంఈలకు అవసరమైన ఉత్పత్తులను కంపెనీ సరఫరా చేస్తోంది. సంస్థ ఇప్పటికే హైదరాబాద్, నోయిడాలో రెండు టెక్నాలజీ హబ్‌లను నిర్వహిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా కంపెనీకి ఎంఎస్ఎంఈ విభాగంలో 5 లక్షల మంది, 700 బడా పారిశ్రామిక సంస్థలు తమ క్లయింట్లుగా ఉన్నాయని గోయల్ చెప్పారు. ప్రధానంగా ఆటోమొబైల్, ఫార్మా, ఎఫ్ఎంసీజీ విభాగంలోని సంస్థలు ప్రధాన క్లయింట్లుగా ఉన్నాయని పేర్కొన్నారు. మోగ్లిక్స్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 40కి పైగా ప్రాంతాల్లో 40 కార్యాలయాలను నిర్వహిస్తోందని చెప్పారు. కంపెనీలో 2,000 మంది ఉద్యోగులుండగా వచ్చే ఏడాది కాలంలో 500 మంది ఉద్యోగులను నియమించుకోనున్నట్లు గోయల్ తెలిపారు.

□ గడచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇండెల్ మనీ రూ.289 కోట్ల రెవెన్యూపై రూ.55.75 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చితే లాభం 91.40 శాతం, రెవెన్యూ 56 శాతం వృద్ధి చెందింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన కంపెనీ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.1,800 కోట్లు అధిగమించింది.

□ సోనాలికా బ్రాండ్‌తో ట్రాక్టర్లను విక్రయిస్తున్న ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ మే నెలలో దేశీయంగా 11,130 యూనిట్లను విక్రయించింది. గత ఏడాది ఇదే నెలతో పోల్చితే అమ్మకాలు 5.2 శాతం పెరిగాయి. కాగా ఎగుమతులు కూడా కలిపితే మొత్తం ట్రాక్టర్ల విక్రయాలు 13,338 యూనిట్లుగా ఉన్నాయి.

లే అవుట్లలోని ప్లాట్లకు జీఎస్‌టీ వర్తిస్తుందా..?


ఇదీ GST
రాంబాబు గొండాల

నిర్మాణ రంగానికి సంబంధించి జీఎస్‌టీ గురించి చూసుకుంటే.. మొదట్లో నివాసిత అపార్ట్‌మెంట్స్ (రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్) అమ్మకానికి పన్ను 12 శాతం ఉండేది. 2019లో దీన్ని 5 శాతానికి తగ్గించారు. అయితే వాణిజ్య పరిధిలోకి వచ్చే కమర్షియల్ అపార్ట్‌మెంట్స్‌కు మాత్రం పన్ను శాతంలో కానీ, ఇన్‌పుట్ విషయంలో కానీ ఎలాంటి మార్పు చేయలేదు. ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే కంప్లీషన్ సర్టిఫికెట్ జారీ చేసిన తర్వాత అమ్మే అపార్ట్‌మెంట్లకు ఎలాంటి జీఎస్‌టీ వర్తించదు. ఇది అన్ని రకాల అపార్ట్‌మెంట్లకు వర్తిస్తుంది. వివరంగా చెప్పాలంటే, జీఎస్‌టీ చట్టంలోని నిర్వచనాల ప్రకారం.. అపార్ట్‌మెంట్లకు సంబంధించి ఒక ప్రాజెక్ట్ మొదలు పెట్టినప్పటి నుంచి ప్రాజెక్ట్ పూర్తయి కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చే వరకు జరిపే అమ్మకాలను 'సర్వీస్' కింద భావిస్తారు. కాబట్టి వీటి మీద జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, అపార్ట్‌మెంట్‌కు విస్తృత నిర్వచనం ఇవ్వటం జరిగింది. దీని ప్రకారం ఫ్లాట్, విల్లా, షాప్, గోడౌన్, షెడ్, ఆఫీస్, షోరూమ్ ఇలా నివాసానికి, వాణిజ్య అవసరాలకు సరిపడే వివిధ రకాల నిర్మాణాలను 'అపార్ట్‌మెంట్' కింద పరిగణిస్తారు.

నిజానికి, ఈ రంగానికి సంబంధించిన వివిధ నిర్వచనాలను అంటే 'ప్రమోటర్', 'అపార్ట్‌మెంట్', 'రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్' మొదలైన వాటిని రెరా చట్టం నుంచి తీసుకోవటం జరిగింది. అయితే రెరా చట్టం ప్రకారం ప్రమోటర్, రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ అనే నిర్వచనం కేవలం నిర్మాణ రంగానికే కాకుండా ఖాళీ లేదా వ్యవసాయ భూములను ప్లాట్లుగా అంటే 'లే అవుట్స్' గా అభివృద్ధి చేయటానికి కూడా వర్తిస్తుంది. దీంతో ఒక ప్రమోటర్ కొంత స్థలాన్ని లే అవుట్‌గా డెవలప్ చేసి అందులోని స్థలాలను అమ్మటం అనేది జీఎస్‌టీ వర్తించే అంశం అని ఒక వాదన. కానీ, జీఎస్‌టీ చట్టం ప్రకారం పొలాలు, స్థలాలు అంటే ల్యాండ్ అమ్మకం అనేది జీఎస్‌టీలోకి వచ్చే అంశం కాదు. కాబట్టి ఇదే మినహాయింపు లే అవుట్ ప్లాట్లకు కూడా వర్తిస్తుందని ఇంకో ఆలోచన. అయితే, మామూలు స్థలాలను లే అవుట్ ప్లాట్లతో పోల్చకూడదు. ఒక లే అవుట్‌లో డెవలప్‌మెంట్ జరిగే దశలో ప్లాట్లు అమ్మటం అనేది కంప్లీషన్ సర్టిఫికెట్ రాకముందు అపార్ట్‌మెంట్స్‌ను అమ్మటంతో సమానం. ఎందుకంటే ఇందులో కేవలం స్థలం మాత్రమే కాకుండా రోడ్లు, కాలువలు, పార్క్ మొదలగు వాటితో కూడిన డెవలప్‌మెంట్ అనే అంశం ముడిపడి ఉంది. ప్రమోటర్ కేవలం స్థలానికే కాకుండా డెవలప్‌మెంట్‌కు కూడా కలిపి డబ్బులు తీసుకుంటాడు. కాబట్టి ఇది కూడా సర్వీస్ కింద భావిస్తూ తగిన జీఎస్‌టీ చెల్లించాలనే మరొక వాదన ఏర్పడింది.

ఈ గందరగోళాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ రంగానికి సంబంధించి కొన్ని మార్గదర్శకాలు విడుదల చేయటం జరిగింది. దీని ప్రకారం, ఏదేని ఒక లే అవుట్‌లో అమ్మే స్థలాలకు ఎటువంటి జీఎస్‌టీ వర్తించదు. అంటే లే అవుట్ డెవలప్‌మెంట్ జరిగే దశలో కావచ్చు లేదా పూర్తయిన తర్వాత కావచ్చు. ఎప్పుడు అమ్మినా అట్టి ప్లాట్ల మీద ఎలాంటి జీఎస్‌టీ చెల్లించనవసరం లేదు. ఇదే సమయంలో మరొక వివరణ ఇవ్వటం జరిగింది. లే అవుట్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి ఎవరికైనా కాంట్రాక్ట్ ఇస్తే అంటే భూమి చదును చేయటం, అంతర్గత రోడ్లు, కాలువల నిర్మాణం లేదా పార్క్ ఏర్పాటు మొదలైన పనులను ఎవరికైనా కాంట్రాక్ట్ ఇస్తే, సదరు కాంట్రాక్టర్ ఆ మొత్తం మీద జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. అంతేకానీ, ప్లాట్ కొనుగోలుదారుడు ఎలాంటి జీఎస్‌టీ చెల్లించనవసరం లేదు. కాబట్టి ప్రమోటర్, కొనుగోలుదారులు, కాంట్రాక్టర్లు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోవటం అత్యంత ఆవశ్యకం.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,380 ▼	66,350 ▼	96,500 ▼
ముంబై	72,746 ▲	66,635 ▲	90,666 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

23వ తేదీ



హైదరాబాద్	515	విజయవాడ	510
వరంగల్	517	గోదావరి	510
చిత్తూరు	573	విశాఖపట్నం	520

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	119	విజయవాడ	130
వరంగల్	119	గుంటూరు	130
కరీంనగర్	119	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	119	చిత్తూరు	144
కర్నూలు	119	నెల్లూరు	144
విశాఖపట్నం	136	అనంతపురం	130
గోదావరి	130		

రుణమాఫీ చేస్తామంటే విపక్షాలు తట్టుకోలేకపోతున్నాయి

» అన్ని హామీలు నెరవేరుస్తాం: మంత్రి పొంగులేటి



నేలకొండపల్లి, జూన్ 22: ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలను నెరవేర్చుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీకి సిద్ధమవడంతో ప్రతిపక్ష నేతలు తట్టుకోలేకపోతున్నారని, సొల్లు కబుర్లు చెబుతూ గగ్గోలు పెడుతున్నారని విమర్శించారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతన్నల ముఖాల్లో ఆనందం చూడాలనే లక్ష్యంతో జూలై నుంచి రుణమాఫీ కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. రూ.31వేల కోట్లతో అందరికీ రుణమాఫీ చేస్తామని పేర్కొన్నారు. రుణమాఫీ చేయలేమని ప్రతిపక్షం ఎన్నో అవాకులు, చెవాకులు పేలిందని, ఇప్పటికైనా ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడటం మంచిదన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్‌కార్డు, ఆసరా పెన్షన్ ఇస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు.

పామాయిల్ రైతులను ఆదుకోండి

» కేంద్ర మంత్రిని కోరిన మంత్రి తుమ్మల



హైదరాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ సాగు చేస్తున్న రైతులను ఆదుకోవాలని కోరుతూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో శనివారం మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం తాండూరులో పప్పుధాన్యాల బోర్డును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయగా కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి తెలిపారు. రైతులకు అధిక ధరలు అందించి పామాయిల్ సాగును లాభసాటిగా మార్చాలని కోరారు. పామాయిల్ గెలలకు కనీస మద్దతు ధర టన్నుకు రూ.15 వేలు, క్రూడ్ పాం ఆయిల్ ధర టన్నుకు రూ.లక్ష ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే క్రూడ్ పాం ఆయిల్ ధరలు స్థిరీకరించడానికి, దిగుమతి సుంకాన్ని విధించి దేశీయంగా పామాయిల్ సాగు చేస్తున్న రైతులను ప్రోత్సహించాలని చెప్పారు. తెలంగాణలో సుమారు 2 లక్షల ఎకరాలను పామాయిల్ సాగు చేపట్టినట్లు కేంద్రమంత్రికి వివరించారు. ప్రస్తుతం పామాయిల్ ధర టన్నుకు రూ.13,438 ఉందని, రైతులను ప్రోత్సహించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిని రాష్ట్రంలో పర్యటించాలని తుమ్మల ఆహ్వానించగా.. తుమ్మలను కూడా ఢిల్లీకి రావాలని కేంద్రమంత్రి ఆహ్వానించారు.

మా ఊర్లో సగం ఇళ్లకే భగీరథ నీళ్లు

» తాగునీరు అందక ప్రజల ఇబ్బందులు: గుత్తా

» మా ఊర్లోనూ అదే పరిస్థితి: మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ, జూన్ 22: తన సొంత గ్రామంలో మిషన్ భగీరథ నీళ్లు సగం ఇళ్లకే వస్తున్నాయని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శనివారం జరిగిన నల్లగొండ జడ్పీ సర్వసభ్య చివరి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తన స్వగ్రామం నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని ఉరుమడ్లలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తాను అనేక మార్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. మిషన్ భగీరథ పనులకు సంబంధించి కాంట్రాక్టర్ల బిల్లులు రాష్ట్రంలో రూ.400 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసిందని, వెంటనే చిన్న కాంట్రాక్టర్లకైనా బిల్లులు చెల్లించాలని సూచించారు. అంతకు ముందు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాలో మిషన్ భగీరథ ప్రాజెక్టు కోసం 4-5 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా సగం ఇళ్లకు నీళ్లు రావడం లేదని, కనీసం తన స్వగ్రామం బ్రాహ్మణవెల్లంలలోనూ అన్ని ఇళ్లకు నీళ్లు రావడం లేదని అన్నారు. ఫ్లోరైడ్ పీడిత ప్రాంతమైన నల్లగొండను ఫ్లోరైడ్ రహిత జిల్లాగా మార్చడం కోసం గత ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ ప్రాజెక్టు పనులు పూర్తిగా వృథా అయ్యాయని విమర్శించారు. ఏ గ్రామంలోకి వెళ్లినా నీళ్లు రావడం లేదని ప్రజలు చెబుతున్నారని, పలుచోట్ల బోరు నీళ్లు, కృష్ణా జలాలు కలిపి ఇస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. నల్లగొండ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన తేదీ వారం పదిరోజుల్లో ఖరారవుతుందని అన్నారు.

హాస్టళ్లు, క్యాంటీన్లలో నిరంతర తనిఖీలు

» ఫుడ్ సేఫ్టీ ల్యాబ్ పోస్టుల భర్తీకి చర్యలు: దామోదర

హైదరాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లోని హాస్టళ్లు, క్యాంటీన్లు, ఆస్పత్రుల్లోని క్యాంటీన్లలో ఆహార పదార్థాలపై నిరంతర తనిఖీలు చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర వైద్య సేవల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీజీఎస్‌ఎంఎస్‌ఐడీసీ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్(ఐపీఎం), బ్లడ్ బ్యాంకుల బలోపేతంపై శనివారం ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు కార్యాలయంలో మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆహార భద్రతకు సంబంధించి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, నిరంతర తనిఖీలు చేస్తూ పర్యవేక్షణ పెంచామన్నారు. మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ల ద్వారా విస్తృత తనిఖీలు చేయాలన్నారు. ఆహార భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. నాచారంలోని ఫుడ్ సేఫ్టీ ల్యాబ్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలోని అన్ని విభాగాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు.

బోనాల నిర్వహణకు రూ. 20 కోట్లు

» సీఎం చైర్మన్‌గా రాష్ట్రస్థాయి ఉత్సవ కమిటీ: కొండా సురేఖ

హైదరాబాద్, జూన్ 22(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి చైర్మన్‌గా రాష్ట్రస్థాయి బోనాల ఉత్సవ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. తనతోపాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జీ మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు, రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కమిటీలో సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. ఈ సంవత్సరం బోనాల జాతర నిర్వహణకు ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేసిందన్నారు. త్వరలో ప్రారంభం కానున్న బోనాల ఉత్సవ ఏర్పాట్లపై సచివాలయంలోని తన కార్యాలయంలో ఉన్నతాధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా.. హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని ప్రధాన దేవాలయాలతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో.. పట్టువస్త్రాల కొనుగోలు, బోనాల సమాచారం తెలిపే పుస్తకాలముద్రణ, అంబారీకి ఏనుగుల సేకరణ ఇతర ఉత్సవ ఏర్పాట్లకు ఈ నిధులు ఖర్చు చేస్తామన్నారు. కాగా, ఎకో టూరిజం అభివృద్ధికి సమర్థమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్టు సురేఖ తెలిపారు. సచివాలయంలో ఎకోటూరిజం కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 12సర్క్యూట్‌లలో 40ఎకోటూరిజం స్పాట్లను గుర్తించినట్టు తెలిపారు. ఆర్కియాలజీశాఖతో సంప్రదింపులు

ఇంట్లోనే యోగా నేర్పే 'యోగిఫై'

» ఏఐ టెక్నాలజీతో యోగా మ్యాట్ రూపకల్పన

న్యూఢిల్లీ, జూన్ 22: యోగాసనాలు వేసేటప్పుడు సూచనలు ఇవ్వడంతో పాటు భంగిమల్లో ఏర్పడే పొరపాట్లను సరిదిద్దేందుకు ఐఐటీ మండీ ఆధ్వర్యంలో ఏఐ ఆధారిత యోగా మ్యాట్‌ను రూపొందించారు. 'యోగిఫై' పేరుతో పిలిచే ఈ మ్యాట్‌ను ఐఐటీ మండీలోని టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్, డీఎస్‌టీ ఎన్‌ఎమ్- ఐసీపీఎస్ ప్రోగ్రామ్ సహాయంతో విల్లినెస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే స్టార్టప్ సంస్థ అభివృద్ధి పరిచింది. దీనిని శనివారం శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ తరఫున కేంద్రమంత్రులు జైశంకర్, అశ్వినీ వైష్ణవ్, నిర్మలకు అందజేశారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ మ్యాట్ అనేక స్మార్ట్ ఫీచర్లను కలిగి ఉందని, యోగా చేసేటప్పుడు అంచెల వారీగా సూచనలు చేయడంతో పాటు రియల్‌టైమ్ ఫీడ్‌బ్యాక్‌ను అందిస్తుందని దీని సృష్టికర్తలు తెలిపారు. దీని సహాయంతో రకరకాల యోగాసనాలు నేర్చుకోవచ్చని, దీనిని ఇంట్లోని స్మార్ట్ పరికరాలతో అనుసంధానించి వాడుకోవచ్చని వారు సూచించారు.

కాంగ్రెస్‌లోకి గంగుల కమలాకర్?

జోరుగా ప్రచారం.. బీఆర్‌ఎస్‌ను వీడేది లేదంటున్న మాజీ మంత్రి



కరీంనగర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ మంత్రి, కరీంనగర్ శాసనసభ్యుడు గంగుల కమలాకర్ బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. కొద్దిరోజులుగా ఆయన బీజేపీలో చేరుతారంటూ ప్రచారం జరిగినా కాంగ్రెస్ గూటికి చేరేందుకు సర్వం సిద్ధమైందని శనివారం వార్తలు వచ్చాయి. కరీంనగర్ లోక్‌సభ, శాసనసభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన నేపథ్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో బలమైన నేతగా ఉన్న కమలాకర్‌ను పార్టీలోకి తీసుకుంటే బాగుంటుందని పార్టీ ముఖ్యులు ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు జరిగిన ప్రయత్నాలకు సానుకూల స్పందన వచ్చినట్లు చెబుతున్నారు. అయితే, ఈ ప్రచారాన్ని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తీవ్రంగా ఖండించారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ తనను వ్యక్తిగతంగా అప్రతిష్ఠ పాలు చేసేందుకే రాజకీయంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. కొంతకాలం బీజేపీలో చేరుతున్నారంటూ ప్రచారం చేసి, ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్తున్నట్లు చెబుతున్నారని అన్నారు. తాను ఏ పార్టీలోకి వెళ్లేది లేదని, బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. సోమవారమే కాంగ్రెస్‌లో చేరేందుకు ముహూర్తం అంటూ ప్రచారం చేస్తున్నారని చెప్పారు. అయితే, తాను ఆదివారమే విదేశాలకు వెళ్తున్నానని ఆయన తెలిపారు. పది రోజుల పాటు తన విదేశీ పర్యటన ఉంటుందన్నారు.

పార్టీ మారాలని ఒత్తిడి చేస్తున్నారు: పల్లా

హైదరాబాద్/వరంగల్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమం నుంచే రాజకీయాల్లో వచ్చానని, ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీని వీడేది లేదని బీఆర్‌ఎస్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. అమెరికాలోని వర్జీనియాలో 'మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం'లో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లో విలువలు పాటించాలని, గెలిచిన పార్టీలో ఎమ్మెల్యేలు ఐదేళ్లు ఉండాలని అన్నారు. పార్టీ మారాలని రాష్ట్రంలోని ప్రభుత్వం తనపై ఒత్తిడి చేస్తోందన్నారు. ఆర్నెల్లలో నాలుగైదు కేసులు పెట్టారని, విచారణ కమిటీ పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. తనతో పాటు భార్య నీలిమ, కొడుకు అనురాగ్‌లపై కేసులు పెట్టారన్నారు. కేసులకు భయపడనని, ఎదురొడ్డి పోరాడతానని ప్రకటించారు.

శంషాబాద్‌లో హెల్త్ హబ్!

(మొదటిపేజీ తరువాయి)

ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ఆడిటోరియంలో ఆస్పత్రి 24వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచంలో అన్ని రకాల వ్యాధులకు వైద్యం అందించే విధంగా ఆధునిక సంపత్తితో హెల్త్ టూరిజం హబ్ ఉండే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ఏ జబ్బుకైనా హైదరాబాద్ వెళ్లితే వైద్యం దొరుకుతుందనే నమ్మకం కల్పించేలా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తామన్నారు. ప్రపంచంలో పేరు గాంచిన వైద్య సంస్థలకు ఇక్కడ అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఇందులో బసవతారకం ఆసుపత్రికి కూడా కచ్చితంగా చోటు ఉంటుందని చెప్పారు. ఆటలో రాణించాలంటే నైపుణ్యం ఉన్న నాయకుడితో పోటీ పడటం అవసరమని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు తనకు అభివృద్ధి, సంక్షేమంలో చంద్రబాబుతో పోటీ పడి పని చేసే అవకాశం వచ్చిందని చెప్పారు. తాను ముఖ్యమంత్రిగా రోజుకు 12 గంటలు కష్టపడదామని సిద్ధమపడ్డానని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ఇక ఆయన లాగే 18 గంటలు కష్టపడాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. ఇక రాష్ట్రంలో మంత్రులు, అధికారులు కూడా 18 గంటలు పని చేయాల్సిందేనన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు ప్రపంచానికే ఆదర్శంగా తయారు కావాలన్నదే తమ ఆశయమని చెప్పారు.



బసవతారకం ఆస్పత్రిలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఆస్పత్రి చైర్మన్ బాలకృష్ణ

నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం: బాలకృష్ణ

పేదలకు వైద్య సేవలు అందించాలన్న ఎన్టీఆర్ ఆలోచనలు బసవతారకం ఆస్పత్రిలో అమలవుతున్న తీరు చూసి ఆయన ప్రతి ఒక్కరిని స్వర్గం నుంచి ఆశీర్వదిస్తారని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆస్పత్రికి సంబంధించి ఎలాంటి సహకారం కావాలన్నా తమ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ తన కుటుంబానికి రాజకీయ, సంక్షేమ వారసత్వాన్ని ఇచ్చారని, ఆ కుటుంబంలోని మూడో తరం దీనిని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. బాలకృష్ణ మాట్లాడుతూ, అడిగిన వెంటనే పెండింగ్‌లో ఉన్న ల్యాండ్ లీజును పొడిగించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలన్నారు. ఆస్పత్రి మీద నమ్మకంతో ప్రభుత్వాలు తమకు సాయం చేస్తున్నాయని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకొనేలా పని చేస్తామని చెప్పారు. ఆస్పత్రి ఈ స్థాయికి చేరుకోవడానికి ఎందరో దాతలు సహాయ సహకారాలు అందించారన్నారు. త్వరలోనే సేవలను మరింత ఎక్కువ మందికి చేర్చడానికి విస్తరిస్తామని చెప్పారు. సీఈవో డాక్టర్ కృష్ణయ్య, ట్రస్టు బోర్డు సభ్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, నామా నాగేశ్వరరావు, ఎం.భరత్, జేఎస్‌ఆర్ ప్రసాద్, డైరెక్టర్ టీఎస్.రావు పాల్గొన్నారు. ఆస్పత్రి దాతలైన ఎస్‌బీఐ, ఎల్‌ఐసీ, దివ్య శక్తి ఇండియా, అంకుర్, ఐవోసీ, జనచైతన్య హౌసింగ్, టయోట్సు రేర్ ఎర్త్స్ ఇండియా లిమిటెడ్, క్రిటికల్ రివర్ టెక్నాలజీస్ లిమిటెడ్, లియోపిలిజేషన్ సిస్టం ఇండియా లిమిటెడ్, కోర్ కార్బన్ లిమిటెడ్ ప్రతినిధులను మెమెంటోలతో సత్కరించారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోనూ ఇకపై సమీక్షలు

హైదరాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి) : బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అందులో భాగంగానే ఇకపై కీలక సమీక్షలను కమాండ్ కంట్రోల్ సెంటర్ వేదికగానే నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇదే వేదికగా పలు మార్లు ముఖ్యమంత్రి సమీక్షలు నిర్వహించారు. సీఎం నివాసంతోపాటు మంత్రుల నివాస సముదాయానికి దగ్గర్లో ఉండడం, సీఎం రాకపోకల సమయంలో సాధారణ ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉంటుందన్న ఉద్దేశంతోనే ఇక్కడ సమీక్షల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ మేరకు సచివాలయంతోపాటు కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సమీక్షలకు విరివిగా ఉపయోగించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనాన్ని హైదరాబాద్ సీపీ, టీజీ న్యాబ్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో మాత్రమే వినియోగించుకుంటున్నాయి. త్వరలోనే మిగతా కీలక విభాగాలు ఇక్కడి నుంచి పని చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. బోనాలు, గణేష్ ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పూర్తి స్థాయిలో అప్‌డేట్ చేసి ఇక్కడి నుంచే పరిస్థితిని సమీక్షించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

తెలంగాణలో రుణమాఫీ.. చరిత్రాత్మక అడుగు

» కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

» 40 లక్షల కుటుంబాలకు లబ్ధి: ఖర్గే



న్యూఢిల్లీ, జూన్ 22(ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే రైతులు, కార్మికులతో సహా అణగారిన వర్గాల అభివృద్ధికి సంపదను ఖర్చు చేయడం గ్యారెంటీ. రైతుల రుణాలను మాఫీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే ఇందుకు ఉదాహరణ" అని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 40లక్షలపైగా రైతు కుటుంబాలకు రూ.2లక్షల మేర రుణ మాఫీ చేయడం ద్వారా 'కిసాన్ న్యాయ్' సంకల్పాన్ని నెరవేర్చే దిశగా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రాత్మక అడుగు వేసిందని 'ఎక్స్' వేదికగా హర్షం వ్యక్తం చేశారు. చెప్పిందే చేశామని, అదే తమ అలవాటు అని పేర్కొన్నారు. 'కాంగ్రెస్ అధికారంలో ఉంటే దేశ సంపదను సాధారణ ప్రజల కోసమే ఖర్చుపెడుతుంది. పెట్టుబడిదారుల కోసం కాదు. ఇది మా వాగ్దానం' అని స్పష్టం చేశారు. తెలంగాణలో రైతులకు రుణ భారం నుంచి విముక్తి కల్పించాలన్న సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఈ నిర్ణయంతో 40 లక్షలపైగా కుటుంబాలకు లబ్ధి కలగనుందని తెలిపారు. పదహారేళ్ల క్రితం యూపీఏ సర్కారు 3.73 కోట్ల మంది రైతులకు రూ.72వేల కోట్ల వ్యవసాయ రుణాలు, వడ్డీలను మాఫీ చేసిందని 'ఎక్స్' వేదికగా ఆయన గుర్తు చేశారు. కాగా, తెలంగాణలో అన్ని వాగ్దానాలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ తెలిపింది. రైతులకు రుణమాఫీ చేస్తామంటూ వరంగల్ వేదికగా రాహుల్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ట్వీట్‌ను కాంగ్రెస్ రీట్వీట్ చేసింది.

నాటి ఒప్పందాల వల్లే ఎఫ్‌డీఐలో భారీ వృద్ధి

» 100% మించి పెట్టుబడులు: కేటీఆర్



హైదరాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆయా సంస్థలు కుదుర్చుకున్న ఒప్పందాలు ఇప్పుడు కార్యరూపం దాల్చడంతోనే ఎఫ్‌డీఐలో భారీ వృద్ధి నమోదైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ 2023లో విదేశీ సంస్థాగత పెట్టుబడు(ఎఫ్‌డీఐ)ల్లో 130% వృద్ధి సాధించామని శనివారం 'ఎక్స్'లో వేదికగా ఆయన పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌డీఐలు దేశంలో భారీగా తగ్గినప్పటికీ తెలంగాణ నుంచి 100% మించి పెట్టుబడులు సాధించామన్నారు. ఇందుకు సంబంధించి ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 2024లో దేశానికి ఎఫ్‌డీఐ నిధులు తగ్గాయని, కానీ గుజరాత్, తమిళనాడు, తెలంగాణ మాత్రం అంతకు ముందుకంటే ఎక్కువ పెట్టుబడులు తీసుకురావడంలో విజయం సాధించాయని పేర్కొన్నారు. అమెజాన్ సంస్థ వెబ్ సేవలకోసం రూ.36,300 కోట్లు, మైక్రోసాఫ్ట్ రూ.16 వేల కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టిన కారణంగానే ఇది సాధ్యమైందని కేటీఆర్ తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలోనే ఈ పెట్టుబడులు పెట్టేందుకు ఆయా కంపెనీలు ఒప్పందం కుదుర్చుకున్నాయని ఆయన చెప్పారు.

57కు పెరిగిన కల్తీసారా మృతుల సంఖ్య

చెన్నై, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కళ్లకుర్చి జిల్లా కరుణాపురంలో కల్తీసారా తాగిన కారణంగా మరణించిన వారి సంఖ్య శనివారం సాయంత్రానికి 57కు పెరిగింది. ఈ నెల 18వ తేదీన కరుణాపురంలో ఇద్దరి అంత్యక్రియలకు వెళ్లిన బంధువులు, స్నేహితులు అక్కడ కల్తీసారా తాగి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. 200 మందికి పైగా కళ్లకుర్చి, విల్లుపురం, పుదుచ్చేరి, సేలం ఆసుపత్రుల్లో చేరగా, చికిత్స ఫలించక శుక్రవారం నాటికి 52 మంది మరణించారు. శనివారం మరో ఐదుగురు మృతి చెందగా, ఆ సంఖ్య 57కు చేరింది. కాగా, ఆసుపత్రుల్లో మరో 25 మంది పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యమే ఇంతమంది మృతికి కారణమైందని, ఇందుకు నైతిక బాధ్యత వహించి ముఖ్యమంత్రి స్టాలిన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కూడా ప్రతిపక్ష అన్నాడీఎంకే అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసింది. ఇదిలా ఉండగా కళ్లకుర్చి ఘటనకు సంబంధించి ఇప్పటి వరకూ 8 మందిని అరెస్టు చేసిన సీబీసీఐడీ పోలీసులు.. చిన్నదురై, జోసఫ్‌రాజా, రామర్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. సారాలో అత్యధిక మోతాదులో మిథనాల్‌ను కలిపింది ఈ ముగ్గురేనని దర్యాప్తులో తేలడంతో వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాగా, కల్తీసారా వ్యాపారులపై కఠిన చర్యలు చేపట్టాలని సీఎం స్టాలిన్ అన్ని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

నిబంధనల పేరుతో కోతలుండవు!

» గత నిబంధనలతోనే రుణమాఫీ

» గ్రామీణ బ్యాంకులు, సొసైటీల్లోని గోల్డ్ రుణాలకూ వర్తింపు

» త్వరలోనే విధివిధానాల జీవో: పొన్నం



హైదరాబాద్, హుస్నాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ విషయంలో ప్రత్యేకంగా కొత్త నిబంధనల పేరుతో కోతలు విధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం లేదని అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. రాష్ట్రంలో రెండుసార్లు రుణమాఫీ అమలైంది. అప్పుడు రెండుసార్లు కలిపి సగంసగమే మాఫీ చేసినా రూ.21వేల కోట్లు నిధులు ఖర్చయ్యాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఒకేసారి రూ.31వేల కోట్ల రుణాలను మాఫీ చేయాలని భావిస్తోంది. ఈ మేరకు కొత్త రుణమాఫీలో కోతలు కోసం కొత్త నిబంధనలేమీ తీసుకురాకపోవచ్చునని అంటున్నారు. గతంలో రుణమాఫీ అర్హతకు ఉన్న నిబంధనలనే అమలుచేయాలనే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ఇందుకోసం మంత్రులు, అధికారుల స్థాయిల్లో చర్చ జరుగుతోంది. రుణమాఫీ విధివిధానాలకు సంబంధించిన వివరాలతో కూడిన జీవో త్వరలోనే విడుదలకానుంది. రాష్ట్రంలో వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న రైతులకు రూ.2లక్షల మేర రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వ తేదీని కటాఫ్ తేదీగా కూడా ప్రకటించారు. ఈ క్రమంలోనే రుణమాఫీని ఎవరెవరికి వర్తించాల నేదా నిపై అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇందుకోసం ముందుగా భూమి పాస్‌బుక్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులను ప్రామాణికంగా తీసుకోనున్నట్లు అధికారులు చెప్పారు. అదే సమయంలో ఆయా బ్యాంకుల్లో భూమి పాస్‌బుక్ ఆధారంగా తీసుకున్న బంగారు రుణాలను కూడా అధికారులు పరిగణనలోకి తీసుకుని మాఫీని వర్తించాలని భావిస్తున్నారు. ఇప్పటికే బ్యాంకుల నుంచి సేకరించిన వివరాల్లో బంగారు రుణాలు ఎన్ని ఉన్నాయనేదానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. పీఎం కిసాన్‌లో అనర్హులుగా ఉన్న వారిలోనూ చాలామందికి రుణమాఫీ వర్తించనున్నట్లు నిధుల అంచనాతో స్పష్టమవుతోంది.

బంగారం లోన్లపై పరిశీలన..

రాష్ట్ర ప్రభుత్వం చేయబోయే రైతుల రుణమాఫీ విషయంలో బంగారం రుణాలను ప్రత్యేకంగా చూడనున్నట్టు సమాచారం. గ్రామీణ బ్యాంకులు, సొసైటీ బ్యాంకుల్లో భూమి పాస్‌బుక్ ఆధారంగా తీసుకున్న రుణాలకు మాఫీని వర్తించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఇందు కోసం రైతులు ఏయే బ్యాంకుల్లో ఎంతమేర బంగారం పెట్టి రుణాలు తీసుకున్నారనే విషయాలను తేల్చనున్నారు. అనంతరం రూ.2లక్షల వరకు తీసుకున్న రుణమైతే దానికి మాఫీని వర్తింపజేయనున్నారు. పట్టణ, నగర ప్రాంతాల్లో స్థిరపడిన భూయజమానులు వ్యవసాయేతర అవసరాల కోసం బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకుంటే మాఫీ వర్తించదు. ఉదాహరణకు ఖమ్మం జిల్లాలోని కొత్తూరుకు చెందిన యాదగిరికి 4ఎకరాల భూమి ఉంది. యాదగిరి ప్రైవేటు ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లోనే స్థిరపడ్డాడు. అయితే తన భూమి పాస్‌బుక్‌ను హైదరాబాద్‌లోని బ్యాంకులో పెట్టి దానిపై గోల్డ్ లోన్ తీసుకుంటే మాత్రం అతనికి రుణమాఫీ వర్తించదు. ఒక వేళ యాదగిరి హైదరాబాద్‌లోనే ఉంటూ.. తన గ్రామమైన కొత్తూరు పరిధిలోని బ్యాంకులో వ్యవసాయం కోసం భూమి పాస్‌బుక్‌పై బంగారపు రుణం పొందితే రుణమాఫీ వర్తిస్తుంది. ఆ గోల్డ్ లోన్‌ను గ్రామీణ బ్యాంకులు, లేదా సొసైటీ బ్యాంకులోనే తీసుకుని ఉండాలి. కాగా గతంలోనూ బంగారం రుణాలపై ఇలాంటి నిబంధనలే ఉన్నాయి. మొత్తంగా అర్హులైన రైతులందరినీ రుణవిముక్తులను చేసి, ఆర్థికంగా తోడ్పాటునివ్వాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉంది.

మహత్తర ఘట్టం: పొన్నం

త్వరలోనే రైతుల రూ. 2లక్షల రుణమాఫీపై విధివిధానాలతో పాటు జీవో వెలువడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏకకాలంలో రైతులకు 2 లక్షల రుణమాఫీ చేయనుండటం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. కేబినెట్ మంత్రిగా ఈ మహోత్తర ఘట్టంలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందన్నారు. రుణమాఫీపై నిర్ణయం తీసుకున్నందుకు రైతు బిడ్డగా సీఎం రేవంత్, సహచర మంత్రులకు ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా రుణమాఫీ సంబరాలు

» సీఎం, మంత్రులకు ధన్యవాదాలు తెలపాలని శ్రేణులకు టీపీసీసీ పిలుపు

» సీఎం చిత్రపటానికి పాలాభిషేకాలు

హైదరాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఏకకాలంలో రూ.2 లక్షల మేరకు రైతుల రుణాలను మాఫీ చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల, జిల్లా కేంద్రాల్లో శని, ఆదివారాల్లో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించాలంటూ పార్టీ శ్రేణులకు టీపీసీసీ పిలుపునిచ్చింది. క్యాబినెట్ తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని, రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ ఘనతను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించింది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలుపుతూ పత్రికా సమావేశాలు నిర్వహించాలని దిశానిర్దేశం చేసింది. ఈ మేరకు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ఓ ప్రకటన విడుదల చేశారు. 2004లో ఇచ్చిన మాట ప్రకారం సోనియాగాంధీ.. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని, అలాగే 2022లో రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఏక కాలంలో రూ. 2 లక్షల మేరకు రుణమాఫీ చేయాలని తెలంగాణ సర్కారు నిర్ణయించిందని పేర్కొన్నారు. ఆగస్టు 15 కల్లా రైతు రుణమాఫీ చేసి తీరుతామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ మేరకు రూ.31 వేల కోట్ల మేరకు రుణమాఫీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు. కాగా.. టీపీసీసీ పిలుపు మేరకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు స్వీట్లు పంచుతూ, టపాసులు కాలుస్తూ సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకాలు జరిపి.. సీఎం, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. గాంధీభవన్‌లోనూ కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. కిసాన్ కాంగ్రెస్ కార్యకర్తలు టపాసులు కాల్చి, స్వీట్లు పంచారు. ఇందులో కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశంలో అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మరో ఉప ఎన్నిక రాబోతోందన్నారు. గతంలో ప్రకటించిన మేరకు స్పీకర్ ఫార్మాట్‌లో మాజీ మంత్రి హరీశ్ రావు తన రాజీనామా పత్రాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కాగా, ఎన్టీపీసీ బూడిద తరలింపునకు సంబంధించి మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేసిన ఆరోపణలు అర్థరహితమని కాంగ్రెస్ సీనియర్ నేతలు పల్లె లక్ష్మణ్‌గౌడ్, ఆరెపల్లి మోహన్ కొట్టిపారేశారు. ఒక్కో లారీలో 75టన్నుల మేర బూడిదను తరలిస్తున్నట్లుగా ఆయన చెప్పారని, కానీ అంత సామర్థ్యం కలిగిన లారీలో దేశంలోనే లేవన్నారు. పొన్నంను అవమానిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా రుణమాఫీ: శ్రీహరి

కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాతి అని, మాటిస్తే దానిపై నిలబడుతుందని మరోసారి రుజువైందని కాంగ్రెస్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సీఎల్పీ కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ.. రూ.31 వేల కోట్ల మేరకు రుణమాఫీ చేస్తున్న ఘనత రేవంత్ ప్రభుత్వానిదేనన్నారు. రైతుల పక్షాన సీఎం రేవంత్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. సత్యనారాయణ మాట్లాడుతూ ఏకకాలంలో రుణమాఫీ చేయడం కేసీఆర్‌కు చేతకాలేదని, ఆగస్టు 15 కల్లా తమ ప్రభుత్వం చేసి తీరుతుందన్నారు.

టైమంటే.. టైమే..9 కల్లా రావాల్సిందే

» 15 నిమిషాలే గ్రేస్ పీరియడ్.. సీఎల్‌లో కోత తప్పదు

» కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీవోపీటీ విభాగం హెచ్చరికలు

న్యూఢిల్లీ, జూన్ 22: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఆఫీసుకు హాజరయ్యే విషయంలో సమయపాలనను ఖచ్చితంగా పాటించాల్సిందే. టైమంటే టైముకు రావాల్సిందే. ట్రాఫిక్ జామ్ అయింది.. బండి రిపేర్ వచ్చింది.. మార్నింగ్ మెళకువ రాలేదు. వంటి కుంటి సాకులు చెప్పేందుకు వీల్లేదు. ఖచ్చితంగా ఉదయం 9 గంటలకల్లా ఆఫీసుకు వచ్చి పంచ్ వేయాల్సిందే. మహా అయితే.. మరో 15 నిమిషాలు గ్రేస్ పిరియడ్ కింద ఆలస్యం కావొచ్చు. అది కూడా రోజూ కాదు. ఎప్పుడైనా అత్యవసరమైతే. తరచుగా వినియోగించుకుంటే కూడా ఇబ్బందే. ఇక, 9.15 గంటల తర్వాత ఆఫీసుకువచ్చేవారికి క్యాజ్‌వల్ లీవ్(సీఎల్)లో ఆఫ్‌డేని సెలవుగా పరిగణించి కోతపెడతారు. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్, ట్రైనింగ్ విభాగం ఆదేశాలు జారీ చేసింది. ఆఫీసుకు ఆలస్యంగా వచ్చే వారిని కట్టడి చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ఈ ఆదేశాలు సీనియర్ ఉద్యోగుల నుంచి జూనియర్ ఉద్యోగుల వరకు అందరికీ వర్తిస్తాయని ఆదేశాల్లో పేర్కొంది. అందరూ బయోమెట్రిక్ అటెండెన్స్‌ను వినియోగించుకోవాలని కోరింది. కరోనా తర్వాత నాలుగేళ్లుగా ఉద్యోగులు సమయ పాలన పాటించడంలేదన్న ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలోనే ఈ చర్యలు తీసుకున్నట్టు తెలిపింది. అంతేకాదు.. ఎవరైనా ఉద్యోగి ఏ కారణంతో అయినా.. ఆఫీసుకు రాలేకపోతే.. ముందుగానే సంబంధిత శాఖాధిపతికి సమాచారం అందించాలని స్పష్టం చేసింది. ముందుగా తెలిపిన వారికే సీఎల్ వర్తిస్తుందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉదయం 9గంటల నుంచి పనివేళలు ప్రారంభమవుతాయి. సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగుతాయి. అయితే.. జూనియర్ అధికారులు ఈ సమయపాలనను పాటించకుండా ఆఫీసులకు ఆలస్యంగా వస్తున్నారని, దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్, ట్రైనింగ్ విభాగం తాజా ఆదేశాలు జారీ చేసింది.

జాతీయస్థాయిలో ఉత్తమ పాత్రికేయులకు ఏటా రామోజీ స్మారక అవార్డులు..

» టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

పంజాగుట్ట, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఉత్తమ పాత్రికేయులకు రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకుడు దివంగత రామోజీరావు పేరిట ఏటా స్మారక అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఏపీ టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నిఖిల కలిశెట్టి విద్య, వైద్య, చారిటబుల్ ట్రస్టు తరపున ఈ అవార్డులను అందజేస్తామన్నారు. త్వరలోనే సీనియర్ పాత్రికేయులతో కమిటీ ఏర్పాటు చేసి, ఆంగ్ల, హిందీ భాషలతో పాటు దేశవ్యాప్తంగా ప్రాంతీయ భాషల్లో పనిచేస్తున్న ఉత్తమ పాత్రికేయులను గుర్తించి అవార్డులను అందజేస్తామని తెలిపారు. రామోజీ స్మారక అవార్డుకు ఎంపికైన వారికి రూ.20 వేల నగదుతో పాటు మెమెంటో, ప్రశంసాపత్రాన్ని అందజేస్తామన్నారు. సమావేశంలో శ్రీకాకుళం జిల్లా బీజేపీ నేత సిరిపురపు తేజేశ్వరరావు, సురేశ్ చౌదరి, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

హక్కులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి

» మహిళా ఉద్యమాలు మరింత ఉధృతం కావాలి

» పీవోడబ్ల్యూ అర్ధ శతాబ్ది వార్షికోత్సవ సభలో రమా మేల్కొటే

బర్కత్‌పుర, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్ ఆఫ్ వుమెన్(పీవోడబ్ల్యూ) అర్ధ శతాబ్ది వార్షికోత్సవ సభ శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో పలువు మహిళా సామాజిక కార్యకర్తలు, ఉద్యమకారులు పాల్గొన్నారు. దేశంలో హింస పెరిగిపోతోందని ప్రొఫెసర్ రమా మేల్కొటే ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు రాజ్యాంగం, హక్కులపై అవగాహన పెంచుకోవాలని, పాలకులను ప్రశ్నించాలని చెప్పారు. మహిళా ఉద్యమాలు మరింత ఉధృతం కావాలని, ఫాసిజం, మనువాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. మహిళా సంఘాలు ఐక్యంగా ముందుకు సాగితేనే వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమవుతాయని ప్రొఫెసర్ కాత్యాయని అన్నారు. ఢిల్లీకి చెందిన రచయిత్రి, ఇండిపెండెంట్ జర్నలిస్ట్ బాషాసింగ్ మాట్లాడుతూ.. బీజేపీ, ఆరెస్సెస్‌లు రాజ్యాంగాన్ని మార్చి మనువాదాన్ని తీసుకురావడానికి కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమానికి అంబిక అధ్యక్షత వహించారు. పీవోడబ్ల్యూ అర్ధ శతాబ్ది వార్షికోత్సవ సమన్వయ కమిటీ సభ్యులు సంధ్య, ఝాన్సీ, చంద్ర అరుణ, అరుణోదయ విమలక్క, సామాజికవేత్త సజయ, రమ, శ్రీదేవి, సిస్టర్ లెస్సి తదితరులు ఇందులో పాల్గొన్నారు.

2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది? : హరీశ్

హైదరాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి ఇస్తామన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వగా, కాంగ్రెస్ పార్టీ అంతకంటే ఎక్కువ ఉద్యోగాలు ఇస్తుందని నమ్మి మీకు నిరుద్యోగులు ఓటేశారు. మీరు అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటింది. కొత్తగా ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు. మిమ్మల్ని నమ్మిన యువత రోడ్డున పడింది" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. నిరుద్యోగుల ఆందోళనలను, ఆవేదనను ఈ ప్రభుత్వం అర్థం చేసుకోలేదని పేర్కొన్నారు. క్యాబినెట్ సమావేశంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీల గురించి కనీసం చర్చ కూడా చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చారే తప్ప కొత్తగా ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వలేదన్నారు. గ్రూప్-1, డీఎస్సీ ఉద్యోగాల కోసం చేపట్టిన ప్రక్రియ ఉద్యోగార్థులకు ఇబ్బందికరంగా మారిందని ఆయన పేర్కొన్నారు.



ఏపీ సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు చెబుతున్న వీఐటీ చాన్సలర్ జి.విశ్వనాథన్, వీఐటీ ఉపాధ్యక్షులు జీవీ సెల్వం

చంద్రబాబుతో వీఐటీ అధినేతల భేటీ

చెన్నై, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతో ప్రపంచ ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీల్లో ఒకటైన వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) వ్యవస్థాపకులు, చాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్, ఉపాధ్యక్షులు డాక్టర్ జీవీ సెల్వం భేటీ అయ్యారు. ఏపీ సచివాలయంలో చంద్రబాబును కలుసుకుని నాలుగవసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆధునిక అమరావతి నగర సృష్టికర్త అయిన చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

సింగరేణిపై విచారణ జరిపించాలి

» గత పాలకుల అక్రమాలను నిగ్గు తేల్చాలి

» పారదర్శకంగా గనుల వేలం: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణిలో జరిగిన ఆర్థిక విధ్వంసం, దోపిడీ, రాజకీయ జోక్యంపై న్యాయ విచారణ జరిపించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. "సింగరేణిలో ఎంత భూ దోపిడీ జరిగింది..? సీఎస్ఆర్ నిధులు ఎక్కడెక్కడ వినియోగించారు..? సంస్థ బిల్లులు విలాసవంతమైన కార్యక్రమాలకు ఎలా వినియోగించారు..? వంటి వాటిపై సమగ్ర దర్యాప్తు జరపాలి. సింగరేణిలో కేంద్రం వాటా 49 శాతం ఉంది. కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రిగా ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తా" అని అన్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. సింగరేణిపై కేసీఆర్ కుటుంబం మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు. పదేళ్ల కిందట రూ.3,500 కోట్ల డిపాజిట్లతో ఉన్న సింగరేణిని దివాళా దశకు చేర్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని మండిపడ్డారు. 2015లో సింగరేణికి ఒడిశాలోని నైనీ బ్లాకును మంజూరు చేస్తే ఆ రాష్ట్ర సీఎంతో ఎందుకు చర్చించలేదని కేసీఆర్‌ను నిలదీశారు. బీజేపీకి వ్యతిరేకంగా కూటమి కట్టేందుకు అప్పటి ఒడిశా సీఎంతో చర్చించేందుకు సమయం ఉంటుంది గానీ.. నైనీ బ్లాక్ గురించి మాట్లాడేందుకు కేసీఆర్‌కు సమయం దొరకలేదని విమర్శించారు. "కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు సింగరేణిలో విపరీతమైన రాజకీయ జోక్యం చేసుకున్నారు. ఎవరికి తోచినంత వాళ్లు దోచుకున్నారు. కేసీఆర్ మితిమీరిన జోక్యంతో సింగరేణిని అప్పులపాలు చేశారు. సింగరేణి అధికారులు ఫైళ్లతో కేసీఆర్ కుటుంబ సభ్యులు, మంత్రుల చుట్టూ తిరిగే పరిస్థితి తెచ్చారు. కేసీఆర్ కుటుంబం సింగరేణిని రాజకీయ క్షేత్రంగా వాడుకుంది. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రూ.30వేల కోట్లు బకాయి పడింది. ఈ పాపం బీఆర్ఎస్‌దే. సింగరేణి పురోగతిపై త్వరలో సమీక్ష నిర్వహిస్తాం" అని కిషన్‌రెడ్డి అన్నారు.



అంతా పారదర్శకమే..

"సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా అవినీతికి తావులేకుండా, పారదర్శకంగా కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలం వేస్తోంది. ఇప్పటి వరకు 9 రౌండ్లలో 107 బొగ్గు గనుల వేలం జరిగింది. దీంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు సుమారు రూ.37 వేల కోట్ల ఆదాయం వచ్చింది. గనుల వేలం ద్వారా వచ్చే రాయల్టీలో కేంద్రం రూపాయి కూడా తీసుకోదు. ఒడిశాలో ఏటా రూ.36 వేల కోట్ల చొప్పున అక్కడి రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ వస్తోంది. తెలంగాణలో కూడా నాలుగు సున్నపురాయి గనులకు సంబంధించి వేలం నిర్వహించాలని కేంద్రం.. రాష్ట్ర ప్రభుత్వాన్ని 2016 నుంచే కోరుతూ వస్తోంది. అయితే, బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ ప్రక్రియను చేపట్టకపోవడం వల్ల రూ.2,500కోట్ల ఆదాయాన్ని కోల్పోయింది. ఇప్పుడు ఆ వేలాన్ని నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరాం. తెలంగాణలో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సర్వే జరుపుతాం. బొగ్గు ఉత్పత్తిని పెంచుకునేలా, ఉపాధి అవకాశాలను మరింత పెంచేలా చర్యలు తీసుకుంటాం. నీట్ పేపర్ ఎక్కడా లీక్ కాలేదు. ఆరోపణలపై దర్యాప్తు జరుగుతోంది" అని కిషన్‌రెడ్డి తెలిపారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్..

"అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగ నియామకాలు చేస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ విస్మరించింది. 6 గ్యారెంటీలకే గ్యారెంటీ లేకుండా పోయింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం తప్ప మిగతా హామీలను తుంగలో తొక్కారు. విద్యార్థి నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర యువ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా చేస్తే విచక్షణారహితంగా పోలీసులు దాడి చేయడం సరి కాదు" అని కిషన్‌రెడ్డి అన్నారు.

కేసీఆర్ ఇంటికి ఈడీ రాక తప్పదు: రఘునందన్

గొర్రెల పంపిణీ స్కాంలో కేసీఆర్ ఇంటికి ఈడీ రాక తప్పదని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. గొర్రెల స్కాం, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో ఇరుక్కున్న అధికారులంతా కేసీఆర్ పేరే చెబుతున్నారని తెలిపారు. తెలంగాణ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు కప్పర ప్రసాద్‌రావు అధ్యక్షతన శనివారం జరిగిన మీట్ ద ప్రెస్‌లో రఘునందన్ మాట్లాడారు. బీఆర్ఎస్.. టైటానిక్ షిప్‌లా చరిత్రలో మిగిలిపోనుందని అన్నారు. ఐటీఐఆర్ గురించి, కాంగ్రెస్ నేత జగ్గారెడ్డికి అవగాహన లేదని ఆయన విమర్శించారు.

రేపు కీలక ఖనిజ గనుల మొదటి విడత బిడ్డర్ల పేర్ల వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 22: కీలకమైన, వ్యూహాత్మక ఖనిజ గనుల వేలం మొదటి విడతలో భాగంగా గనులను సొంతం చేసుకున్న బిడ్డర్ల పేర్లను కేంద్రం సోమవారం ప్రకటించనుంది. ఇలాంటి గనులకు సంబంధించిన నాలుగో విడత వేలం ప్రారంభం సందర్భంగా బిడ్డర్ల పేర్లను ప్రకటించాలని నిర్ణయించారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, ఆ శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే ఇక్కడ కీలక, వ్యూహాత్మక ఖనిజ గనుల నాలుగో విడత వేలాన్ని ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన కార్యక్రమంలో మొదటి విడతలో గనులు గెలుచుకున్న బిడ్డర్ల పేర్లను ప్రకటించనున్నట్టు గనుల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. మొదటి విడతలో అమ్మకానికి పెట్టిన 20 గనుల్లో 13 గనుల వేలాన్ని ఇంతకు ముందు ప్రభుత్వం రద్దు చేసింది. ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడమే ఇందుకు కారణం. 20 గనులను వేలానికి పెట్టగా 18 గనులకు 56 ఫిజికల్, 56 ఆన్‌లైన్ బిడ్స్ వచ్చాయి. రద్దు చేసిన 11 బ్లాకుల్లోని ఏడు బ్లాకులను మూడో విడత కింద వేలానికి నోటిఫై చేశారు. ఇక రెండో విడత వేలంలో ఆరు గనులను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేశారు. కీలకమైన గనులు దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధితోపాటు దేశ ఖనిజ భద్రతలో కీలక పాత్ర పోషిస్తాయి.

సింగరేణి దివాలాకే బొగ్గు బ్లాకుల వేలం

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

హైదరాబాద్/ఖమ్మం సంక్షేమ విభాగం/కాకతీయఖని/రుద్రంపూర్: జూన్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి మణిహారంగా ఉన్న సింగరేణి సంస్థను దివాలా తీయించేలా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం పాట ప్రారంభించిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం విమర్శించారు. బొగ్గు బ్లాకులను ప్రైవేటుపరం చేసి, తరువాత సింగరేణి మూతపడేలా కేంద్రం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి హైదరాబాద్‌లోనే ఈ ప్రక్రియ ప్రారంభించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. వేలం పాట ప్రారంభ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క పాల్గొనడం ఆశ్చర్యం కలిగించిందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక వైపు బొగ్గు గనులను వేలం వేస్తూ మరోవైపు సింగరేణిని ప్రైవేటీకరణ చేయబోమని కిషన్ రెడ్డి బుకాయిస్తున్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీకి 8 పార్లమెంటు స్థానాలు ఇస్తే ఆ పార్టీ ప్రజలకు ఇచ్చే బహుమతి ఇదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టిన గనులను కూడా సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ఈ నెల 28, 29 తేదీల్లో అన్ని జిల్లాల్లో ధర్నాలు చేయాలని సీపీఎం శ్రేణులకు పిలుపునిచ్చారు. సింగరేణిని కాపాడుకునేందుకు కేంద్రంతో చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ సంపద అయిన బొగ్గు గనులను ప్రైవేటీకరిస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. గతంలో బొగ్గు బావుల ప్రైవేటీకరణకు సహకరించిన బీఆర్ఎస్ ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం నిరసన డ్రామాలాడుతోందన్నారు. బొగ్గు బావుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో కొత్తగూడెం, భూపాలపల్లిలో నిరసనలు చేపట్టారు.



సింగరేణి కేంద్ర కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు

కిషన్ రెడ్డి ఇంటి ముట్టడికి యత్నం

అడ్డుకున్న పోలీసులు.. పలువురి అరెస్ట్.. నీట్‌లో అక్రమాలపై విద్యార్థుల ఆందోళన

» న్యాయ విచారణ జరిపించాలి: ఆర్.కృష్ణయ్య

» బీసీ సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ



కిషన్‌రెడ్డి నివాసానికి సమీపంలో భూమన్నగల్లీ వద్ద విద్యార్థి యువజన సంఘాల నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

బర్కత్‌పుర/తార్నాక, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): నీట్‌ను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని, అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో బర్కత్‌పురలోని కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి ఇంటిని ముట్టడికి యత్నించారు. కేంద్ర మంత్రి నివాసముంటున్న లెజెండ్ అపార్ట్‌మెంట్ గేటును తోసుకొని దూసుకెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. డబ్బు కోసమే నీట్‌లో అక్రమాలకు పాల్పడ్డారంటూ విద్యార్థి, యువజన సంఘాల నేతలు ఫేక్ నోట్లను పైకి ఎగురవేసి నిరసన తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు పలువుర్ని పోలీసులు అరెస్ట్ చేసి నల్లకుంట పీఎస్‌కు తరలించారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత విడుదల చేశారు. కిషన్ రెడ్డి అపాయింట్‌మెంట్ కోరితే ఇవ్వలేదని, దాంతో ఆయన ఇంటిని ముట్టడించేందుకు వెళ్లామని బల్మూరి చెప్పారు. నీట్‌లో అక్రమాలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం బర్కత్‌పుర ఆర్టీసీ బస్ డిపో వీధిలో బీసీ సంక్షేమ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ విద్యార్థులతో కలిసి ఉస్మానియా యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయం ఆవరణలో నిరాహార దీక్ష చేపట్టారు. ప్రధాని మోదీ ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమన్నారు. ఓయూ ప్రొఫెసర్లు కాశీం, కొండ నాగేశ్వర్‌రావు విద్యార్థులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. నీట్‌లో అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. పోలీసుల అత్యుత్సాహం వల్ల ఆందోళనలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ గాయపడ్డారని తెలిపారు.

అమెరికాలో ఉద్యోగి హైదరాబాద్‌లో దొంగ

» మేడ్చల్‌లో నగల దుకాణంలో దోపిడీకి యత్నించిన ఇద్దరి అరెస్టు

హైదరాబాద్ సిటీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): అమెరికా, చైనా దేశాల్లో ఉద్యోగం చేసిన ఓ వ్యక్తి హైదరాబాద్‌లో వ్యాపారం చేసి నష్టపోయి ర్యాపిడో డ్రైవర్‌గా మారాడు. ఆర్థిక కష్టాలను అధిగమించేందుకు చివరికి దొంగగా మారాడు. ఓ నగల దుకాణంలో దోపిడీకి యత్నించి పోలీసులకు చిక్కాడు. మేడ్చల్‌లోని నగల దుకాణంలో ఇటీవల దోపిడీకి యత్నించి పరారైన నజీమ్ అజీజ్ కొఠాడియా (36), షేక్ సోహైల్‌ను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి శనివారం విలేకరులకు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన నజీమ్ అజీజ్ కొఠాడియా చదువు పూర్తయ్యాక ఆఫ్రికా, చైనా, అమెరికాల్లో ఉద్యోగాలు చేశాడు. అమెరికా నుంచి హైదరాబాద్ వచ్చిన అజీజ్ స్థానికంగా వ్యాపారం చేసి తీవ్రంగా నష్టపోయాడు. కుటుంబపోషణ కష్టంగా మారడంతో ర్యాపిడో డ్రైవర్‌గా చేశాడు. సరైన ఆదాయం రాకపోవడంతో దొంగతనానికి సిద్ధమయ్యాడు. చాదర్‌ఘాట్‌లోని ఓ నగల దుకాణంలో దొంగతనం చేసిన అజీజ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. అక్కడ తనకు పరిచయమైన షేక్ సోహైల్‌తో కలిసి జైలు నుంచి విడుదలయ్యాక మళ్లీ చోరీ చేసేందుకు పథకం వేసుకున్నాడు. జైలు నుంచి విడుదలైన అజీజ్, సోహైల్ నగల దుకాణంలో చోరీ చేసేందుకు పలు ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి మేడ్చల్‌లోని ఓ దుకాణాన్ని ఎంపిక చేసుకున్నారు. ముందుగా ఓ బైక్‌ను చోరీ చేశారు. ఈ నెల 20న ముఖానికి మాస్కు, హెల్మెట్ ధరించి మేడ్చల్‌లోని జగదాంబ జ్యువెలర్స్ దుకాణంలోకి వెళ్లి యజమానికి కత్తి చూపించి నగల కోసం బెదిరించారు. దుకాణ యజమాని కుమారుడు కేకలు వేస్తూ ఎదురుదాడికి యత్నించడంతో అక్కడి నుంచి పరారయ్యారు. ఇదంతా 40 సెకండ్లలోనే జరిగింది. మేడ్చల్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే రోడ్డు పక్కన బైక్ వదిలేసి పారిపోయారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు చోరీకి యత్నించిన బైక్ ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్టు చేశారు.

ఇద్దరు ఇన్‌స్పెక్టర్లపై సస్పెన్షన్ వేటు

» మరో ముగ్గురు ఐజీ ఆఫీసుకు అటాచ్

» అవినీతి, అధికార దుర్వినియోగం, విధుల్లో నిర్లక్ష్యమే కారణం..

» మల్టీజోన్-1 ఐజీ రంగనాథ్ ఉత్తర్వులు

హైదరాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలకు తోడు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను సస్పెండ్ చేయడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన మరో ముగ్గురినీ ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈ మేరకు మల్టీజోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని సత్తుపల్లి గ్రామీణ ప్రాంతంలో పేకాట కేంద్రాలు నిర్వహిస్తునట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులందాయి. ఈ నేపథ్యంలోనే పేకాట కేంద్రాలపై పోలీసులు దాడులు నిర్వహించి పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. అయితే వారిని విచారించగా.. సత్తుపల్లి గ్రామీణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశం పేకాట కేంద్రాలను ప్రోత్సహించేవాడని తేలింది. పోలీసు దాడులకు సంబంధించి నిర్వాహకులకు ముందస్తు సమాచారమిచ్చేవాడని.. అందుకు ప్రతిఫలంగా పెద్ద మొత్తంలో లంచం తీసుకునే వాడని వెల్లడైంది. దీంతో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశంను సస్పెండ్ చేస్తూ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. మరో ఘటనలో ఇదే కమిషనరేట్ పరిధిలో ఖమ్మం పట్టణంలో 2022-23 మధ్యకాలంలో ఖమ్మం టూటౌన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సి.హెచ్. శ్రీధర్ స్థానిక విలేకరి ఇంట్లో ఎస్ఎల్ఆర్ తుపాకీ తూటాలు దొరికినట్లు తప్పుడు కేసు బనాయించి పంచనామా రాయించినట్లు తేలింది. ఓ పాత కేసులో ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ నిందితుడికి అనుకూలంగా వ్యవహరిస్తూ సమాచారం ఎప్పటికప్పుడు అతడికి చేరవేసేవాడని ఫిర్యాదు అందింది. అలాగే ఈ కేసు అండర్ ఇన్వెస్టిగేషన్ (యూఐ) జాబితాలో కూడా లేకుండా చేసినట్లు తేలింది. దీనిపై విచారణ చేపట్టిన ఖమ్మం సీపీ.. ఐజీకి అందజేసిన నివేదికలో ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. దీంతో.. ప్రస్తుతం ములుగు జిల్లాలో స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌పై సస్పెన్షన్ వేటు పడింది.

ఐజీ కార్యాలయానికి ముగ్గురి అటాచ్..


ఇక ఇటీవల మెదక్ జిల్లాలో జరిగిన మత కలహాల సమయంలో మెదక్ పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు ఎస్.దిలీప్ కుమార్, బి.కేశవులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు అధికారుల విచారణలో తేలింది. ఇటు భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం పోలీస్‌స్టేషన్ ఎస్సై భవానీసేన్ కేసు వ్యవహారంలో.. మహదేవ్‌పూర్ సీఐ బి.రాజేశ్వర్‌రావు ఎస్సై పనితీరు, వ్యవహార శైలిపై పర్యవేక్షణ లేకుండా నిర్లక్ష్యం వహించినట్లు వెల్లడైంది. దీంతో ఈ ముగ్గురిని తన కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఐజీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య దృశ్యం
ఆదివారం • 23 జూన్ 2024

మన హీరోలు మీసం మెలిపెడుతున్నారు. కయ్యానికి సై అంటున్నారు. కదనరంగంలో చురకత్తుల్లా కదులుతున్నారు. ప్రేక్షకులకు పసందైన యాక్షన్ విందును అందించేందుకు శ్రమిస్తున్నారు. ప్రస్తుతం యాక్షన్ చిత్రాల ట్రెండ్ నడుస్తోంది. జులైలో సెట్స్‌పైన ఉన్న సినిమాల్లో అగ్రహీరోలంతా పోరాటాల బాట పట్టారు. స్టంట్ మాస్టర్ల నేతృత్వంలో సరికొత్త పోరాట ఘట్టాలను వెండితెరపైకి తెచ్చేందుకు సిద్ధమవుతున్నారు.





యాక్షన్ హంగామా

వర్షంలో దేవర పోరాటం

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. సైఫ్ అలీఖాన్ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. చిత్రీకరణ చివరి దశలో ఉంది. ఇటీవలే గోవా షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ఎన్టీఆర్, సైఫ్ పై పీటర్ హెయిన్స్ నేతృత్వంలో గోవా అడవుల్లో భారీ పోరాట ఘట్టాలను తెరకెక్కించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా సైఫ్, ఎన్టీఆర్ ఈ షెడ్యూల్‌లో పాల్గొన్నారు. తదుపరి షెడ్యూల్ థాయ్‌లాండ్‌లో జరుగుతోంది. ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయిక. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

పతాక సన్నివేశాల్లో పుష్ప 2

'పుష్ప 2: ది రూల్' కోసం అల్లు అర్జున్ బరిలోకి దిగారు. ప్రస్తుతం పతాక సన్నివేశాలతో పాటు పాటలు తెరకెక్కిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో ప్రత్యేకంగీ తీర్చిదిద్దిన సెట్‌లో టాకీపార్ట్‌తో పాటు పోరాట ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. రష్మిక మందన్న కథానాయిక. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈచిత్రం డిసెంబర్ 6న విడుదలవుతోంది.

ప్రత్యేక సెట్‌లో

వరుణ్‌తేజ్ హీరోగా నటిస్తున్న తొలి పాన్ ఇండియా చిత్రం 'మట్కా'. వైజాగ్ నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. కరుణ కుమార్ దర్శకత్వంలో విజేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ఈ నెల 19న చిత్రబృందం తాజా షెడ్యూల్‌ను ప్రారంభించింది. భారీసెట్‌లో వరుణ్‌పై యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు కొంత టాకీపార్ట్‌ను తెరకెక్కించనున్నారు.

ప్రేమికుల ఫైట్

అడివిశేష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'డెకాయిట్'. శ్రుతీహాసన్ కథానాయిక. ఇటీవలే హైదరాబాద్‌లో తాజా షెడ్యూల్ మొదలుపెట్టారు. శ్రుతీహాసన్, శేష్‌పై భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. వరుస దోపిడీల కోసం చేతులు కలిపిన ఇద్దరు మాజీ ప్రేమికుల కథ ఇది. ఈ చిత్రానికి అడివిశేష్ కథ, స్క్రీన్‌ప్లే అందించారు. షానీల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు.

భారీసెట్‌లో పోరాటం

ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'కుబేర'. అక్కినేని నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్నారు. రష్మిక మందన్న కథానాయిక. ఈ నెల తొలివారంలో హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్ మొదలైంది. ఈ సినిమాలో కీలకమైన యాక్షన్ సీక్వెన్స్ కోసం భారీసెట్ వేశారు. ఇందులో నాగార్జున, ధనుష్ సహా ఇతర తారాగణంపై భారీ యాక్షన్ సీక్వెన్స్ తెరకెక్కించారు. సరికొత్త కథాంశంతో వస్తున్న ఈ చిత్రానికి సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు నిర్మాతలు.

బరిలోకి బచ్చన్

'మిస్టర్ బచ్చన్' చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు రవితేజ. హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు విలన్ పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రంలో ఇన్‌కంటాక్స్ ఆఫీసర్‌గా రవితేజ అలరించనున్నారు. ఇటీవలే చిత్రబృందం ప్రత్యేకంగా వేసిన సెట్‌లో కీలకమైన యాక్షన్ ఘట్టాలను తెరకెక్కించారు. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక.

పోరాటం షురూ..






మన హీరోలే కాదు కొందరు పరభాషా హీరోలు సైతం యాక్షన్ మోడ్‌లో ఉన్నారు. తమిళ కథానాయకుడు ఆర్య హీరోగా రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'మిస్టర్ ఎక్స్'. ఇటీవలే భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో చిత్రీకరణ పూర్తి చేశారు. పోరాట ఘట్టాల్లో ఆర్య చూపిన తెగువ ప్రశంసనీయం అని చిత్రబృందం తెలిపింది. మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ 'లూసిఫర్ 2: ఎంపురాన్' చిత్రీకరణతో బిజీగా ఉన్నారు. ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను పృథ్వీరాజ్ సుకుమారన్ తెరకెక్కిస్తున్నారు. ఈ నెల ఆరంభంలో కొచ్చిలో ఓ షెడ్యూల్ పూర్తయింది. తాజాగా గుజరాత్‌లో కొత్త షెడ్యూల్ మొదలైంది. ఈ సినిమాకు కీలకమైన పోరాట ఘట్టాలను అక్కడ తెరకెక్కిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. వరుసగా యాక్షన్ చిత్రాలు చేస్తూ వస్తున్నారు అజిత్. ప్రస్తుతం ఆయన 'గుడ్ బ్యాడ్ అగ్లీ, విడాముయార్చి' షూటింగ్స్‌తో తీరిక లేకుండా ఉన్నారు. ఈ చిత్రం చివరి షెడ్యూల్ ఈ నెల 24 నుంచి అజర్‌బైజాన్‌లో మొదలవనుంది. అజిత్‌పై భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు కీలక సన్నివేశాలను తెరకెక్కించనున్నారు. ఇందులో త్రిష కథానాయిక. తిరుమేని దర్శకుడు. దీపావళికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

● 'కేజీఎఫ్' సిరీస్ తర్వాత యశ్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న చిత్రం 'టాక్సిక్'. ఈ చిత్రంలో ఆయన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. ఈ సినిమా భారీ షెడ్యూల్‌ను చిత్రబృందం యూకేలో జరపనుంది. అక్కడే యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు కీలక సన్నివేశాలను తెరకెక్కించనున్నారు.

● వరుసగా విలన్ పాత్రలతో అలరిస్తూ వస్తున్నారు సైఫ్ అలీఖాన్ హీరోగా 'జ్యువెల్ థీఫ్' పేరుతో ఓ చిత్రం వస్తోంది. రాబీ గ్రేవాల్ దర్శకత్వం వహిస్తున్నారు. సిద్ధార్థ్ ఆనంద్ నిర్మాత. యాక్షన్ అడ్వంచర్‌లో సైఫ్ ఒళ్లు గగుర్పొడిచే స్టంట్స్ చేశారు. ఇటీవలే ఆయన ఈ సినిమా చిత్రీకరణ ముగించారు.

కమల్ లుక్ చూసి ఆశ్చర్యపోయా

- ఎస్.ఎస్.రాజమౌళి



దర్శకధీరుడు రాజమౌళి 'కల్కి 2898 ఏ.డీ' సినిమా ట్రైలర్‌పై ప్రశంసల వర్షం కురిపించి.. చిత్ర బృందానికి, అభిమానులకు ఎక్కడలేని జోష్ ఇచ్చారు. "ట్రైలర్ చూశాను. అద్భుతంగా ఉంది. విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్ నాకు విపరీతంగా నచ్చేశాయి. సినిమాను మొదటి రోజు మొదటి ఆట చూడటానికి కావాల్సిన ఆసక్తి, ఉత్సాహం వచ్చింది. సినిమాలో ప్రధాన పాత్రధారులైన ప్రభాస్, అమితాబ్, దీపిక పాత్రలు థియేటర్లలో ప్రేక్షకులను కట్టిపడేసేలా ఉన్నాయి. ఇక, కమల్ హాసన్ లుక్ చూసి ఆశ్చర్యపోయా. చాలాసేపటి వరకూ ఆయన లుక్ ఇచ్చిన ట్రాన్స్‌లోనే ఉండిపోయా. అందరిలాగే, డైరెక్టర్ నాగ్‌అశ్విన్ చూపించే కొత్త ప్రపంచాన్ని థియేటర్లలో చూడటం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా, ప్రభాస్ నటించిన ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు నాగ్‌అశ్విన్ దర్శకత్వం వహించగా, అశ్వనీ దత్ నిర్మించారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, పశుపతి, స్వాస్థ చటర్జీ, దీపికా పదుకొనే, దిశా పటానీ, మాళవిక నాయర్, శోభన, అన్నా బెన్ కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 27న సినిమాను ఐదు భారతీయ భాషలతో పాటు ప్రపంచవ్యాప్తంగా మరిన్ని భాషల్లో విడుదల చేయనున్నారు.

సోదరుడి కోసం ఎంతకైనా తెగిస్తా..

బాలీవుడ్ నటి అలియా భట్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'జిగ్రా'. వసన్ బాలా దర్శకత్వం వహిస్తున్నారు. 'ఆర్చీస్' ఫేమ్ వేదాంగ్ రైనా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇటీవలే ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడిన అలియా.. ఈ సినిమా గురించి పలు ఆసక్తికర విషయాలను తెలియజేశారు.

"ఇందులో నా పాత్రే కాదు.. లుక్ కూడా చాలా భిన్నంగా ఉండబోతోంది. ఈ సినిమా సెట్స్‌లో ఉన్నప్పుడు అస్సలు టైమ్ తెలియలేదు. దీని క్కారణం మా చిత్రబృందం. ఈ సినిమా షూటింగ్ సమయంలో ఎన్నో గుర్తుండిపోయే సంఘటనలు జరిగాయి. డైరెక్టర్ వసన్ బాలాతో పనిచేయడం ఆనందంగా ఉంది. ఆయన చాలా కూల్‌గా ఉంటారు. సెట్స్‌లో ఆయన నుంచి చాలా నేర్చుకున్నాను. ఆయన రచనా శైలి, ఆలోచనలు అబ్బురపరుస్తాయి. ఇక వేదాంగ్ రైనా సినిమాలో నాకు సోదరుడిగా కనిపిస్తారు. సినిమాలో మా ఇద్దరి మధ్య ఉన్న అనుబంధం ఆకట్టుకుంటుంది. సోదరుడి కోసం ఎంతకైనా తెగించే పాత్ర నాది" అని చెప్పారు. ఈ సినిమా సెప్టెంబరులో విడుదల కావాల్సి ఉన్నా..అక్టోబరు 11కు వాయిదా పడింది.





బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా, జహీర్ ఇక్బాల్‌ల పెళ్లి సందడి మొదలైంది. ఈ వేడుకల్లో భాగంగా శనివారం ముంబైలో సోనాక్షి ఇంటి వద్ద మెహందీ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలో ఇరు కుటుంబాలకి చెందిన బంధుమిత్రులు, స్నేహితులు పాల్గొన్నారు. ఈ రోజు సాయంత్రం ఎనిమిది గంటలకు సోనాక్షి సిన్హా, జహీర్ ఇక్బాల్‌ల పెళ్లి జరుగుతుంది.


మా కుటుంబానికి ఆ సినిమా టైటిల్ సరిపోతుంది

సినిమా సినిమాకి వైవిధ్యమైన పాత్రలతో దూసుకుపోతున్నారు బాలీవుడ్ నటి సారాలీ ఖాన్. ఇటీవలే ఆమె 'మర్డర్ ముబారక్', 'యే వతన్ మేరే వతన్' చిత్రాల్లో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇటీవల ఓ ఆంగ్ల మీడియాతో ముచ్చటించిన ఈ బ్యూటీ.. సినిమాలతో పాటు పలు వ్యక్తిగత విషయాలను పంచుకున్నారు.

"వరుసగా సవాల్ విసిరే పాత్రల్లో నటించడం ఎంతో కొత్త అనుభూతినిస్తుంది. ఒకేసారి రెండు విభిన్న కథలు.. నేపథ్యాలున్న సినిమాల్లో నటిస్తే.. రెండు వేర్వేరు ప్రపంచాల్లో పయనించినట్లు అనిపిస్తుంది. 'మర్డర్ ముబారక్', 'యే వతన్ మేరే వతన్' సినిమాల్లో ఒకేసారి నటించడం ద్వారా నాకు ఈ అనుభవం సొంతమైంది. మాది చాలా పెద్ద కుటుంబం. నానమ్మ షర్మిలా ఠాగూర్, నాన్న సైఫ్ అలీఖాన్, అత్త సోహా అలీఖాన్‌ను ఎప్పుడు కలసినా మా మధ్య ఉండే కామన్ టాపిక్ సినిమా. మా ఫ్యామిలీకి ఒక సినిమా టైటిల్‌ను సూచించవలసి వస్తే.. అది సూపర్ హిట్ మూవీ 'కభీ ఖుషీ కభీ గమ్' అతికినట్లు సరిపోతుంది" అని చెప్పారు.








ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
వరస్ట్ రూమ్మేట్ ఎవర్ 2	వెబ్‌సిరీస్	జూన్ 26
సుపాసెల్	వెబ్‌సిరీస్	జూన్ 27
దట్ నైన్టీస్ షో	వెబ్‌సిరీస్ 2	జూన్ 27
మై లేడీ జానీ	వెబ్‌సిరీస్	జూన్ 27
ఎ ఫ్యామిలీ ఎఫైర్	హాలీవుడ్ మూవీ	జూన్ 28
ఓనింగ్ మాన్‌హట్టన్	వెబ్‌సిరీస్	జూన్ 28
ది వర్ల్‌విండ్	కొరియన్ సిరీస్	జూన్ 28
అమెజాన్ ప్రైమ్		
సివిల్ వార్	తెలుగు డబ్బింగ్	జూన్ 28
శర్మాజీకీ బేటీ	హిందీ చిత్రం	జూన్ 28
జీ 5		
రౌతూ కా రాజ్	హిందీ చిత్రం	జూన్ 28
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ది బేర్	వెబ్‌సిరీస్	జూన్ 27
ఆపిల్ టీవీ ప్లస్		
ల్యాండ్ ఆఫ్ ఉమెన్	హాలీవుడ్ మూవీ	జూన్ 26
ఫ్యాన్సీ డాన్స్	హాలీవుడ్ మూవీ	జూన్ 28

గురుదక్షిణ చెల్లించుకున్న హీరో కృష్ణ

చిత్ర పరిశ్రమలో కృతజ్ఞత అనే పదానికి అర్థం తెలిసిన హీరోలు కొందరే ఉంటారు. వారిలో మొదటి వరుసలో వుండే వ్యక్తి హీరో కృష్ణ. 'తేనెమనసులు' చిత్రంతో తనని హీరోగా పరిచయం చేసి, వృద్ధిలోకి రావడానికి కారణమైన దర్శకుడు ఆదుర్తి సుబ్బారావును ఆదుకొని అవసర కాలంలో 'మాయదారి మల్లిగాడు' చిత్రం చేసి కృష్ణ గురుదక్షిణ చెల్లించుకున్నారని చెప్పాలి. ఎందుకంటే ఈ చిత్ర నిర్మాణ సమయానికి ఆదుర్తి సుబ్బారావుకు తెలుగులో సినిమాలు లేవు. హిందీ ఫీల్డ్‌కి వెళ్లి కొన్ని చిత్రాలు చేసి దెబ్బతిని అక్కడ ఇమడలేక చెన్నై తిరిగి వచ్చారు. మళ్లీ తెలుగులో చిత్ర నిర్మాణం కొనసాగించాలని ఆదుర్తి నిర్ణయించుకున్నారు. 'తేనె మనసులు' తరహాలో అంతా కొత్తవారితో సినిమా తీయడానికి సన్నాహాలు ప్రారంభించి, హీరోగా శరత్ బాబుని ఎంపిక చేశారు. అయితే పరిశ్రమలోని ఆదుర్తి సుబ్బారావు శ్రేయోభిలాషులు ఆయన ప్రయత్నాన్ని వారించారు. 'ఇప్పటికే ఆర్థికంగా దెబ్బ తిన్నావ్. కొత్తవాళ్లతో సినిమా తీసి మళ్లీ రిస్క్ చేయడం ఎందుకు? నువ్వు పరిచయం చేసిన హీరో కృష్ణ ఇప్పుడు మంచి పొజిషన్లో ఉన్నాడు. వెళ్లి అతని డేట్స్ అడుగు' అని సలహా ఇచ్చారు. సరేనని ఒక రోజు వెళ్లి కృష్ణను కలిశారు ఆదుర్తి. ఆయన అడిగిన వెంటనే వివరాలు ఏమీ అడగకుండా సినిమా చేయడానికి అంగీకరించి వెంటనే డేట్స్ ఇచ్చేశారు కృష్ణ. ఆ సమయంలో చాలా మంది నిర్మాతలు ఆయన డేట్స్ కోసం క్యూ లో ఉన్నారు. అయితే గురువు తర్వాతే ఎవరైనా అని అనుకోవడం కృష్ణ మంచితనానికి నిదర్శనం.



బ్లాక్ అండ్ వైట్ నుంచి కలర్‌కు

'మాయదారి మల్లిగాడు' చిత్రాన్ని మొదట బ్లాక్ అండ్ వైట్ లో నే నిర్మించాలనుకున్నారు ఆదుర్తి సుబ్బారావు. అన్నపూర్ణ డిస్ట్రిబ్యూటర్స్‌తో మాట్లాడితే వాళ్లు సినిమాను డిస్ట్రిబ్యూట్ చేయడానికి అంగీకరించారు. అయితే సినిమాలు బ్లాక్ అండ్ వైట్ లోనే తీయాలని, రూ. ఎనిమిది లక్షలు మాత్రమే పెట్టుబడి పెడతామని వాళ్లు షరతు విధించడంతో ఆదుర్తి సరేనన్నారు. ఆ విషయం కృష్ణ కి తెలిసి 'నాలాంటి కొత్త వాడితోనే కలర్ సినిమా తీసిన గ్రేట్ డైరెక్టర్ మీరు. ఇప్పుడు బ్లాక్ అండ్ వైట్ లో తీయడం ఏంటి సార్.. కలర్ లోనే తీద్దాం. ఫిల్మ్ నేను ఏర్పాటు చేస్తాను' అనడంతో ఆదుర్తి కాదనలేకపోయారు. ఆ రోజుల్లో కలర్ ఫిల్మ్ ఓపెన్ మార్కెట్లో లభ్యమయ్యేది కాదు. అయినా తన పరపతిని ఉపయోగించి ఫిల్మ్ సంపాదించారు కృష్ణ.


గళ్ల లుంగీ.. లాల్చీ

సోషల్ క్యారెక్టర్స్‌లో హీరో కృష్ణ ను చాలా విభిన్నంగా చూపించిన చిత్రం 'మాయదారి మల్లిగాడు'. గళ్ళ లుంగీ, పల్చటి లాల్చీ, మెడలో స్కార్ఫ్, నడుముకి లావుపాటి బెల్ట్, చేతిలో కర్ర... సినిమా అంతా ఇలాంటి గెటప్ లోనే కనిపిస్తారు కృష్ణ. అన్యాయాన్ని, అక్రమాన్ని ఎదిరించే పాత్ర ఆయనది. అందమైన రౌడీ ఇలా ఉంటాడన్న మాట అనిపించే విధంగా హీరో కృష్ణ గెటప్ కుదిరింది. ఆయనతో మంజుల కలసి నటించిన తొలి చిత్రం ఇదే. అంతకుముందు తెలుగులో కొన్ని చిత్రాల్లో ఆమె నటించినప్పటికీ హీరోయిన్ గా చేసిన తొలి సినిమా ఇదే. ఈ చిత్రంలో మంజుల అందచందాలు ఆనాటి యువతరాన్ని పిచ్చెక్కించాయి. కృష్ణ పారితోషికం కాకుండా రూ 11 లక్షలతో మాయదారి మల్లిగాడు చిత్రం పూర్తయింది. గుంటూరు ఏరియా హక్కుల్ని తన పారితోషికంగా తీసుకున్నారు కృష్ణ. మాయదారి మల్లిగాడు చిత్రం ఘన విజయం సాధించింది. 40 రోజులకు 13 లక్షల రూపాయలు వసూలు చేసిన ఈ చిత్రాన్ని కొన్ని కేంద్రాల్లో 49 వ రోజునే పంపిణీ సంస్థ అన్నపూర్ణ పిక్చర్స్ తీసేయడం ఆ రోజుల్లో కృష్ణ అభిమానుల ఆగ్రహానికి గురైంది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● ఆదివారం 23 జూన్ 2024
diksuchi@andhrajyothy.com

తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్‌లో
సివిల్స్ లాంగ్ టర్మ్ కోచింగ్

హైదరాబాద్-సైదాబాద్‌లోని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్- సివిల్స్(ప్రిలిమ్స్, మెయిన్స్) లాంగ్ టర్మ్ కోచింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఫుల్ టైమ్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. రాష్ట్రానికి చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, అనాథ అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్ స్ర్కీనింగ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులకు 2024 జూలై 18 నుంచి 2025 ఏప్రిల్ 18 వరకు తరగతులు నిర్వహిస్తారు. శిక్షణ పూర్తిగా ఉచితం. భోజనం, వసతి, రవాణా ఖర్చుల కోసం నెలకు రూ.5,000ల స్టయిపెండ్ ఇస్తారు. టీ, స్నాక్స్ కోసం రోజుకి రెండుసార్లు రూ.25లు ఇస్తారు. బుక్ ఫండ్ కింద రూ.5000ల నగదు చెల్లిస్తారు. లైబ్రరీ సౌకర్యం ఉంది.



సీట్ల వివరాలు: ఆన్‌లైన్ స్ర్కీనింగ్ టెస్ట్ ద్వారా 100 మందికి అవకాశం కల్పిస్తారు. 32 ఏళ్లలోపు వయసు ఉండి గతంలో సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్ ఎగ్జామ్ రాసిన మరో 50 మందికి నేరుగా అడ్మిషన్స్ ఇస్తారు. వీరు స్ర్కీనింగ్ టెస్ట్ రాయనవసరం లేదు. సంబంధిత ధ్రువపత్రాలతో తమ దరఖాస్తును టీజీ బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సబ్మిట్ చేయాలి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్(సీశాట్) 2025కు నిర్దేశించిన అర్హతలన్నీ ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షలు మించకూడదు. అభ్యర్థులు నిరుద్యోగులై ఉండాలి. ఇతర కోర్సులు చేస్తున్నవారు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తత్సమాన ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లో చేరినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థులు సీశాట్ 2025కి దరఖాస్తు చేయని పక్షంలో వారిని అడ్మిషన్ లిస్ట్ నుంచి తొలగిస్తారు. వీరు శిక్షణ సమయంలో అందుకున్న స్టయిపెండ్, బుక్‌ఫండ్ తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది.

అభ్యర్థులకు ప్రతి నెలా కనీసం 75 శాతం అటెండెన్స్ ఉంటేనే స్టయిపెండ్ ఇస్తారు.
కోచింగ్ ప్రారంభమైన నాటి నుంచి రెండో నెలలో కనీసం 60 శాతం అటెండెన్స్ ఉంటేనే బుక్ ఫండ్ ఇస్తారు.

ఆన్‌లైన్ స్ర్కీనింగ్ టెస్ట్: ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. మొదటి పేపర్లో జనరల్ స్టడీస్ నుంచి 100 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. రెండో పేపర్లో రీజనింగ్, అర్థమెటిక్, ఇంగ్లీష్ కాంప్రహెన్షన్ అంశాల నుంచి 50 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ ఎగ్జామ్(సీఎస్‌పీ పేపర్ 1, సీశాట్ పేపర్ 2) సిలబస్ ప్రకారమే ఉంటాయి. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

ముఖ్య సమాచారం
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 3
- **ఆన్‌లైన్ స్ర్కీనింగ్ టెస్ట్ తేదీ:** జూలై 7
- **టెస్ట్ ఫలితాలు విడుదల:** జూలై 10
- **తరగతులు ప్రారంభం:** జూలై 18 నుంచి
- **చిరునామా:** టీజీ బీసీ స్టడీ సర్కిల్, లక్ష్మీ నగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్-500059
- **వెబ్‌సైట్:** www.tgbcstudycircle.cgg.gov.in, https://studycircle.cgg.gov.in/

విశాఖ ఐఐపీఈలో బీటెక్



విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ)- బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024 స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రోగ్రామ్ తోపాటు డిప్లొమా ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తిచేసి క్యాట్ స్కోర్ లేకుండానే ఐఐఎం విశాఖపట్నంలో ఎంబీఏ చదివే వీలుంది.

విభాగాలు-సీట్లు: పెట్రోలియం ఇంజనీరింగ్‌లో 62 సీట్లు, కెమికల్ ఇంజనీరింగ్‌లో 63 సీట్లు, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 40 సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 65 శాతం మార్కులు చాలు. అభ్యర్థులందరికీ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 అర్హత తప్పనిసరి.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 5
- **ఫస్ట్ అడ్మిషన్ లిస్ట్ విడుదల:** జూలై 6
- **ఫస్ట్ రౌండ్‌లో ఎంపికైనవారు అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 10
- **సెకండ్ అడ్మిషన్ లిస్ట్ విడుదల:** జూలై 11
- **సెకండ్ రౌండ్ అభ్యర్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 15
- **థర్డ్ అడ్మిషన్ లిస్ట్ విడుదల:** జూలై 19
- **థర్డ్ రౌండ్ అభ్యర్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 22
- **మొదటి మూడు రౌండ్ల అభ్యర్థుల ఫిజికల్ రిజిస్ట్రేషన్:** జూలై 25
- **ఫోర్త్ అడ్మిషన్ లిస్ట్ విడుదల:** జూలై 26
- **ఫోర్త్ రౌండ్ అభ్యర్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 30
- **ఓరియంటేషన్ ప్రోగ్రామ్:** ఆగస్టు 5
- **అకడమిక్ సెషన్ ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- **వెబ్‌సైట్:** iipe.ac.in

ఓయూలో లేటరల్ ఎంట్రీ

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన 'యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్- బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో లేటరల్ ఎంట్రీకి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. 'కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీప్)' కింద నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రామ్‌లను డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఈ/బీటెక్ రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 30 సీట్లు చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. సాయంత్రం సమయాల్లో ఆరు నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు రూ.50,000.

అర్హత: తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ లేదా గుర్తింపు పొందిన బోర్డు నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. ఏఐ&ఎంఎల్ స్పెషలైజేషన్‌కు ఏ విభాగంవారైనా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఈ/ఏఐ/ఏఐడీ/ఏఐఎం/సీఎంఈ/సీఎస్‌బీ/సీఎస్‌సీ/సీఎస్‌డీ/సీఎస్‌జీ/సీఎస్ఐ/సీఎస్ఎం/సీఎస్ఎన్/సీఎస్‌ఓ/సీఎస్‌టీ/సీఎస్‌డబ్ల్యూ/సీఐసీ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు. జనరల్ అభ్యర్థులకు కనీసం 45 శాతం, రిజర్వ్‌డ్ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థులందరికీ కనీసం ఏడాది ఫుల్ టైమ్ ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి.

ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 36 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 15 శాతం మార్కులు రావాలి. పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 11
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** డిప్లొమా సర్టిఫికెట్-మార్కుల పత్రాలు, టీసీ, మైగ్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, పదోతరగతి సర్టిఫికెట్, ఆరో తరగతి నుంచి డిప్లొమా వరకు స్టడీ సర్టిఫికెట్లు, సర్వీస్ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, జిరాక్స్ కాపీలు, రెండు ఫోటోలు.
- **ఎంట్రెన్స్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 18
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 21
- **మొదటి ఫేజ్ కౌన్సెలింగ్:** జూలై 27
- **రెండో ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 3
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in



జాబ్ కార్నర్

ఎండీఎస్ఎల్‌లో అప్రెంటిస్‌లు
ఖాళీలు 518

ముంబయిలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ట్రేడులు: డ్రాఫ్ట్స్‌మన్(మెకానికల్), ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, పైప్ ఫిట్టర్, స్ట్రక్చరల్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వెల్డర్, కార్పెంటర్, రిగ్గర్, వెల్డర్ ఎలక్ట్రికల్ తదితరాలు

అర్హత: ఖాళీని అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 అక్టోబరు 1 నాటికి గ్రూప్-ఎ 15 నుంచి 19 ఏళ్లు; గ్రూప్-బి 16-21 ఏళ్లు, గ్రూప్ సి 14-18 ఏళ్ల మధ్య ఉండాలి.

స్టయిపెండ్: నెలకు గ్రూప్ ఎ -రూ.6600, గ్రూప్ బి-రూ.8050 - రూ.7700, గ్రూప్ సి-రూ.2500 - రూ.5500 వరకు చెల్లిస్తారు.

దరఖాస్తు రుసుము: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, స్కిల్/ట్రేడ్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 26

వెబ్‌సైట్: https://www.mazagondock.in/

హెచ్‌ఏఎల్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్‌లు
ఖాళీలు 51

బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్)...కింద పేర్కొన్న ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ వర్క్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెటలర్జీ, ఫిట్టర్, గ్రైండర్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, బీఏ/బీఎస్సీ/బీకాం, ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత ఉండాలి.

వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ(ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు, పీడబ్ల్యూ అభ్యర్థులకు పదేళ్లు, ఎక్స్-సర్వీస్‌మెన్‌కు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

జీతం: నెలకు డిప్లొమా టెక్నీషియన్ పోస్టుకు రూ.48,511. ఎస్సీ, ఎస్టీ, ఎక్స్ సర్వీమెన్, దివ్యాంగులకు ఫీజు మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 26

వెబ్‌సైట్: https://halindia.co.in/home

ఎన్ఐఎన్‌లో క్లర్క్‌లు
ఖాళీలు 14

హైదరాబాద్‌లోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్)- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్ఐఎన్)... డైరెక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. లోయర్ డివిజన్ క్లర్క్: 6 పోస్టులు
2. లైబ్రరీ క్లర్క్: 1 పోస్టు
3. లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్: 1 పోస్టు

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్, సంబంధిత విభాగంలో డిగ్రీ, సర్టిఫికెట్ కోర్సు, కంప్యూటర్/టైపింగ్ పరిజ్ఞానం, పని అనుభవం కలిగి ఉండాలి.

వయోపరిమితి: ఎల్‌డీసీ/యూడీసీ పోస్టులకు 27 ఏళ్లు, లైబ్రరీ క్లర్క్‌కు 28, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్‌కు 30 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ.1200, ఎస్సీ/ఎస్టీ/మహిళలు/ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు రూ.1000. దివ్యాంగులకు ఫీజు మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా

దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 25

వెబ్‌సైట్: https://www.nin.res.in/

బ్యాంక్ ఆఫ్ బరోడాలో వివిధ ఖాళీలు
ఖాళీలు 168

వడోదర(గుజరాత్)లోని బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రధాన కార్యాలయం... రెగ్యులర్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా బీఓబీ శాఖల్లో కింద పేర్కొన్న ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. ఫారెక్స్ అక్విజిషన్ అండ్ రిలేషన్‌షిప్ మేనేజర్: 15
2. క్రెడిట్ అనలిస్ట్: 80
3. రిలేషన్‌షిప్ మేనేజర్: 66
4. సీనియర్ మేనేజర్ బిజినెస్ ఫైనాన్స్: 4
5. చీఫ్ మేనేజర్ ఇంటర్నల్ కంట్రోల్స్: 3

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, సీఏ/సీఎంఏ/సీఎస్/సీఎఫ్ఏ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.



ఎంపిక విధానం: ఆన్‌లైన్ టెస్ట్, సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తదితరాలు

ఫీజు: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.600. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు రూ.100.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 2

వెబ్‌సైట్: https://www.bankofbaroda.in/

పీఎంబీఐలో ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ మేనేజర్లు
ఖాళీలు 44

న్యూఢిల్లీలోని ఫార్మాస్యూటికల్స్ అండ్ మెడికల్ డివైజెస్ బ్యూరో ఆఫ్ ఇండియా... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ మేనేజర్: 10
2. సీనియర్ మార్కెటింగ్ ఆఫీసర్: 12
3. ఎగ్జిక్యూటివ్: 12
4. సీనియర్ ఎగ్జిక్యూటివ్: 10

విభాగాలు: సేల్స్ అండ్ మార్కెటింగ్, ప్రొక్యూర్‌మెంట్, క్వాలిటీ, లాజిస్టిక్స్ అండ్ సప్లయి చైన్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, ఐటీ అండ్ ఎంఐఎస్, హెచ్‌ఆర్ అండ్ అడ్మిన్, లీగల్.

అర్హత: సంబంధిత విభాగాల్లో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి

ఎంపిక విధానం: దరఖాస్తుల స్ర్కీనింగ్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను పోస్టు/కొరియర్ ద్వారా సీఈఓ, పీఎంబీఐ, బీ-500, టవర్ బీ, ఐదో అంతస్తు, వరల్డ్‌ట్రేడ్ సెంటర్, నౌరోజీనగర్, న్యూఢిల్లీ చిరునామాకు పంపాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 8 **వెబ్‌సైట్:** https://janaushadhi.gov.in/

లిటిల్స్

విద్యా ధనం


ఒక ఊరిలో రాజు, రాము అనే ఇ మిత్రులు ఉండేవారు వారిలో రాము శ్రద్ధగా చదువుకునే మంచి విద్యార్థి, రాజు కొంచెం బధకస్తుడు, అందరూ రామును మెచ్చుకుంటూ ఉంటే రాజుకు అసూయగా, కోపంగా ఉండేది. ఎలాగైనా రామును అందరూ మెచ్చకుండా చేయాలని, రాజు ఒకసారి పరీక్షకు ముందు రోజు రాము పుస్తకాలన్నిటినీ బావిలో పడవేశాడు. పుస్తకాలు చదవలేనిరాము ఆ మర్నాడు జరిగే పరీక్ష రాయలేక బాధ పడతాడని రాజు అనుకున్నాడు. ఆ మర్నాడు రాము ఎప్పటిలాగే పరీక్ష రాసి, మంచి మార్కులు తెచ్చుకున్నాడు.




తన పుస్తకాలన్నిటినీ పోగొట్టుకున్నానని రాము చెప్పడం గుర్తున్న రాజు రాము దగ్గరకు వెళ్లి, పుస్తకాలు పోయినా పరీక్ష ఎలా రాయగలిగావని అడిగాడు.దానికి రాము నేను ఏ రోజు జరిగిన పాఠం ఆ రోజే చదివి, మననం చేసుకుంటాను. కాబట్టి కేవలం పరీక్ష ముందు రోజే చదివే అవసరం లేకకుండా నేను ఏ సమయంలో పరీక్ష పెట్టినా రాయగలను అన్నాడు ఆ మాటలు విన్న రాజు తరగతిలో గురువుగారు ఎవ్వరూ దోచలేని ధనమే విద్యా ధనం అని ఎందుకు చెప్పారో అర్థమైంది.

ఆ రోజునుండి రాజు కూడా ఏ రోజు విన్న పాఠాలు, ఆ రోజే నేర్చుకోవడం మొదలు పెట్టాడు.


దారి కనుక్కోండి



జంతువులు ఎన్ని?



జత ఉన్న బొమ్మ ఏది?



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 340

				9	5			
	3				7		4	2
5	6							8
4			2		6			
	7						3	
			5		9			4
8							1	7
2	4		7				8	
			6	2				

సుడోకు - 339 సమాధానం

1	4	9	2	7	8	5	3	6
8	7	5	6	3	1	2	4	9
6	2	3	9	5	4	8	1	7
9	6	2	4	8	7	1	5	3
7	1	8	5	2	3	6	9	4
3	5	4	1	6	9	7	8	2
4	8	6	3	1	2	9	7	5
5	9	1	7	4	6	3	2	8
2	3	7	8	9	5	4	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.